సంపుటిః 35
సంచికః 3

ఫోన్ నెం.
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

అక్టోబరు, 1982

Kattukolu Subba Reddy
Home Library, Pedacgirala.
S. P. BOOK STALLS
Jakkampudi Prasad
Gandhinagar
VIJAYAWADA-3

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ్ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
ఏ. పి. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

మీ ఉత్తరాలు

సప్లిమెంట్ ముఖచిత్రాలు ఆకర్షణీయంగా వున్నాయి. కథలలో 'అన్నపూర్ణమ్మ హస్తం', 'ఛాయరు సలహా' మంచి స్టాండర్డులో వుండి మమ్మల్ని ఆకట్టుకున్నాయి 'కుక్క గొడుగుల్ని తినకు', 'ఆస్తికోసం అడ్డవారి. కథలు పరవాలేదు.

—ఎన్. శివానంద్, బెల్లంపల్లి.

'రక్తపు జేర్లు' సీరియల్ చదువుతున్న కొద్ది ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నది. ఇంత మంచి సీరియల్ అందిస్తున్న వసుంధర గారికి నా అభినందనలు తెలియజేయండి.

—వి.వి.వి. సత్యనారాయణమూర్తి, రాజమండ్రి.

మూడు సీరియల్స్ వచ్చేనెల పత్రికల కోసం ఎదురు చూసేటట్లు చేస్తున్నాయి. మృత్యులోయ, నడమంత్రపు సిరి - నవలలు చాలా బాగున్నాయి. రచయితలకు మా అభినందనలు.

—వై. వెంకటేశ్వరరావు, కంటిబంజి.

అన్నపూర్ణమ్మ హస్తం, నేరం ఒకరిది శిక్ష మరొకరిది, కుక్క గొడుగుల్ని తినకు - కథలు అద్భుతంగా వున్నవి. సప్లిమెంట్‌లో సికిందర్. వసుంధరగారి నవలలు ఆసక్తికరంగా వున్నవి. 'కాంచన గ్రహం' సూపర్ ఫైన్.

—అరుణా రాజేష్, అనకాపల్లి.

ఆగస్టు నెల రెండు సంచికల ముఖచిత్రాలు చాలా స్పష్టంగా, మనోహరంగా వున్నాయి. రాజేశ్వరిగారి 'ప్రతీకారం' కథ సస్పెన్స్‌లో వుంచి ఆఖరికి దోషిని బయటపెట్టిన తీరు బాగుంది. 'కాంచన గ్రహం' వైజ్ఞానికంగా సాగి రసవత్తరంగా వుంటోంది. బావిలోపడ్డ.... కథ డిటెక్షన్ బాగుంది.

—బి. రాజేశ్వరమూర్తి, మచిలీపట్టణం.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. మంత్రగాడి మహిమ—క్రిష్ణవేణి
15. మతిలేని మనిషి—దివాకర్ల సన్యాసిరావ్
29. దెయ్యాల కొంప—బొమ్మిడి అచ్చారావు
42. ఒకే దెబ్బకు పిట్టలెన్నో?—జొన్నలగడ్డ రామలక్ష్మి
57. మృత్యుతార— (సీరియల్)—గిరిజ శ్రీ భగవాన్
80. పునిస్త్రీ చావు—కురుమద్దాలి విజయలక్ష్మి
104. బ్యాంకు దోపిడి—బి. రాజేశ్వరి
121. దొంగలకు సెంటిమెంట్స్ వుండవు—భమిడిపాటి భాస్కర రామారావు
141. కిడ్నాపర్స్ గ్యాంగ్—వసుంధర
156. ముక్కోణపు ఆట—ఎమ్.వి.వి. సత్యనారాయణ
173. కాంచన గ్రహం...(సీరియల్)—వాణిశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. శాపగ్రస్తుడు—వసుంధర
44. మూడు జతల వేలిముద్రలు—బొమ్మిడి అచ్చారావు
81. భయంకర హత్యలు—టెంపోరావు
106. కత్తిమీద గీతలు—సికిందర్
159. రక్తపు పేర్లు—(సీరియల్)—వసుంధర.

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

మంత్రగాడి మహిమలు

కృష్ణవేణి

ఇనస్పెక్టరు పళనివేలు పోలీసు స్టేషనులోకి అడుగుపెట్టిన సమయంలో సార్జంటు తంగం విచారంగా కూర్చొని వున్నాడు.

"తంబీ! ఏమైనా పర్సనల్ ప్రాబ్లమ్సా? అలా విచారంగా కూర్చున్నావేం?" అని అడిగాడు.

తంగం తల ఎత్తలేదు.

"మీ ఆవిడని సినిమాకి తీసుకొని వెళ్ళడానికి పర్మిషన్ కావాలంటే తీసుకోవోయ్" నవ్వుతూ అన్నాడు.

"మా ఆవిడ లేదు సార్!"

"ఎక్కడికి వెళ్ళింది!"

"వాళ్ళ అక్కా వాళ్ళతో టూరు వెళ్ళింది!"

"మరి! సంతోషంగా వుండి ఎంజాయ్ చేయకా ఏమిటా ఏడుపు మొహం" కవ్విస్తూ అన్నాడు.

"సార్! యీ మధ్యన మనకి సరైన కేసులు తగలక పోవడం వలన మన పేర్లు 'అపరాధ పరిశోధన'లో రావడంలేదు సార్! అందుకే విచారం" ఏడుపు మొహం పెట్టి అన్నాడు.

"ఓహో యిదా నీ బాధ" అని పకపకా నవ్వాడు.

నవ్వి నవ్వి "తంగం! ప్రజలు మంచివాళ్ళుగా ఉన్నందుకు సంతోషించాలి గానీ వాళ్ళు తోటి మనుష్యులను చంపడంలేదే అని బాధ పడకూడదు. ఒక సామాన్య వ్యక్తిలా పుస్తకంలో పేరు కోసం మురిసిపోకూడదు. దేనికైనా ఓ...."

"సార్!....సార్!" అంతలో అరవై సంవత్సరాల వ్యక్తి ఆత్రంగా స్టేషన్ లోపలికి వచ్చాడు.

"రండి! వచ్చి యిలా కూర్చోండి" సంతోషంగా సార్జంటు తంగం ఆహ్వానించాడు.

ఆయన వచ్చి వుసూరుమని కూర్చుంటూ "సార్! రెండు రోజుల నుండి నా కొడుకు కనిపించడంలేదు" అని చెప్పి గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు.

"చెప్పండి. మీ కొడుకు వయస్సు, పనిపాటలు, అతని స్వభావం. అతను కనిపించడం లేదంటే మీరేమనుకుంటు

న్నారో—అన్నీ మనస్సు విప్పి చెప్పండి" పళనివేలు అన్నాడు.

"సార్! నా కొడుకు పేరు ఆనందు. వయస్సు ఇరవై ఆరు సంవత్సరాలు. అంబత్తూరులోని ఒక సోపు ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం పెండ్లి అయింది. పిల్లలు లేరు.

రెండు రోజుల క్రితం నా కొడుకు పని చేస్తున్న ఫ్యాక్టరీ యజమాని కూతురు అమెరికా నుండి పెద్ద చదువులు చదువుకొని వచ్చిన సందర్భంలో ఫ్యాక్టరీలో వుండే వాళ్ళందరికీ నూరు రూపాయలు బోనస్‌గా యిచ్చారట. ఓ యాభై ఇంటికి ఖర్చుపెట్టాడు...." అని ఆగాడు.

"మిగిలిన యాభై ఏం చేశాడు?"

ఆయన కొంచెం తటపటాయించి "మా వాడికి తాగుడు అలవాటు వుంది. తాగడానికి పెట్టుకున్నాడు. అదే రోజు నుండి కనిపించటం లేదు—"

"తాగి ఎక్కడో పడివున్నాడేమో?" కోపాన్ని దిగ మింగుతూ అన్నాడు తంగం.

"అలా పడిపోయే, ఒకచోట వుండిపోయే మనిషి కాదు" ముసలాయన విచారంగా అన్నాడు.

ఇంకా కొన్ని వివరాలు అడిగి వాళ్ళ యింటి అడ్రస్సు, ఫోటో తీసుకొని పంపిస్తూ—"పోనీ టి.వి.లో ప్రకటన యివ్వలేకపోయారా!" అని యథాలాపంగా అన్నాడు.

"టి.వి.లో ప్రకటించడం ప్రయోజనం లేనిదని, డబ్బు ఖర్చు అని యివ్వలేదుసార్: చిన్న పిల్లవాడు కాదు కదా!" అన్నాడు.

ఆయన లేచి సమస్కరించి వెళ్ళిపోయాడు.

"తాగి ఎక్కడో పడివుంటాడు. తాగుబోతు వెధవలని వెతికే పని కూడా పోలీసు డిపార్టుమెంటుదేనా!" విసుక్కున్నాడు తంగం.

2

ఫోన్ గణగణా మని మ్రోగింది.

ఇన్‌స్పెక్టర్ పళనివేలు ఫోన్ అందుకున్నాడు.

తంగం తెలుగు అపన చదవాలని తెలుగు 'అ ఆ'లుతో కుస్తీ పడుతున్నాడు.

"ఏమిటీ పొదల్లో శవమా! కుక్కలు సగం వరకు తినేశాయా.... ఆ.... ఆ.... వస్తున్నాం...."

ఫోన్ పెట్టేసి "రావయ్యా చావుబేరం తగిలింది" అని లేచి హేట్ పెట్టుకున్నాడు.

తంగం హుషారుగా కదిలాడు.

బుల్లెటు కొరటూరువేపు దూసుకుపోయింది.

కాకులు గ్రద్దలు పైన తిరుగుతూ వుండటం చూచి శవం వున్న ప్రదేశం తేలిగ్గానే కనుక్కోగలిగారు.

కుళ్ళు వాసన వస్తుంది.

జనం ముక్కులు మూసుకొని దూరం నుండి శవాన్ని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇనస్పెక్టర్ శవాన్ని చూశాడు.

మగవాడు.

సుమారు పాతిక పైన వున్నవాడు. అదృష్టం ఏమిటంటే కుక్కలు కాళ్ళు తొడ చేతులని పీక్కుతిన్నాయిగానీ.... మొఖాన్ని ముట్టకపోవడం వలన గుర్తింప వీలు వుంది.

ఫోటోగ్రాఫర్ ఫోటోలు అన్ని కోణాలలోనూ తీయడం ప్రారంభించాడు.

మొహం వుబ్బి వికృతంగా వున్నది.

తంగం చాలాసేపు శవాన్ని దీక్షగా చూపి "సార్! రెండు రోజుల క్రితం కొడుకు మిస్ అయ్యాడని ఓ ముసలాయన వచ్చాడే, ఆయన కొడుకు ఏమో?" అన్నాడు సందేహంగా.

"అలా అనే అనుకోవచ్చు. కానీ మొహం చాలా వికృతంగా వున్నది. గుర్తించడం ఎలా?"

"కబురు పంపుదాం."

శవాన్ని వేనులో హాస్పిటలుకి తరలించారు పోస్టు మార్టమ్ నిమిత్తం.

అక్కడ వారిని ప్రశ్నించగా, దారిన పోయేవాళ్ళు కుక్కల కాట్లాట కుళ్ళు వాసన వేసి పొదలో చూడగా మనిషి శవం అని గుర్తించి పోలీసు రిపోర్టు యిచ్చినట్లు చెప్పారు.

రిపోర్టు యిచ్చిన శ్రీనివాసరావు వచ్చి దుస్తులు జుట్టు మెడ దగ్గర మచ్చనుబట్టి తన కొడుకును గుర్తించి గొల్లుమన్నాడు.

శవ పంచనామా జరిపి శవాన్ని అతనికి అప్పగించారు.

మరునాడు రిపోర్టు వచ్చింది.

సారాయిలో విషం కలపడం వలన మరణం సంభవించినదని, చనిపోయి తొంభై యారు గంటలు అయి వుంటుందని, రిపోర్టులో వుంది.

"తాగుబోతులకి యేదో గొడవ వచ్చివుంటుంది" అని గొణుక్కున్నాడు తంగం.

3

ఇంటి ముందు ఓ ఇరవై సంవత్సరాలు పైనబడిన ఓ యువతి కూర్చొని బియ్యం ఏరుకుంటున్నది.

మనిషిని చూస్తే ఆ యింటిలో శవం లేచిన యిల్లులా లేదు. నెంబరు కరెక్టుగా వున్నది.

"ఏమ్మా! ఇది శ్రీనివాసరావుగారి యిల్లేనా?" అని తంగం అడగ్గానే వులిక్కిపడి లేచి తంగాన్ని చూచి తడబడి "రండి రండి! యిదే" అని ఆహ్వానించింది.

"మీరెవరు?" ఏ ప్రక్కయింటి అమ్మో అయివుంటుందని యధాలాపంగా అడిగాడు.

"చనిపోయిన ఆనందరావుగారు నా భర్త" అంది చాల మామూలుగా.

తంగానికి షాకు కొట్టినట్లు అయింది.

మనిషి భారీగా వుంది. మొహం కరుకుగా కఠినంగా మగవాడి మొహంలా వున్నది. చూపు వేటని పట్టబోయే పులి చూపులా తీక్షణంగా వున్నది.

సాధారణమైన మగవాడు ఆ స్త్రీని స్త్రీగా భావించి సంసారం చేయలేడు. ఆమె ప్రక్కన కూర్చోవడం అంటే పులి ప్రక్కన కూర్చోవడం వంటిదే.

సృష్టిలో స్త్రీలు యిలా కూడా వుంటారా?

"మీ మామగారు మిగిలిన సభ్యులు...."

"రండి! లోపలికి" ఆహ్వానించింది.

లోపలి గదిలో శ్రీనివాసరావు నిస్త్రాణగా మంచంమీద పడివున్నాడు.

అతని భార్య కూతురు ఓ మూలగా మునగదీసుకొని పడివున్నారు.

ఆనందు చావు వారిని బాగా కృంగదీసింది.

సార్జంటు తంగాన్ని చూసి శవానికి వూపిరి వచ్చినట్లు నెమ్మదిగా మంచంమీదే లేచి కూర్చుని "ఇన్‌స్పెక్టర్‌గారు! నమస్కారం రండి" అని హీనస్వరంతో పల్కాడు.

తల్లి కూతుళ్ళు సన్నగా ఏడుస్తున్నారు.

"అడిగానని బాధపడవద్దు మీ కొడుక్కి శత్రువులు యెవరైనా వున్నారా?"

ఆయన తల అడ్డంగా వూపాడు.

"బాగా ఆలోచించుకొని చెప్పండి. మీ వూరిలోగానీ, మీ బంధువుల్లోగానీ లేదా అతను పని చేస్తున్న ఫ్యాక్టరీలో గానీ అతనికి శతృవులు వున్నారా? ఎప్పుడైనా ఎవరితోనైనా తగువుపడినట్లు మీ వద్దకి వచ్చి చెప్పాడా?"

"మాకు తెలిసి ఎవరూ లేరు సార్."

ఇంతలోకి ఆనందు భార్య సుందరం కాఫీ తీసుకొని వచ్చింది.

"ఏమ్మా! మీ వారికి శతృవులు ఎవరైనా వున్నారా? మీతో ఏమైనా చెప్పారా?" అని అడిగాడు.

"ఒకరు కొడితే తన్నులు తిని మాట్లాడకుండా వచ్చేసే మనిషేగానీ ఆయన తిరగబడే మనిషి కాదు."

"మీ వారికి తాగుడు బాగా అలవాటా?"

"తాగడం సరదాగానీ దానికి బానిస కాదు. ఎప్పుడైనా ఓ పది చేతిలో వుంటే ఫ్రెండ్సుతో తాగి సరదాగా గడుపుతారు."

"ఆయన ఫ్రెండ్సు ఎవరు? యీ వూరి ఫ్రెండ్సుతోనా. లేదా ఫ్యాక్టరీ ఫ్రెండ్సుతోనా?"

"ఫ్యాక్టరీ ఫ్రెండ్సు ఫ్యాక్టరీతోనే సరిపెట్టుకున్నారు. ఈ వూరి వారే."

"వాళ్ళు మీకు తెలుసా?"

"తెలియదు."

"సార్! మీకు తెలుసా?" శ్రీనివాసరావుని అడిగాడు.

"విక్టరు, క్రిష్ణన్, నందా, రాజా వీళ్ళే తెలుసు."

"వాళ్ళ అడ్రసులు చెప్పండి."

"పంచాయితీ సావడిలోనే వుంటారు వాళ్ళు."

4

"విక్టరు, క్రిష్ణన్, నందా, రాజా అంటే ఎవరు?"

నల్లగా వుండే యువకుడు ముందుకొచ్చి నా పేరు క్రిష్ణన్. విక్టరు భార్యకి సుస్తీగా వుందని యీ రోజే అత్త వారి వూరికి వెళ్ళాడు.

"ఇతను నందా! రాజా యింకా రాలేదు" అని సమాధానం యిచ్చాడు.

"ఆనందు మీ ఫ్రెండా?"

"అవును సార్! వాడు చాలా మంచివాడు. ఎవరు యెందుకు అతనిని చంపారో తెలియడంలేదు" విచారంగా అన్నాడు.

"అతను చంపబడిన రోజు మీరు అతనితో ఉన్నారా?"

"ఉన్నాం సార్!"

"ఉన్నారా? అతని హత్య మీకు తెలుసా?"

"సార్ నలుగురుం వుండి స్నేహితుడిని చంపుతూ వుంటే చేతులకి గాజులు తొడిగించుకొని వుంటామా?" నంద ఆవేశంగా అన్నాడు.

"ఆ రోజు అతనితో మీ రెంతసేపు వున్నారో చెప్పండి."

"ఆ రోజు ప్రొద్దుటే అతను యిక్కడకు వచ్చి తనకు బోనస్ వచ్చిందని చెప్పాడు. మేము సినిమాకి తీసుకొని వెళ్ళమని అడిగాం. అతను సరే అన్నాడు.

పెరంబూరులోని వీనసు థియేటరుకి మార్నింగ్ షోకి వెళ్ళాం. సినిమా వదిలేసరికి రెండుగంటలు అయింది.

అక్కడే వున్న హోటల్లో భోజనం చేసి బయట కొచ్చే

సరికి నాలుగు గంటలు అయింది.”

“సారాయి తాగలేదా?” తంగం మధ్యలో ప్రశ్నించాడు.

క్రిష్ణన్ తటపటాయించాడు.

“నిజం చెప్పండి. మీరు నిజం చెప్తేనే మేము హంతకుడిని పట్టుకోడానికి వీలు.”

“తాగాం సార్! అయితే అందరం తలో రెండు రూపాయలు. అంతకన్నా ఎక్కువ తాగలేదు. బయట కొచ్చిన తరువాత నాకు కొంచెం పనివుంది. అది చూసుకొని వస్తాను మీరు వెళ్ళండి, అని అన్నాడు.

నాలుగు గంటలే కదా! మేము వుంటాము. నీ పని అయిన తర్వాత అందరం కలసి వెళ్దాం, అన్నాం.

కాదు మీరు వెళ్ళండి. నేను మంత్రకాడు భయంకర్ యింటికి కూడా వెళ్ళాలి అని అన్నాడు. అయితే సరే అని మేము వూరు వచ్చేశాం....” అని ముగించాడు.

తరువాత ఆ రాత్రి అతను యింటికి రాలేదని తెలిసింది. మేము సైకిళ్ళు తీసుకొని వెతికాం....” అని ముగించాడు.

“భయంకర్ ఎవరు?”

“అతనో మంత్రగాడండి. కాళికాపూజ చేస్తాడు. చేతబడి తిరుగుబడి వంటి పూజలు చేస్తాడు. అతను పెరంబూరులో వున్నాడు.”

“అతనికి, వీళ్ళకి సంబంధం ఏమిటి?”

“శ్రీనివాసుగారు బాగా ఆరోగ్యంగా వున్న మనిషి. రోజు రోజుకి నీరసించిపోతున్నారు. ఎవరైనా చేతబడి చేశారేమోనని యితనిని సంప్రదించారు. ఓ ఆరు నెలల నుండి అతను తిరుగుబడి చేస్తున్నాడు.”

"మీరు అతన్ని వెళ్ళి అడిగారా!"

"వెళ్ళాం సార్! తన దగ్గరకి రాలేదని చెప్పాడు."

"అతని అడ్రస్సు ఏమిటి?"

వాళ్ళు చెప్పారు.

5

పెరంబూరు దాటి మాధవరం వెళ్ళే దారిలో వూరికి దూరంగా ఒంటిగా వున్న గుడిసె భయింకర్ యిల్లు.

లోపల చీకటిగా వున్నది.

ఇనస్పెక్టర్లు యిద్దరు కానిస్టేబుల్సుతో వెళ్ళారు.

టార్చి వేసి చూశారు.

నల్లటి కాళికా విగ్రహం, దాని ముందు ధ్యానంలో కూర్చున్న నల్లటి మనిషి కనబడ్డారు.

సార్జంటు తంగం తలుపుమీద శబ్దం చేయగా అతను కనులు తెరచి చూసి బయటికి వచ్చాడు.

అతని కనులలో బెదురు కనిపించింది.

టార్చి వెలుతురులో కాళికా విగ్రహం దగ్గర చూస్తే మనిషి పుర్రె ఎముకలు వున్నాయి. కాళి కాళ్ళ దగ్గర ఒక ప్లేటులో గుండె, యింకో గిన్నెలో గడ్డకట్టిన రక్తం వున్నది.

వాటిని స్వాధీన పరుచుకొని టెస్టుకి పంపించి, భయం కర్‌ని స్టేషనుకి తీసుకొచ్చారు.

టెస్టులో అవి మనిషి గుండె, రక్తం అని తేలింది. తంగం భయంకర్‌కి పోలీసు మర్యాద చేయగానే ఆనందుని తనే చంపినట్లు వొప్పుకున్నాడు.

"ఆనందుని ఎందుకు చంపావు?"

"ఆనందు భార్య కోసం."

"ఆనందు భార్య సుందరి కోసమా?" ఆశ్చర్యంగా

ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"అవును. ఆమె స్త్రీలాకాక మంత్రకత్తెలా వుంటుంది. ఆమె చూపులో పులికున్న క్రూరత్వం వున్నది. నాకు పెండ్లి కాలేదు. ఆమెను లొంగదీసుకొని నా విద్య ఆమెకు నేర్పి నా అంత వ్యక్తిని చేయాలనిపించింది. దానికి ఆనందు అడ్డు కాబట్టి అతనిని తొలగించాలని, ప్రసాదం యిస్తాను రమ్మనమని చెప్పాను.

అతను వచ్చాడు. కాళికా ప్రసాదం తీర్థం అని సారాయి యిచ్చాను. అందులో విషం కలిపాను...."

"నీ బుద్ధి సంగతి సుందరికి తెలుసా?"

"తెలియదు. కానీ....నా విద్య యందు ఆమెకు చాల యిష్టం కలిగింది. ఒకటి రెండుసార్లు తనకి నేర్పమని అడిగింది. అందుకని నేను యీ పని చేశాను."

"ఓరి దుర్మార్గుడా!" అంతకన్నా ఏమనాలో తెలియ లేదు తంగానికి. ఈ రోజుల్లో కూడా యీ చేతబడులని ప్రజలు మూర్ఖంగా నమ్ముతున్నారా....? □

రచయిత—?

"అడుగో-అటు వెళ్తున్నాడు చూడు. అతడో రచయిత."

"నీ కెలా తెలుసు. పత్రికలే చదువవు కదా?"

"చదువను. కాని అతను తాను వ్రాసిన కథలను మా కిరాణా దుకాణానికి తూకానికి వేస్తాడు!"

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

దివాకర్ల సన్యాసిరాజు

మతిలేని మనుషులు

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ వాల్తేరు స్టేషను దాటిపోయే వరకూ నిలబడి, వెనక్కి తిరిగాను.

రాత్రి 9 గం॥ కావస్తోంది. మిత్రుడు రఘు ఉద్యోగ రీత్యా ట్రయినింగ్‌కి, కలకత్తా వెళుతూంటే సెండాఫ్‌కి వచ్చాను.

స్టేషన్ లోంచి బైటికొచ్చేసరికి, ఎవరో పిలిచినట్లయింది. వెనుదిరిగి చూశాను.

అతనే! అతను స్టేషనుకి వచ్చినప్పటి నుండీ, రెండు మూడుసార్లు చూశాను. 8 గం॥ స్టేషనులో అడుగుపెట్టాం రఘు, నేను. గేటుదగ్గర కనబడ్డాడతను. కేంటిన్ దగ్గర కాఫీ తాగుతూ ఉండగా తిరిగి కనబడ్డాడు. బండి కదలడానికి సిద్ధంగా ఉండాగా చూశాను మళ్ళీ.

అతనే! యిప్పుడు నా దగ్గర కొస్తున్నాడు.

అతనెవరో నాకు తెలీదు. పరిచయం లేని వ్యక్తి. నన్ను సమీపించి "మీ పేరు రాజు అనుకుంటాను. ఎమై కరెక్ట్?" అన్నాడు.

"ఎస్! యూ ఆర్ కరెక్ట్. మె ఐ నో హూ ఆర్ యూ?" అన్నాను ఆశ్చర్యపోతూ.

జేబులోంచి ఒక కార్డు తీసి చూపించాడు.

గతుక్కుమన్నాను ఆ కార్డు చూసి.

అతని ఫోటో—క్రింద ఇన్‌స్పెక్టర్ దామోదర్—క్రైంబ్రాంచ్—అని వుంది. నన్నెందుకు వెంటాడుతున్నారో అర్థం కాలేదు.

"గ్లేడ్ టు మీట్ యు" అన్నాను సభ్యతగా.

"ఎస్. మీరు నాతో రావాలి—" అన్నాడతను.

"ఎందుకో....?! ఎక్కడికో దయచేసి చెప్తారా?...." అన్నాను.

"మిస్టర్ రాజూ! మీరు యిల్లు వదిలి వెళ్ళిపోయారని, మిమ్మల్ని వెతికి తీసుకురమ్మని మీ మావయ్య కోరారు. యిప్పుడు మనం మీ మావయ్యగారింటికి వెళుతున్నాం. మీ కోసం పోలీస్ డిపార్టుమెంటంతా గాలిస్తోంది. ఇప్పుడు దొరికారు. ఇక వెళదామా?" అన్నాడతను.

"క్షమించండి! ఇన్‌స్పెక్టర్. నా పేరు రాజే—కానీ మీరు వెతుకుతున్న వ్యక్తిని మాత్రం నేను కాను. నా కెవరూ మావయ్యలు లేరు. ఇంటినించి పారిపోయి రాలేదు," అన్నాను—పాపం యెవర్ని చూసి ఎవరను కున్నాడో!

"మిస్టర్ రాజూ!! అదిగో నా జీప్. మీరు యిప్పుడు నాతో రండి. దశరథరామయ్యగారు మిమ్మల్ని చూసి తన మేనల్లుడు రాజు కాదంటే తిరిగి నేనే, స్వయంగా మీ రెక్కడికి వెళ్ళాలంటే అక్కడ దించుతాను. కమాన్!" అంటూ నా జవాబుకి యెదురుచూడకుండా జీపువైపు నడిచాడు.

పోనీ వెళితే యేం పోయింది. ఈ వ్యవహార మేమిటో గమ్మత్తుగా వుంది. చూద్దాం—అనుకొని అతని వెనకే వెళ్ళి జీప్ ఎక్కాను.

ఇన్‌స్పెక్టర్ జీప్ స్టాట్ చేసి ముందుకు దూకించాడు.

2

అందంగా అధునాతనంగా, వున్న భవనం పోర్టికోలో ఆగింది జీప్.

గుమ్మంలో ఎదురైన ఓ నౌఖరు నన్ను చూసి— "చినబాబూ!!? చినబాబుగా రొచ్చారు" అని అరుస్తూ లోపలికి పరుగెత్తాడు.

అంతవరకూ, ప్రశాంతంగా వున్న ఆ భవనంలోని నిశ్శబ్దం పలాయనం చిత్తగించి, సందడి మొదలైంది.

దశరథరామయ్యగారు, ఆయన సహధర్మచారిణి, ఏకైక కుమార్తె సులోచన, వంటమనిషి సుబ్బమ్మ, నౌకరు రాము—అంతా హాల్లో కొచ్చేశారు.

"ధశరథరామయ్యగారూ! యిదిగో మీ మేనల్లుడు

రాజు. స్టేషన్‌లో దొరికాడు—" అన్నాడు ఇన్‌స్పెక్టర్ దామోదర్.

"ఎక్కడికి పారిపోయావోయ్ యిన్నాళ్ళూ? నీ కోసం బెంగ పెట్టుకొని అమ్మాయి చూడు యెలా తయారయిందో...."

"ఏం బాబూ! యిన్నాళ్ళకి గుర్తుకొచ్చామా మేము" అంది దశరథరామయ్యగారి అర్ధాంగి.

"ఏం బావా! నేనేం చేశానని వదలి వెళ్ళిపోయావు? మరొక రెండురోజుల్లో నీవు తిరిగి రాకపోతే సూసైడ్ చేసుకునేదాన్ని...." అంది సులోచన.

వాళ్ళ మాటలకు నాకు తల తిరిగిపోతున్నది.

హాల్లో వున్న సోఫాలో కూర్చున్నాం, ఇన్‌స్పెక్టర్ నేనూ.

అసలు నాకు పిచ్చిపట్టిందా! లేకపోతే వీళ్ళందరికీ మతిపోయిందా? లేక అంతా కలిపి ఏదేనా గూడుపుఠాణి చేస్తున్నారా?!

"నా కంతా అయోమయంగా వుంది. నేను మీ మేనళ్ళుడ్ని కానండీ. మీరెవరో నాకు తెలీదు" అన్నాను— దశరథరామయ్యగారితో.

"డాడీ! చూశారా! మీ రెవరో తెలీదంటున్నాడు బావ. కొంతసేపు పోతే నేను కూడా తెలీదంటాడు" అంది సులోచన.

"అవును. నిజమేనండీ! తరువాత కాదు యిప్పుడే అంటున్నాను. మీ రెవరూ నాకు తెలీదు. ఎప్పుడూ చూళ్ళేదు ఈ యిల్లు కూడా."

"నేను రాజుతో మాట్లాడుతూ వుంటాను. నువ్వెళ్ళి కాఫీ తీసుకు రామ్మా మాకు" అంటూ దశరథరామయ్య

గారు కూతుర్ని, భార్యను లోపలికి పంపేశారు.

వాళ్ళిద్దరూ లోపల కెళ్ళగానే దశరథరామయ్య మా ఎదురుగా కూర్చొని—

"చూడు బాబూ! మా అల్లుడు రాజు అచ్చంగా నీ లాగే వుంటాడు. మతి చలించి యిల్లు వదిలి వెళ్ళిపోయాడు. నాకు ఒక్కగా నొక్క కూతురు. మా ఆశలన్నీ దానిమీదే పెట్టుకున్నాం. మేనల్లుడికి యిచ్చి పెళ్ళి చేస్తే యిద్దరూ— మా కళ్ళముందే వుంటారని ఆశపడ్డాం.

కానీ రాజు యిల్లు వదిలి వెళ్ళిన నాటినుండీ అమ్మాయి చాలాబెంగపెట్టుకుంది. అప్పుడప్పుడు ఫిట్సు కూడా మొదలయ్యాయి. రాజు గురించి తిరగని చోటులేదు. మా అదృష్టంకొద్దీ నీవు దొరికావు. నిన్నుచూశాక అమ్మాయిలో వచ్చిన మార్పుకి మాకే ఆశ్చర్యంగా వుంది. నువ్వే తన బావనుకొంటోంది. మేం కూడా నిన్ను చూసి అలాగే అనుకున్నాం.

అందువల్ల యిక్కడే వుండు బాబూ? నీ కే లోటూ చేయము. నెలకి 500/- ఖర్చుకి యిస్తాను. రెండు కారులున్నాయి. నీకేం కావాలంటే అది సమకూరుస్తాను. కానీ వెళ్ళిపోతానని మాత్రం అనకు—" అన్నారాయన రుద్ధకంఠంతో.

నేను అవాక్కై వుండిపోయాను. నా కంతా అయోమయంగా వుంది. మనుషుల్ని పోలిన మనుషులుంటారేమో. అయితే, ఆకారం, పేర్లు కూడా తేడా లేకుండా వుండటం సాధ్యమా. నే నెన్నాళ్ళిక్కడ వుండాలి? ఆ రాజెవడో? ఎప్పు డొస్తాడో? ఈ నాటకం ఎలా ఆడాలి నేను! ఆశ్చర్యానుమానాలతో వుక్కిరిబిక్కిరై య్యాను.

నా కేదో ఆలోచనల జ్ఞాపకాలు మెదడుని దొలుస్తు

న్నాయి.

"ఈ నాటకం నేను రక్తి కట్టించలేనండీ. ఇలా యెన్నాళ్ళు మీ అమ్మాయికి తెలీకుండా నాటక మాడాలి. ఎలాంటి సమస్య లెదుర్కోవాలో. నాకు శలవిప్పించండి వెళ్ళిపోతాను. నేనేదో ఉద్యోగ ప్రయత్నంలో ఓ ఫ్రండు రూమ్‌లో ఉండి తిరుగుతున్నాను...."

"కాదనకు బాబూ! యిది వుద్యోగమే అనుకో. 500/- కాకపోతే వెయ్యి రూపాయ లిస్తాను. అదిగో ఆ గాడ్రెజ్ బీరువాలో ఉన్నవన్నీ రాజు బట్టలే. ఈ క్షణం నుండీ అవి నీవే. రక రకాల డ్రెస్‌లు వున్నాయి. నీకు కావలసినవి నిరభ్యంతరంగా వాడుకో. పిలిస్తే పలుకుతాడు డ్రైవరు. ఏమవసర మొచ్చినా సమకూర్చడానికి యిద్దరు నౌఖ ర్లున్నారు...."

అంతవరకూ శ్రోతగా మిగిలిపోయిన యిన్‌స్పెక్టర్ అన్నారు.

"ఆయన కోరిక నెరవేర్చడం వివేకవంతుల లక్షణం. వస్తాను సార్....!" అంటూ నిష్క్రమించాడు ఇన్‌స్పెక్టర్ దామోదర్.

కాఫీ త్రాగి వెళ్ళమన్నారు దశరథరామయ్య. కానీ పనుందని వెళ్ళిపోయాడు.

అదే సమయంలో అడుగుపెట్టింది సులోచన.

ఆమె వెనుకే వంటమనిషి ట్రేలో కాఫీ బిస్కట్లు తెచ్చి యెదురుగా నున్న టీపాయ్‌మీద వుంచి వెళ్ళి పోయింది.

సులోచన తండ్రి ప్రక్కన కూర్చుంది. ఆమె చూపు లన్నీ నాపైనే వున్నాయి. మేలిమి బంగారు ఛాయలో అందంగా, ఆరోగ్యంగా మూర్తీభవించిన సౌందర్యరాశి

ఆమె.

ఇంత అందమైన మరదల్ని ఈ ఐశ్వర్యాన్నీ వదిలి ఎక్కడికి పోయాడో ఆ నిర్భాగ్యుడు?

"కాఫీ తీసుకో బావా!" నాకో కప్పు తీసి అందించింది సులోచన.

వద్దంటే మళ్ళీ ఏ గొడవో అని కప్పు తీసుకొని తాగ సాగాను.

"బావ గది శుభ్రం చేయించి స్నానం ఏర్పాట్లు చూడమ్మా—స్నానం చేసి బట్టలు మార్చుకోవోయ్. మీల్సు చేసి రెస్టు తీసుకో" అన్నారాయన.

ఏమయితే అయింది. చూద్దాం! యిదో వింత అనుభవం—...." అనుకొని లేచాను బట్టలు మార్చుకొనడానికి.

3

రాత్రి హాయిగా పడుకొని ఉదయం లేచేసరికి బెడ్ కాఫీ సిద్ధంగా వుంది. మెత్తని కుషన్‌మీద మఠం వేసుకొని కూర్చొని కాఫీ తాగసాగాను. అదే సమయంలో అడుగుపెట్టింది సులోచన.

"గుడ్‌మార్నింగ్ బావా! అబ్బ! యిప్పటికి పదోసారి వచ్చి చూసి వెళుతున్నాను. ఇప్పటికి లేచారన్నమాట రాజావారు" అంది నవ్వుతూ.

అప్పుడు సరిగ్గా చూశాను సులోచనని. ఆమె చాలా అందంగా వుంది. అప్పుడే అభ్యంగనస్నానం చేసినట్లుంది. విశాలమయిన కురుల్ని మధ్యలో చిన్న పిన్ చేసి వదిలేసింది. రోజ్ కలర్ రాజ్‌కమల్ సారీ చిన్న డిజైన్‌లో ఆమె పసిడిఛాయ కెంతో అందంగా వుంది.

ఇంత అందమైన మరదల్ని వదిలి ఆ రాజెవడో గాని

తెలివితక్కువవాడిలా పారిపోయా దేవిటి?

"యింతకీ తమరు నన్ను ఫాలో కావడమేనా. చదు వేమైనా వెలగబెడుతున్నారా?" అన్నాను ఏదో మాట్లాడాలి గనుక.

క్షణం ఆశ్చర్యపోయి చూస్తూ వుండిపోయింది.

"ఎగతాళి చేస్తున్నావా బావా!" అంది సీరియస్‌గా.

చచ్చాన్రా భగవంతుడా! ఏం పొరపాటైపోయిందో? నా మాటల్లో—ఏం మాట్లాడినా చిక్కే.

"అబ్బే! ఎగతాళెందుకూ. యిప్పుడేంటన్నాననీ?"

"మరేవిటి కాకపోతే. బి. ఎస్సీ పోగానే పూర్తిచేస్తా నన్నానా. నువ్వే వద్దు. ఎవర్ని ఉద్ధరించాలి. హాయిగా యింట్లో కూర్చోక అన్నావు. యిప్పుడేమో చదవలేదం టున్నావు—" అంది.

"అయామ్ సో సారీ. ఏదో సరదాకన్నాను. నేను మంచం దిక్కుండానే యుద్ధం మొదలెడుతున్నావు. ఉద యాన్నే అంత సీరియస్ మూడ్‌లో వుంటే ఎలా అమ్మాయి గారూ!" అన్నాను నవ్వు తెచ్చుకొని.

"లేదు బావా! త్వరగా తయారైతే నాన్నగారు షాపింగ్‌కు వెళదామన్నారు. నువ్వు స్నానం చేసి రా! నేను డ్రస్ రడీ చేస్తాను. సరేనా!" అంది నవ్వుతూ.

4

నేను స్నానం చేసి వచ్చేసరికి డ్రెస్ సిద్ధంగా పట్టుకుని నిలబడింది సులోచన గదిలో.

బ్లేక్, పేంటు. వైట్ షర్టు. వాటి పేరు కూడా నాకు సరిగ్గా తెలీదు. అంత ఖరీదయిన బట్టలవి.

అవి అందుకొని—

"తమరు వెళ్ళి కాఫీ తెస్తే ఈలోగా నేను వీటిలో

దూరడానికి ప్రయత్నిస్తాను" అన్నాను అక్కడే నిలబడు తుందేమో అన్న భయంతో.

ముత్యాలు వొలకబోసినట్లు నవ్వుతూ, "ఎప్పట్నించీ వచ్చింది బావా ఈ సిగ్గు?" అంది.

బాబోయ్! ఆ రాజెవడో గాని బాగా తెచ్చాడు నా పీకల మీదికి. ఈ బావా మరదళ్ళ మధ్య యింకేం మొహ మాటలు, సరదాలు ఉన్నాయో! నేనేం చేసేది?

"ఏవిటి బావా! నీకు మతిపోయినట్లుంది. కాఫీ, టిఫిను తెస్తానుండు" అంటూ వెళ్ళిపోయింది.

అమ్మయ్య! అనుకొని ఆ డ్రస్‌లేసుకున్న నాకు నిజం గానే మతిపోయింది.

నా కోసమే కుట్టించినట్లు బ్రహ్మాండంగా అమరి పోయాయి.

అద్దం ముందు నిలబడి, ఆ డ్రెస్‌లో నా అందాలు తనివి తీరా చూసుకుంటున్నాను.

"ఏంటోయ్! బాగున్నావా" అన్నాను అద్దంలోని రాజుని.

"ఇదెప్పట్నుంచి ఈ సంబోధన?"

ఠక్కున వెనక్కి తిరిగాను గతుక్కుపడి.

గుమ్మంలో ఓ మెరుపుతీగ ప్రత్యక్షమైంది. అందాల పోటీకి వెళుతూ మార్గం మధ్యంలో యిలా నా గదిలోకి వచ్చి దర్శన మిచ్చిన ఈ అతిలోక సుందరి ఎవరో?!!

"అయామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ. ఎవరండీ మీరు?" అన్నాను సంభ్రమాశ్చర్యాలతో.

ఆశ్చర్య అనుమానాలతో కళ్ళు పెద్దవి చేసి చూస్తు నిలబడిపోయింది ఆమె.

షో కేస్‌లో బొమ్మలా చలనరహితంగా నిలబడి పోయిన ఆ యువతిని చూసి—

"ఎవరు సుందరీ తమ నామధేయం" అన్నాను చిలిపిగా.

అంతే! టక్కున వెనుతిరిగి మాయమైంది ఆ సుందరి తలుపు దడేల్‌మని మూసేస్తూ.

"అమ్మయ్యా!" అనుకొని తల దువ్వుకోసాగాను.

అదే సమయంలో అడుగుపెట్టారు సులోచన నాన్న గారు.

"బాబూ సిద్ధంగా వున్నావా. ఆ! యిప్పుడు వచ్చిన అమ్మాయి సులోచన స్నేహితురాలు. సుధారాణీ, నీవు, సులోచనా రోజూ షికారు కెళ్ళేవారు. కలిసి చదువు కున్నారు. ఏంటన్నా వేమిటి? ఆమె బాగా జడిసిపోయింది" అన్నారు నవ్వుతూ.

"అబ్బే! ఏం అనలేదు. మీరెవరో తెలీదన్నా నంతే" అన్నాను యిబ్బందిగా.

"బావా! రడీయేనా!" గాలిదుమారంలా దూసుకొచ్చింది సులోచన.

"ఆ! ఆ!! పదమ్మా! సుధ ఎక్కడ? ఆ అమ్మాయి కూడా వస్తుందా! పదవోయ్ రాజూ!" అంటూ బయటకు నడిచారాయన.

"అబ్బ!! బ్యూటిఫుల్ బావా! ఎన్నాళ్ళకి మళ్ళీ నిన్నీ డ్రస్‌లో చూశాను" అంది సులోచన సంతోషంగా.

పోర్టికోలోకి అడుగు పెడుతూండగా సులోచన నాన్న గారు సుధారాణితో యేదో చెపుతూ నన్ను చూసి ఆపే శారు—కారు వైపు నడుస్తూ.

ఆమె గుడ్లప్పగించి చూస్తోంది నన్ను.

ఇటూ అటూ చూసి నాలిక బయటపెట్టి కళ్ళు చిట్లిం

చాను ఆమె వైపు చూసి—గబ గబా నడిచి కారులో కూర్చున్నాను.

అప్పటికే సులోచన కారులో వుంది.

ఒక్క జర్కులో దూసుకుపోయింది కారు.

5

మర్నాడు ఎవరో ఓ కొత్తవ్యక్తి తళతళ లాడుతున్న లాంబ్రెటా స్కూటర్ తెచ్చి గేరేజిలో వుంచాడు.

నేను రూమ్‌లో కూర్చొని ఏదో చదువుతూండగా కారు డ్రైవర్ వచ్చి—

"రండిసార్, వెళదాం" అన్నాడు.

తెల్లబోతూ "ఎక్కడికోయ్!?" అన్నాను అర్థంకాక.

"స్టేడియమ్‌కి సార్. అయ్యగారు మీకు స్కూటర్ నేర్పమన్నారు-మీకు తెలీదా?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

నాకు రోజు రోజుకీ మతిపోతోంది జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే.

నన్నెందుకిలా రోజుకో మెట్టు పైకెక్కిస్తున్నారో, ఆ రాజు వస్తే నన్నెక్కడికి తగిలేస్తారో అయోమయంగా వుంది.

"పద, వస్తున్నా" అన్నాను లేచి డ్రస్ మార్చుకొంటూ. స్టేడియమ్‌లో నన్ను వెనుక కూర్చోమని, ఎలా స్టార్ట్ చెయ్యాలో, ఎలా గేర్స్ మార్చాలో చూపించాడు. తరవాత నన్ను నడపమని తను వెనుక కూర్చున్నాడు.

క్లచ్ నొక్కి మొదటి గేర్‌లో వుంచి ఎక్సిలేటర్ చేసి క్లచ్ వదిలాను. ఒక్క జర్కు యిచ్చి ఆగిపోయింది. ముచ్చటగా మూడో ప్రయత్నంలో కదిలింది బండి. క్లచ్ నొక్కి గేర్సు మారుస్తూ బండి నడుపుతూ వుంటే బలె మజాగా వుంది.

సులోచన నాన్నగారు కూడా కారులో వచ్చి నా ప్రక్కగా కారు పోనిస్తూ—

"జాగ్రత్త రాజూ! బ్రేక్ కంట్రోల్‌లో ఉంచుకో. జోరుగా పోనివ్వకు. ఎక్సిలేటర్ పూర్తిగా డౌన్‌చేసి క్లచ్ పట్టుకుని బ్రేక్ వెయ్యి. కాకుంటే విసిరేస్తుంది. బండి మెల్లగా పోనియ్" అంటున్నా రాయన.

డ్రైవర్ నా ప్రక్కగా పరిగెడుతున్నాడు ఒగరుస్తూ. ఓ గంటలో చాలావరకూ నేర్చుకున్నాను.

అన్నిటి మాట ఎలాగున్నా ఈ అనుభవం మాత్రం చాలా హాయిగా వుంది.

ప్రతి సాయంత్రం భవనం ముందు, బీచ్ రోడ్ మీద బాగా నడపడం నేర్చుకున్నాను.

6

ఆనాడు దశరా-విజయదశమి.

సులోచన అభ్యంగన స్నానం ఆచరించి-కనకాంబరం రంగు-కంచి పట్టుచీర కట్టుకొని-నవ్వుతూ సంతోషంగా యింట్లో తిరుగాడుతోంటే-అత్తగారు-మామగారు ముఖాల్లో కోటి చంద్రుల వెలుగు కనబడింది నాకు.

సాయంత్రం సినీమా ప్రోగ్రామ్ వేసింది సులోచన.

యిద్దరం స్కూటర్ మీద సినీమాకి బయలుదేరాం. మెత్తని పాలనురుగులాంటి పోలిస్టర్ చీరలో అందమైన సులోచన నా వెనుక కూర్చొని, నా నడుం చుట్టూ చెయ్యి వేసి కబుర్లు చెపుతూంటే, పుష్పక విమానంలా అస్పటల్ డౌన్ దిగుతోంది స్కూటర్.

అటునుండీ ఓ బస్ వస్తోంది.

రోడ్ ప్రక్కన ఓ టాక్సీ ఆగివుంది.

బస్సు దూరంగా వుంది కదా అని, రోడ్ ప్రక్కనున్న

టాక్సీని దాటి ముందుకు పోనిచ్చాను స్కూటర్ని. హఠా త్తుగా బస్సు వెనుకనున్న కారు ముందుకొచ్చింది. ఆ ఢౌన్‌లో స్కూటర్ కంట్రోల్ తప్పింది. నేర్చుకొని ఎన్నాళ్లో కాకపోవడంవల్ల ఏం చెయ్యాలో తోచలేదు— "ధన్" మని కారు ముందుభాగానికి ఢీ కొంది స్కూటర్.

వెనుకనున్న సులోచన గాలిలోకి ఎగిరి పేవ్‌మెంట్ మీద పడిపోయింది. స్కూటర్‌తో సహా నేను ఆ కారు బోనెట్‌కి గుద్దుకున్నాను.

కళ్ళముందు వెయ్యి ఫిరంగుల శబ్దం, నక్షత్రాలు కన బడ్డాయి. బుర్రలో బండరాయి మోదినంత బాధ—అంతేః తర్వాత ఏమైందో....

7

తల మణుగు బరువుగా వుంది. కళ్ళంతా విపరీతమైన నొప్పి. కళ్ళు విడటంలేదు. కటిక చీకటి. కళ్ళమీదుగా కట్లు....చేతులు, కాళ్ళు స్వాధీనంలో లేవు. లీలగా మాటలు మాత్రం వినిపిస్తున్నాయి.

"మరేం భయంలేదండీ. ప్రాణాపాయం లేదు. తలకి బలమైన గాయమైంది. అతన్ని విశ్రాంతి తీసుకోనీయండి. ఎవరూ పలకరించవద్దు...."

"డాక్టర్. ఒక్కగానొక్క కూతురు. నా పిల్ల ప్రాణా లన్నీ రాజుమీదే వున్నాయి. కొన్ని కారణాల మూలంగా యిల్లు వదిలిపోయాడు రాజు. వెతికి, వెతికి ఈ మధ్యనే యింటికి తెచ్చాం.

ఇన్నాళ్ళూ యెంత గాలించినా దొరకని అల్లుడు నా స్నేహితుడైన పోలీస్ ఇనస్పెక్టర్ సహాయంతో యింటి కొచ్చాడు. రాజు దొరికినందుకు ఇంటిల్లిపాదీ మురిసి పోయాం. మతి చలించి పిచ్చివాడు అంటే మళ్ళీ దేశాలు

పట్టేస్తాడని. నా కూతురికే మతి చలించిందని, ఇతనిలో రాజుపోలికలున్నాయని, రాజులా నటించమని కాకపోతే అమ్మాయి పిచ్చిదౌతుందని చెప్పి గడుపుకొస్తున్నాం. కొన్నాళ్ళు ఈ వాతావరణానికి అలవాటుపడితే యిద్దరికీ పెళ్ళి చేయాలనుకున్నాం—ఇతను స్వయాన నా చెల్లెలు కొడుకు రాజు.

డాక్టర్! ఎంత డబ్బయినా ఫరవాలేదు. అబ్బాయికి అంగవైకల్యాలు కలగకుండా చూడండి....మా అందరి ప్రాణాలు రాజుతో ముడిపెట్టబడి వున్నాయి" సులోచన నాన్నగారి కంఠం అది—కాదు మావయ్యదే. అవును—మావయ్యదే. నా మొదడులో ఏదో కల్లోలం. మనస్సులో ఏవేవో జ్ఞాపకాలు....మళ్ళీ విపరీతమైన మైకం....బాధ.... "డాక్టర్...డాక్టర్....మావయ్యా?!!!" అరిచాను గట్టిగా □

సహజ సన్నివేశం?

ఒక సినిమా నిర్మాత తన చిత్రంలో యుద్ధ సన్నివేశాన్ని నిజమైన యుద్ధభూమిలా కనిపించేందుకు ఓ పది వేల మందిని సమీకరించాడు.

డైరెక్టరు నిర్మాతతో ఇలా అన్నాడు. "ఇన్ని వేల మందిని తీసుకుంటే వారికి పారితోషికం ఇవ్వాలి కదా. అంత డబ్బు ఎలా యిస్తారు?"

"డబ్బా! డబ్బెందుకివ్వాలి. నిజమైన ఫిరంగిని ప్రవేశ పెడతాం కదా!"

—బాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

బొల్లిముంత అచ్చారావు

దెయ్యాల కొంప



రెండో ఆట సినిమా చూసివచ్చి తలుపులు తీసి లోపలికి వచ్చారు రామారావు, వనజ.

కొత్తగా పెళ్ళయి కాపరానికొచ్చారు. ఇంకా సరదాలు తీరలేదు. మొదటి ఆట సినిమాకన్న రెండో ఆటకే ప్రిఫర్ చేస్తాడు రామారావు.

వనజకి ఏ ఆశైనా ఫరవాలేదు. భర్తతో ఏకాంతం కావాలి, అంతే!

మొదట్లో యిండిపెండెంటుగా వున్న యిల్లు తీసుకోవా లనుకున్నారు. కాని, దొరకలేదు. నాలుగు వాటాల యిళ్ళ యినా, ఏ పోర్షన్‌కి ఆ పోర్షన్ బాత్, లావెట్రీ సౌకర్యం వున్న యీ యిల్లు బావున్నదని—అద్దె ఎక్కువైనా దిగి పోయాడు రామారావు.

వస్తూనే భార్యని కౌగిట్లోకి తీసుకోబోయాడు.

వనజ అందంగా విసుక్కుంది.

"అబ్బ, మీ మొగాళ్ళకి అంతా ఆత్రమే! ఆ మాత్రానికి సినిమాకెందుకు రమ్మని నా ప్రాణం తియ్యాలి? ఇంట్లోనే వుంటే పోలా?"

"ఇంట్లో వుంటే సినిమా చూసిన మజా వస్తుందా?"

"సినిమాలో మాత్రం మీరు తెరమీది బొమ్మలు ఏమన్నా చూస్తే కదా!"

"అదేమిటోయ్, సినిమా ఫాలో కాలేదనుకొన్నావా? కథంతా టకటక చెప్పేయ్యనా?"

"వద్దు లెండి, మళ్ళీ యిదో బోరా నాకు?"

"మరి, చూళ్ళేదంటున్నావు కదా?"

"చూడటం వేరు, సినిమాలో లీనమై చూడటం వేరు! ఇక అల్లరి చెయ్యకుండా పడుకోండి, నాకు నిద్ర వస్తోంది."

"ఛ, వెధవ నిద్రని పక్కకి పెట్టెయ్యి. కొత్తగా పెళ్ళయిన దంపతులు కొన్నేళ్ళవరకు నిద్రపోరాదని ఎవరో ప్రేమకవి చెప్పాడు, నువు వినలేదా?"

"మహాశయా, యిప్పుడు కవిత్వాలు కథలు వద్దుగాని, లైటు తీసేసి పడుకోండి."

"ఉండు బాత్రూంకి పోయొస్తాను."

రామారావు పెరటి తలుపు తెరుచుకుని బయటకి రాబోయిన వాడల్లా చటుక్కున ఆగాడు. పెరట్లో ఎక్కడో చప్పుడు. దొంగ కాదుకదా?

లైటు వెయ్యబోతే వెలగలేదు. వెధవ బల్బులు అస్తమానూ మాడిపోతున్నాయేమిటిలాగ? — అనుకున్నాడు. కళ్ళు చికిలించి చూశాడు. గోడ పక్కగా ఏదో ఆకారం- తెల్లటి ఆకారం—కదుల్తోంది.

నడుస్తోందో, గాల్లో తేల్తున్నదో అర్థం కావటం లేదు. రామారావుకి గుండె ఓ క్షణం ఆగి కొట్టుకుంది. దయ్యా లున్నాయని చాలా కథలు చదివాడు, చెప్పగా విన్నాడు. అతనికి దయ్యాలమీద నమ్మకం వుంది. ఇదేదో దయ్యం లాగానే వుంది.

అతని మగ మనసు ధైర్యంగా పోయి, అదేమిటో చూడమని పురిగొల్పుతున్నా, దయ్యాలమీది నమ్మకం సాహసం చెయ్యొద్దని హెచ్చరిస్తోంది!

ఆ ఆకారం కదిలి వస్తోంది.

రామారావుకి ధైర్యం చాలటంలేదు.

చటుక్కున లోపలికొచ్చి తలుపులు వేసుకున్నాడు.

2

పెరట్లోంచి పరుగు పరుగున లోపలికొచ్చి పడింది వసంత.

"అమ్మా! అమ్మా!" తల్లిని తట్టి లేపింది.

ఆయాసపడి పోతోంది, వణికిపోతోంది. జానకమ్మ చటుక్కున లేచింది.

"ఏమిటే, ఏమిటే కంగారు?" ఆత్రుతగా అడిగింది.

"అమ్మా, పెరట్లో ఏదో దయ్యంలా వుందే!"

"దయ్యమా, ఏమన్నా జడుసుకున్నావేమిటే?"

"నిజం అమ్మా! ఆ దయ్యాన్ని చూడగానే నా పై ప్రాణాలు పైనే పోయాయి."

"ఈ టైంలో బయటికెందుకు పోయావు? ఇప్పుడు టైమంతయింది?"

"పన్నెండు దాటిందే! బాత్రూంకి పోదామని వెళ్ళాను. దయ్యం కనిపించింది. వెంటనే పారిపోయి వచ్చేశాను."

"హాల్లో మీ నాన్నగారు పడుకుని నిద్రపోతున్నారు. వెళ్ళి లేపు!"

"నువ్వే వెళ్ళవే! నాకు భయంతో కాళ్ళాడటం లేదు."

"పిరికి భడవ! ఉండు నేనే వెళ్తాను."

"నాన్నగార్ని లేపవా?"

"అసలు నువ్వేదో భ్రమపడి వుంటావు. నే చూసి వస్తానుండు."

జానకమ్మ తలుపుతీసి పెరట్లోకి వెళ్ళింది.

పెరట్లో ఎవరూ లేరు! ఎలాంటి అలికిడీ లేదు.

"ఏమిటి జానకీ, ఏమిటి వెతుకుతున్నారు?" పరంధామయ్య మాట విని వెనుతిరిగి చూసింది జానకమ్మ.

"మన వసూ పెరట్లో ఏదో దయ్యం చూశానని చెప్పిందండి! వచ్చి చూస్తే ఏమీ లేదు."

"నన్ను లేపకపోయారా? అలికిడికి నాకు మెలకువవచ్చి చూస్తే మీ యిద్దరు పెరట్లోకి వస్తున్నారు. బాత్రూంకి అనుకున్నాను. ఇంతికీ, వసంత ఏమయినా భయపడిందేమో! జడుపు జ్వరం వచ్చేనూ! .... ఏమ్మా, వసూ! ....భయపడ్డావా?"

కూతుర్ని లాలనగా అడిగాడు.

"అవునండి నాన్నగారూ? పెరట్లో తెల్లటి ఆకారం కని

పించగానే గుండె ఝల్లుమంది. వెంటనే లోనికి పరుగెత్తి కొచ్చేశాను. ఇంకా గుండెలు వేగంగా కొట్టుకుంటూనే వున్నాయి."

"పిచ్చి తల్లీ! దయ్యం లేదు, ఏమీ లేదు. పద, పడుకొందువు" కూతుర్ని రెక్క పట్టుకుని లోపలికి తీసుకు వచ్చాడు పరంధామయ్య.

3

"నా పేరు లోకనాధం. ఈ వూళ్ళో నాకు మూడు యిళ్ళున్నాయి. అన్నీ కిరాయి కిచ్చేశాను. ఓ అవుట్ హౌస్ కట్టుకుని మా పురాతనమైన యింట్లో కాలక్షేపం చేస్తున్నాం" అన్నాడతను.

డిటెక్టివ్ కిరణ్ తలూపాడు.

"మీతో పనిబడి వచ్చాడు."

"చెప్పండి."

"మరేం లేదు సార్. రామకృష్ణరావు పేటలో వున్న మా యిల్లు దయ్యాలకొంపగా పేరుబడి పోయింది. నెల రోజుల క్రితం నాలుగు కుటుంబాలతో పిల్లాపాపల్తో కళకళలాడ్తున్న యిల్లు యిప్పుడు పాడుబడిన శిథిలాలయంలా అయిపోయింది."

"ఏం, ఆ కుటుంబాలవాళ్ళు ఎందుకు వెళ్ళిపోయారు?"

"అదే బాబూ, ఆ కొంపలో ఏదో దయ్యం తిరుగుతోందని చెడ్డపేరొచ్చేసింది. ఆ నాలుగు వాటాల వాళ్ళు కూడ బలుక్కొని ఒకటి రెండు రోజుల తేడాలో ఖాళీ చేసేశారు. అడ్వాన్సులు కూడా వదిలేసుకున్నారు."

"ఆ తర్వాత ఆ యింట్లో ఎవరూ దిగలేదా?"

"అతి కష్టంమీద ఓ దంపతులు ఓ పోర్షన్‌లో దిగారు.

వాళ్ళుకూడా దయ్యం కనబడిందట. రాత్రికి రాత్రే లేచిపోయి నాలుగు వాటాలున్న కొంపలో ఒంటరిగా మేముండలేమని ఖాళీచేసేశారు దిగిన వారం రోజులకే!"

"తర్వాత?"

"ఆ తర్వాత మరో కుటుంబం దిగిందండి. ఆమె హార్టు పేషంటుట. దయ్యాన్ని చూసి మూర్ఛపడిపోయింది. పల్సు డౌనయిపోయిందట. వెంటనే హాస్పిటల్లో చేర్పించారట. పరిస్థితి ప్రమాదకరంగా వుందని తెలిసింది. వాళ్ళుకూడా వెంటనే ఖాళీ చేసేసి ఏకంగా అందరు హాస్పిటల్లోనే మకాం పెట్టేశారండి పేషెంటుతోబాటు."

కిరణ్ వచ్చే నవ్వు నాపుకున్నాడు.

"తర్వాత యింకెవరూ దిగలేదా?"

"ఇంకెవరు దిగుతారు బాబూ, ఆ యింట్లో దిగినవాళ్ళు సరాసరి స్వర్గానికి వెళ్ళిపోతున్నారని మరో అపనింద వచ్చింది. అదీగాక వారం తిరక్కుండా ప్రతివాళ్ళు ఖాళీ చేస్తున్నారు, యీ యిల్లు అచ్చిరాలేదని. దోషముందని టాంటాం అయిపోయింది."

"పోనీ మీరే అందులో కాపరం పెట్టి, అసలు ఆ దయ్యం సంగతి తేల్చుకోక పోయారా?"

"బాబూ, వేళాకోళమా! అసలే నేను బి.పి. పేషెంటుని. హార్ట్ వీక్‌నెస్‌కూడా వుంది. ఇల్లు ఖాళీగా పాడుపడి పోయినా సరే వదిలేస్తానుగాని, ప్రాణాలు వదులుకోలేను. ఇప్పుడు దాన్ని సగం ధరకు అమ్మబోయినా కొనటానికి ఎవరూ ముందుకు రావటం లేదు—"

"మరి యీ విషయంలో నేను మీకే విధంగా సహాయ పడగలను?"

"మీరైతేనే యీ సమస్యకి పరిష్కారం చూపిస్తారని

మీ దగ్గిరకొచ్చాను బాబూ! ఆ యింటి సంగతేమిటో కూలం కషంగా మీరు పరిశోధించాలి. నిజంగా దయ్యం వుందా, లేక నా దురదృష్టవశాత్తు అలా చెడ్డపేరు వచ్చేసిందా— అని మీరు తెలుసుకోవాలి. అందుకు మీరు ఎంత ఫీజు అడిగినా యిచ్చుకుంటాను."

కిరణ్ సాలోచనగా అతని వంక చూశాడు.

"సరే, యీ కేసు నేను తీసుకుంటాను. ఈ రాత్రికే ఆ యింట్లో మకాంపెట్టి దయ్యం అజ కనుక్కుంటాను. సరేనా?" అన్నాడు.

లోకనాథం సంతోషంగా తలూపాడు.

"ఇదిగో బాబూ, తమ ఫీజు!"

రాత్రి పది రటింది.

కిరణ్ దయ్యాల కొంపలో మకాం చేశాడు కోటు జేబులోని రివాల్వర్‌ని తడుముకున్నాడు. ఏ చిన్న శబ్దం అయినా ఎంతో కాషస్‌గా చూస్తున్నాడు.

పదకొండయింది, పన్నెండయింది.

దయ్యం జాడలేదు.

పెరట్లో ఏదో చప్పుడయింది.

శబ్దం కాకుండా పెరట్లోకి వెళ్ళి చూశాడు.

పందికొక్కుల చప్పుడు!

తెల్లవారే లోపల నాలుగు వాటాలలోను గడిపాడు ఒక దాని తర్వాత ఒకటిగా.

తెల్లగా తెల్లవారిపోయింది.

దెయ్యం జాడలేదు.

కిరణ్ బయటకి వస్తుండగా గుమ్మంలోనే ఎదురయ్యాడు లోకనాథం.

"ఏం సార్, దయ్యం కనిపించిందా?"

"లేదండి. ఈ రోజుకూడా చూస్తాను."

"నాకు ముందే తెలుసండి. దయ్యం లేదు, ఏం లేదు. నా విరోధు లెవరో కావలని పన్నిన పన్నుగడ యిది! నా యిల్లును పాడుబెట్టాలని వాళ్ళ దురుద్దేశం!"

"మీకు విరోధు లెవరున్నారు?"

"ఏం చెప్పగలనండీ! పైకి అందరూ బాగానే వుంటారు, బాగానే మాట్లాడతారు. ఎవడి మనసులో ఏం కుళ్ళుంటుందో తెలీదుకదా!"

"సరే. రేపు ఉదయం మళ్ళీ కనిపించండి."

లోకనాథం వెళ్ళిపోయాడు.

5

మర్నాడు రాత్రి కూడా కిరణ్ లోకనాథం యింట్లో గడిపాడు. దయ్యం జాడలేదు.

అతనికి పరిస్థితి అర్ధమయిపోయింది.

లోకనాథం అనుమానం నిజమే! కావలనే ఎవరో దయ్యం పేరుతో అద్దెకున్న వాళ్ళని అదరగొట్టి, ఖాళీ చేయించేశారు. దాని మూలాన ఎవరికి లాభం?

కిరణ్‌కి మస్తిష్కంలో ఏదో మెరిపింది.

అదే అయింటుంది?

తెల్లవార్తునే లోకనాథం ఆత్రుతగా వచ్చాడు.

కిరణ్‌ని చూసి నమస్కారం చేసి, "ఏం సార్, ఏమయినా...." అన్నాడు. అర్ధోక్తిలోనే ఆపేస్తూ.

"మీ యింట్లో యిదివరకు నాలుగు కుటుంబాలుండేయని చెప్పారు కదూ! వాళ్ళు యిప్పుడెక్కడుంటున్నారో చెప్పగలరా?" అనడిగాడు కిరణ్ లోకనాథంని.

"ప్రస్తుతం ఎక్కడున్నారో యిళ్ళు తెలీవు సార్!

ఆఫీసు అడ్రసులు యివ్వగలను."

"నలుగురు ఉద్యోగస్థులేనా?"

"అవునండి. ముగ్గురు గవర్నమెంటు, ఒకాయన ప్రయివేటు కంపెనీ."

"సరే, చెప్పండి."

"రామారావు అనే ఆయన ఎలక్ట్రిసిటీ బోర్డులో పని చేస్తున్నాడండి. పురుషోత్తంగారని, ఆయన లెక్చరరు. ఆర్ట్స కాలేజిలో పనిచేస్తున్నారు. పరంధామయ్యగారని మరో ఆయన ఇన్‌కంటాక్స్‌లో వున్నారు. రంగనాథం గారు ఓ ప్రయివేటు ట్రాన్స్‌పోర్టింగ్ కంపెనీలో పని చేస్తున్నారు. ఇవీ వారి గురించిన వివరాలు."

కిరణ్ రాసుకున్నాడు.

* *

డిటెక్టివ్ కిరణ్ ఓ లారీలో సామాను లోడ్‌చేసి లోక నాథం యింటిముందు దింపించాడు.

రెండు పోర్షన్స్‌కి కర్టెన్లు కట్టించాడు.

సామాను ఆ రెండు పోర్షన్స్‌లోను సర్దించాడు.

పెరటి వైపు నించి తాళాలు వేయించాడు.

తర్వాత సరాసరి ఎలక్ట్రిసిటీ బోర్డుకిపోయి రామారావుని కల్సుకున్నాడు. రామారావు ఆఫీసులోనే వున్నాడు.

"మీరిదివరలో వుండిన యిల్లు ఎందుకు ఖాళీ చేశారండి?" అనడిగాడు కిరణ్.

"మీరేం చేస్తుంటారు? ఎందుకు మీకా వివరాలు?" అనడిగాడు రామారావు.

"నేను కొత్తగా ఈ వూరు ట్రాన్స్‌ఫరయి వచ్చానండి. ఎక్కడా యిల్లు దొరకలేదు. రామకృష్ణారావు పేటయితే నాకు ఆఫీసుకి దగ్గిరగా వుంటుందని ఎంక్వయిరీ చేస్తే

లోకనాథంగారి యిల్లు మొత్తం ఖాళీగా వుందన్నారు. వెళ్ళి ఎంక్వయిరీ చేస్తే అది దయ్యాల కొంపని, దయ్యాలు అందులో దిగిన వాళ్ళని పీడించుకు తింటున్నాయనీ చెప్పారు. నిజమేనా అనడిగితే, ఇదివరలో మీరు అందులో వుండేవారని, అడ్రసు చెప్పి, పోయి కనుక్కోమన్నారు. ఆ విషయం నిజమో కాదో, మరే కారణంచేత మీరు ఖాళీ చేశారో తెల్సుకుందామని వచ్చాను.''

''మీరు విన్నది నూటికి నూరుపాళ్ళు నిజం! స్వయంగా నా కళ్ళతో చూశానండి బాబూ, ఆ దెయ్యాన్ని. ఖాళీచేసే వరకు నిద్రపట్టలేదంటే నమ్మండి! నాతోబాటు తక్కిన మూడు పోర్షన్లవాళ్ళు కూడా ఖాళీ చేసేశారు. పొరపాటున కూడా దిగకండి అందులో!'' అన్నాడు రామారావు.

''మంచి యిన్ఫర్మేషన్ యిచ్చారండి. పోర్షన్ నూట యాభై లో దొరుకుతుందంటేనే నా కనుమానం వచ్చింది. అంత చక్కటి యిల్లు యింత చీప్ ఏమిటా అనుకున్నాను. ఇదన్న మాట కథ.''

''మే మున్నప్పుడు రెండువందల యాభై ఇచ్చేవాళ్ళం. ఎవరూ రావటంలేదని తగ్గించివుంటాడు. మీకు లోకనాధమే చెప్పాడా దాని అద్దె విషయం?''

''అందులో దిగిన వాళ్ళు చెప్పారులెండి.''

''అందులో ఎవరు దిగారండీ మళ్ళీ?''

''మీకు తెలీదనుకుంటాను. రెండు పోర్షన్లు ఫిలప్ అయి నాయి. ఇక రెండు మాత్రం ఖాళీగా వున్నాయి.''

''ఎప్పుడండీ?''

''రెండు రోజు లయిందనుకుంటాను.''

''మీరు దిగకండి. మేము పడ్డపాట్లు ఏం చెప్పమన్నారు లెండి. మీ క్కావాలంటే నేను మంచి పోర్షన్ ఎంక్వయిరీ

చేసి పెడతాను. పిల్లలు, ఫేమిలీ వున్నారా?!"

"ఉన్నారండి."

"నా మాట విని మళ్ళీ ఆ యింటి విషయం తలపెట్ట కండి" అన్నాడు రామారావు సిన్సియర్‌గా.

"చాలా థాంక్సండీ! మంచి యిన్ఫర్మేషన్ యిచ్చారు. వస్తానండి!"

"ఉండండి, కాఫీ తెప్పిస్తాను."

"ఫరవాలేదు, థాంక్స్!"

కిరణ్ బయటికొచ్చి రాజ్‌దూత్ స్టార్ట్ చేశాడు.

తర్వాత పరంధామయ్యను, పురుషోత్తాన్ని, రంగ నాథాన్ని కలిసి రామారావుకి చెప్పినట్టే చెప్పాడు. వాళ్ళు తమ అనుభవాల్ని చెప్పారు. పొరపాటున కూడా అందులో దిగొద్దని చెప్పారు.

పరంధామయ్య మాత్రం, "ఆ యిల్లు లోకనాథం బేరం పెట్టాడని విన్నాను. ఇంకా యెవరూ కొనలేదా?" అనడి గాడు.

"బేరం పెట్టిన విషయం నాకు తెలీదుగానండి, రెండు పోర్షన్లలో యెవరో కొత్తగా దిగినట్టున్నారు" అని చెప్పి వచ్చేశాడు!

సరాసరి పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళాడు.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ డ్యూటీలో వున్నాడు.

7

రాత్రి పదకొండు గంటలయింది.

కిరణ్ లోకనాథం యింట్లో రెండు పోర్షన్లలోను లైట్లు వేసివుంచాడు. వీధిలోను, పెరట్లోను చీకటిగా వుంచాడు.

పదకొండున్నర ప్రాంతాల పెరట్లో చప్పుడయింది.

కిరణ్ చెవులు రిక్కించి విన్నాడు.

ఎవరో గోడ దూకిన చప్పుడు!

కిరణ్ చటుక్కున లేచాడు. చప్పుడు చెయ్యకుండా పెరటి తలుపు తీశాడు.

దొడ్లో చీకటిగా వుంది.

ఆ చీకట్లో తెల్లగా మెరుస్తున్నదో ఆకారం!

కిరణ్ ప్రక్క పోర్షన్ వైపు చూశాడు.

శ్రీనివాస్ తన బలగంతో సిద్ధంగా వున్నాడు. దయ్యం ఆ పోర్షన్‌లోకి వస్తే తనకి తెలియచెయ్యమని ముందుగానే శ్రీనివాస్‌కి చెప్పివుంచాడు కిరణ్.

అనుకోకుండా దయ్యం తనున్న పోర్షన్‌లోకే వచ్చింది ముందుగా.

కిరణ్ శ్రీనివాస్‌కి సైగచేసి, మెరుపులా పోయి ఆ తెల్లటి ఆకారాన్ని తన చేతుల్లో బంధించేశాడు.

ఆ ఆకారం పెనుగులాడింది.

ఒక్క ఉదుటన్న ఎగిరి గోడమీద నుంచి దూకాలని ప్రయత్నించింది.

కిరణ్ ఉడుంపట్టు సడలలేదు.

బిల బిలమంటూ పోలీసులు ఆ ఆకారాన్ని చుట్టుముట్టేశారు.

కిరణ్ ఆ ఆకారం ముఖంమీది ముసుగు తొలగించాడు.

"నువ్వా పరంధామయ్యా? నేనూహించింది రైటే!" అన్నాడు కిరణ్.

పరంధామయ్య ముఖాన నెత్తురుచుక్క లేదు.

కిరణ్ అతని కాళ్ళవైపు చూశాడు. ప్రత్యేకం తయారు చేసిన స్ప్రింగ్ బూట్సున్నాయి కాళ్ళకు.

"లోకనాథం యింటిని చవకగా కొట్టేయాలనే దుర్బుద్ధి

పుట్టింది నాకు. అందుకే దయ్యంలా నాటకమాడి అందర్నీ అదరగొట్టి వాళ్ళు యిల్లు ఖాళీ చేసేలాగా చేశాను. తర్వాత అది లోకనాథం ఎలాగూ అమ్మేస్తాడని నాకు తెలుసు. అలాగే జరిగింది. మా తర్వాత అందులో దిగిన వాళ్ళని కూడా అదరగొట్టి ఖాళీ చేయించాను.

లోకనాథం లక్షా యిరవై వేలు చేసే బిల్డింగుని ఏభై వేలకు అమ్మజూపాడు. ఇంకా చవగ్గా అమ్ముతాడని అప్పుడు దాన్ని నేనే కొనేద్దామనీ అనుకున్నాను. ఇంతలో ఎవరో అందులో మళ్ళీ దిగారని విని నిజమేనని నమ్మి, వాళ్ళని వెళ్ళకొట్టాలని మళ్ళీ దయ్యం వేషంతో రంగంలోకి దిగాను. కాని పట్టుబడిపోయాను" పరంధామయ్య స్టేట్ మెంట్ యిచ్చాడు. □

మరో వారం—?

ప్రియునితో పారిపోయి వచ్చింది ప్రేయసి. నెలరోజులు లాడ్జిలో కులాసాగా గడిపారు. తర్వాత—

ప్రియుడు: నీకు మీ ఊరికి తిరిగిపోవాలని ఉందా?

ప్రేయసి: మీ దగ్గర ఇంకా ఎంత డబ్బుంది?

ప్రియుడు: వేయి రూపాయలు.

ప్రేయసి: అయితే, ఇంకా వారం రోజు లుంటాను!

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

ఒకే దెబ్బకు పిట్టలెన్నో?

జొన్నలగడ్డ
రామలక్ష్మి

ఆత్మారామం ఒక్కడూ యింట్లో వున్నపుడామె వచ్చి తలుపు తట్టింది. ఆమెను చూడగానే అతడి కళ్ళు చెదిరి పోయాయి. ఆమెది రెచ్చగొట్టే అందం. మరింత రెచ్చ గొట్టే విధంగా బట్టలు వేసుకుంది.

ఆమె పేరు జానకి. ఆత్మారామం చెల్లెలుకోసం

వచ్చింది. చేతిలో చిన్న బ్రీఫ్ కేసుంది. ఏదో ఇంటర్వ్యూట. ట్రెయిన్ దిగి సరాసరి వీళ్ళింటికే వచ్చింది. మర్నాడు రాత్రికి వెళ్ళిపోతుందట. అయితే తన చెల్లెలు వూరెళ్ళింది. మరో వారందాకా రాదు.

ఆత్మారామం కంగారుపడ్డాడు. ఆమెను వెళ్ళిపొమ్మని అనలేదు. ఉండమనీ అనలేదు. అందమైన ఒంటరి ఆడ పిల్ల ఓ రాత్రంతా తనింట్లో వుంటే అభ్యంతరమేమీ లేదు తనకు. కానీ ఆమె వుంటుందా?

అతడామెను లోపలకు రానిచ్చి ఇంట్లో పరిస్థితి చెప్పాడు. దానికామె ఏమాత్రమూ చలించలేదు.

"ఉండడానికి మీకు అభ్యంతరం లేకపోతే నాకేమీ అభ్యంతరంలేదు" అన్నాడు ఆత్మారామం తెగించి.

"అయ్యోరామా! నాకు అభ్యంతర మెందుకండీ.... ఇంకా మీరే నన్ను ఏ దొంగో అనుకుంటారని భయ పడ్డాను" అన్నదామె.

రాత్రివేళ ఎవర్నీ ఇబ్బంది పెట్టకూడదని ఆమె స్టేషన్ దగ్గర భోజనం చేసే వచ్చిందట. కాసేపు కాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకున్నారు.

జానకి చాలా చలాకీ మనిషి లాగున్నది. ఆమె చలాకీ తనం ఆత్మారామాన్ని ఇబ్బంది కూడా పెట్టింది.

"నా డ్రస్సు చూసి మీరు నేను చాలా ఫాషనబుల్ గర్ల్‌ననీ, సాఫిస్టికేటెడ్ ఫామిలీ నుంచి వచ్చాననీ అను కుంటే పొరబడ్డారనే చెప్పాలి. ఈ డ్రస్సు నేను ప్రత్యే కంగా ఇంటర్వ్యూకోసమని నిర్ణయించాను. ఇలాంటి జతలు రెండున్నాయి. చీర పల్చగా—లో నెక్ జాకెట్. పైట జారాలి....ఇంక చూడండి....ఇంటర్వ్యూ చేసే ఆ మగరాయుళ్ళ మొహాలు...." అందామె.

ఆత్మారామం చాలా ఇబ్బంది పడ్డాడు ఆమె పైట జారింది. అతడి మొహంలో మార్పులు వస్తున్న మాట నిజం. అవి రాకుండా వుండాలని అతడు వృధా ప్రయత్నాలు కొన్ని చేశాడు.

ఆమె చెప్పుకుపోతోంది "ట్రయిన్లో మగాళ్ళ రియాక్షన్ చూశాక నాకు అనిపించింది. ఆకర్షణకు తిరుగులేని డ్రస్సు ఇదేనని! అయితే మీరు నాకో సలహా యివ్వాలి. ఇప్పుడు నేను వేసుకున్నది లైట్ బ్లూ కలర్! పెట్టెలో లైట్ రోజ్ కలర్ శారీ సెట్టు వుంది. ఏది నాకెక్కువ బాగుంటుందో మీరే చెప్పాలి. మీరు లైట్ బ్లూ కలర్‌దే బాగుంటుందంటే రాత్రికి రాత్రి ఈ సెట్టు ఉతికి ఆరేసుకోవాలి. సింథటిక్ కదా—ఉదయానికేమిటి—అర్ధరాత్రికే ఆరిపోతాయి" అంటూనే ఆమె బ్రీఫ్‌కేసు తెరిచి మరో సెట్టు తీసి "ఆ గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని వస్తాను" అంది.

ఆత్మారామం "ఊఁ" అన్నాడు. అసలేం జరుగుతోందో తెలియకుండా పోతోందతడికి. మనసు వశం తప్పేసింది. ఏవేవో ఆశలతడిలో రగుల్కొంటున్నాయి.

కొద్ది క్షణాల్లో ఆమె లైట్ రోజ్ కలర్ డ్రస్సులో వచ్చింది. చూస్తూనే "మార్వెలస్" అన్నాడతను అప్రయత్నంగా.

"థాంక్యూ" అన్నదామె.

"రెండు డ్రస్సులూ ఎగ్జాక్ట్లీ సేమ్‌కాదు...." అంటూ ఆమె అతడికి కొన్ని మార్పులు చెప్పింది. ఆత్మారామం ఇంకా ఇబ్బందిపడ్డాడు.

అతడి అభిప్రాయం విన్నాక ఆమె సంతోషంగా

"అయితే రాత్రికి బట్టలుతుక్కునే బాధ తప్పింది" అంటూ మళ్ళీ గదిలోకి వెళ్ళింది. వెళ్ళిన మరు క్షణంలోనే కెవ్వు మన్న కేక వినిపించింది.

ఆత్మారామం అప్రయత్నంగా గదిలోకి పరిగెత్తాడు.

"బల్లి!" అన్నదామె. ఆమె వంటిమీద బట్టలులేవు. కానీ భయంతో వణుకుతున్నదామె. బల్లి అంటే ఆమెకు భయమట.

మరి కొద్ది క్షణాల్లోనే ఆమె అతడికి బల్లిలా అతుక్కుపోయింది.

2

రెండు రోజుల అనంతరం ఆత్మరాంకు పోస్టులో ఓ కవరు వచ్చింది. అందులో రెండు ఫొటోలు, ఓ ఉత్తరం వున్నాయి.

"డియర్ మిస్టర్ ఆత్మారాం! వచ్చే గురువారం సాయంత్రం ఆరింటికి పద్మజా హోటల్-పదిహేడో నంబరు గదికి లక్ష రూపాయలు తీసుకునిరా—నా దగ్గర మొత్తం నాలుగు నెగటివ్‌లున్నాయి. అన్నీ తీసుకు వెడుదువుగాని...."

ఆత్మారామం తెల్లబోయాడు. ఏమిటీ ఉత్తరం?

జరిగిందేమిటో అతడి కర్థమయింది. జానకి తనింటికి ఎవరో పంపగా వచ్చింది. ఆ వ్యక్తి తనని బ్లాక్‌మెయిల్ చేయబోతున్నాడు. అయితే....

ఏమిటీ బ్లాక్ మెయిల్ ఉద్దేశ్యం?

తండ్రి రిటైరయ్యాడు. ఆయనకు వచ్చే పెన్షన్ నెలకు మూడొందలు. తనుద్యోగంలో జేరి రెండేళ్ళయింది. తన జీతం నెలకు ఏడువందలు. తనకో ఇరవై ఏళ్ళ చెల్లెలుంది. ఆమె పెళ్ళికి కట్నం పదివేలదాకా అడుగుతున్నారు.

తాముండేది అద్దె యిల్లు. తమకు పొలం, గట్రా ఏమీ లేదు.

ఎక్కణ్ణించి తెస్తాడు తను లక్షరూపాయలు? ఈ విషయం ఆ బ్లాక్ మెయిలర్‌కు తెలియదా? ఒకవేళ అతడీ ఫోటోలు బయటపెట్టినా పరువుపోవడానికి తను పారిశ్రామికవేత్తా కాడు, రాజకీయ నాయకుడూ కాదు. నలుగురిలో తిరగడానికి కొన్నాళ్ళు కాస్త యిబ్బందిగా వుంటుంది. అయితే అందుగురించి లక్ష రూపాయలు వెచ్చించగల స్తోమత అతడికి లేదు.

ఆత్మారామం ఆ ఉత్తరం గురించీ బ్లాక్ మెయిలర్ గురించీ గురువారం దాకా ఆలోచిస్తూనే వున్నాడు. గురువారం సాయంత్రం అతడు పద్మజా హోటల్లో బ్లాక్ మెయిలర్ని కలుసుకున్నాడు. అతడిని చూసి ఆత్మారామం ఆశ్చర్యపడ్డాడు.

తెల్లగా, పొడుగ్గా, హుందాగా_తనకంటే గొప్పవాడి లాగున్నాడు.

"డబ్బు తెచ్చావా?"

"లేదు...."

"అయితే ఈ ఫోటోలు పదిమందికీ చూపించమంటావా?"

"చూపించకపోతేనే నేను సంతోషిస్తాను. కానీ లక్ష రూపాయలు నా కెక్కణ్ణించి వస్తాయి?" అన్నాడు ఆత్మారామం.

"లక్షరూపాయలు వచ్చే మార్గం నీకు నేను చెబుతాను. చేస్తావా?"

"ఊఁ"

"సురేంద్ర మోహన్ తెలుసా నీకు?"

"తెలియదు."

"అరే-ప్రముఖ పారిశ్రామికవేత్త సురేంద్ర మోహన్ తెలియదూ నీకు? నువ్వీ విషయం అన్నట్లు ఆయనకు తెలిస్తే నీ ప్రాణాలు దక్కవు."

"అయ్యో-ఆయినా-యధాలాపంగా సురేంద్ర మోహన్ అంటే ఎవరో అనుకున్నాను. ఆయన పేరు విన్నాను...."

"ఆయన కూతుర్ని పెళ్ళి చేసుకో-ఒకటి కాదు-రెండు లక్షలు కట్నంగా ఇస్తాడు...." అన్నాడతను.

ఆత్మారామం కళ్ళు మెరిశాయి "అంత గొప్పవాడు తన కూతుర్ని నా కిచ్చి పెళ్ళి చేస్తాడా?"

"చేస్తాడు. చేసుకుంటావా?"

"ఊఁ" అని ఏదో అనబోయి ఆగిపోయాడతను—"కొంపదీసి ఆమె రూపం భయంకరంగా ఉంటుందా?"

"రూపానికేమీ లోటులేదు. అప్సరసలా వుంటుంది. ఎటొచ్చీ ఓ కాలూ, చెయ్యీ, కన్నూలేవు. అయితే సంసార జీవితానికి పనికొస్తుంది."

ఆత్మారాంకు వళ్ళు జలదరించింది—"నేనా పెళ్ళి చేసుకోను."

"ఓహ్—అయితే నీ అందం, పొజిషను చూసి ఓ అందమైన పిల్లను రెండు లక్షల రూపాయల కట్నమిచ్చి పెళ్ళి చేస్తారని అనుకుంటున్నావా?"

"నా అందం, పొజిషను చూసే కదా—నువ్వు నన్ను లక్ష రూపాయలకు బ్లాక్ మెయిల్ చేస్తున్నావు!" అన్నాడు ఆత్మారామం కసిగా.

"తెలివిగానే మాట్లాడావు-మరి నా లక్షరూపాయలూ ఎలా ఇద్దామనుకుంటున్నావు?"

"అనుకోవడంలేదు...." అన్నాడు ఆత్మారామం.

"ఈ ఫోటో నీ ఆఫీసుకు పంపిస్తే - నీ ఉద్యోగం ఊడొచ్చు. బయట ప్రచారం చేస్తే నీకెవ్వరూ పిల్లనివ్వరు. నీ చెల్లికి కూడా పెళ్ళికాదు...."

ఆత్మారామం అంతదూరం ఆలోచించలేదు. ఆలోచించగానే అవడికి భయం వేసింది. "నేనేం చేయను?" అన్నాడతను.

"లక్ష రూపాయలు సంపాదించడానికి మరో మార్గం చెబుతాను...."

"ఆ మార్గాలేవో నువ్వే చూసుకోరాదూ...."

"చూడు మిస్టర్! జామిచెట్టు దగ్గరకెళ్ళి మామిడిపండు కావాలంటే యివ్వగలదా? లక్షరూపాయలు సంపాయించగల శక్తి నీకే వుంది. అందుకే నేను నిన్నాశ్రయించాను__"

"నీ మార్గాలు నాకు నచ్చడంలేదు...."

"నా సంగతి నీకు పూర్తిగా తెలియదు. శాంపిల్‌గా నీ మీదకు ఓ అమ్మాయిని వదిలాను. మగాడివి కాబట్టి నువ్వది ఆనందించావు. నువ్వు నాకు లొంగిరాని పక్షంలో నీ చెల్లెలు...."

ఆత్మారామం ముఖం ఎర్రబడింది.

"అలా కోపంగా చూడకు. నా శక్తి యేమిటో చెబుతున్నాను...."

ఆత్మారామం చివరకు లక్షరూపాయలు సంపాదించే మార్గ మేమిటో చెప్పమని అడక్క తప్పలేదు.

"నీకు ప్రసాదరావుగారు తెలుసా?"

"ఊఁ"

"ఆయన భార్య వీరభద్రమ్మ తెలుసా?"

ఆత్మారామం తడబడ్డాడు__"ఇవన్నీ ఎందుకు నీకు?"

"ఎందుకా? ఆలోచించి చూడు. ప్రసాదరావు, వీర భద్రమ్మలకు సంబంధించి నీకేం తెలుసో చెప్పు!"

ఆత్మారామం ఆలోచనలో పడ్డాడు.

* * *

ప్రసాదరావు ఆత్మారామంకు దూరపు బంధువు. బాగా డబ్బున్నవాడు కావడంవల్ల వాళ్ళ మధ్యదూరం కూడా ఎక్కువగానే వుంది.

వీరభద్రమ్మకు ఆత్మారామమంటే అభిమానం. తన కూతుర్ని ఆత్మరామం కిచ్చి పెళ్ళి చేయాలని కూడా ఆమె అనుకుంటోంది. అందుకు ప్రసాదరావు ఒప్పుకోడంలేదు.

ఒకరోజామె ఆత్మారామంకు ప్రత్యేకంగా కబురు పెట్టింది. అతడు వెళ్ళాడు. ఇంట్లో ఆమె ఒక్కతె మాత్రమే ఉంది.

"నా దురదృష్టం కొద్దీ ఈయనకు భార్యనయ్యాను" అన్నదామె.

ఆత్మారామం మౌనంగా విన్నాడు.

"నేను కోరుకున్నది డబ్బుకాదు. అభిమానం. ఆయనకు లేని దురలవాట్లు లేవు. నాకు చీరలు, నగలు కొంటారు. తన సుఖాలు వేరేచోట వెతుక్కుంటారు. ఇంత వయసొచ్చాక ఆయనకు రెండోపెళ్ళి చేసుకోవాలనిపిస్తోంది. అదేమంటే యింత ఆస్తికీ వారసుడు లేకుండా పోయాడని బాధగా ఉందంటున్నారు. వారసత్వానికి మగబిడ్డే కాని ఆడ బిడ్డ పనికిరాదా అని దెబ్బలాడాను...." అని ఆగిందామె.

ఆత్మారామం వింటున్నాడు. ప్రసాదరావుమీద అతడికి సదభిప్రాయం లేదు. కానీ వీరభద్రమ్మ కష్టపడుతున్నట్లు అతడికి తెలియదు. ఈ ప్రపంచంలో సుఖపడాలంటే

డబ్బొక్కటే సాధనం కాదని అతడు గ్రహించాడు.

వీరభద్రమ్మ చెప్పుకుపోతోంది.

తను రెండో భార్యగా తెచ్చుకోదల్చుకున్న యువతిని ప్రసాదరావు భార్యకు చూపించాడు. ఆమె వీరభద్రమ్మను అక్కయ్యా అని ఆప్యాయంగా పిలిచింది. ఆ యింట్లో తను దాసీదానిలా పడివుంటానంది. ప్రసాదరావును తను ప్రేమిస్తున్నాననీ, అతడు లేకపోతే బ్రతకలేననీ అంది.

"అయితే చావు!" అంది వీరభద్రమ్మ.

"అది చస్తే నేనూ చస్తాను" అన్నాడు ప్రసాదరావు.

"అయితే ఇద్దరూ కలిసే చావండి" అంది వీరభద్రమ్మ.

"అయ్యో-అయ్యో-నన్నెన్ని మాటలైనా అనండి. వారి నేమన్నా సహించలేను నేను" అందా యువతి.

వాళ్ళిద్దరికీ వివాహమైతే కాలేదు కానీ భార్యాభర్తల్లాగే వ్యవహరిస్తున్నారు. తనామెను వివాహం చేసుకుని తీరతానని ప్రసాదరావు మొండికేశాడు.

వీరభద్రమ్మ అతడికి కాగితం రాసివ్వాలిట. తను సంసార జీవితానికి పనికిరానిస్థితి ఏర్పడిందనీ. భర్తను సుఖపెట్టలేక పోతున్నాననీ—కాబట్టి వేరే వివాహం చేసుకోవలసిందిగా తనే బలవంత పెడుతున్నాననీ ఆమె కాగితం రాసి ఇస్తే ప్రసాదరావు ఆ యువతిని గత్యంతరంలేక ఒప్పుకున్నట్లు నటించి వివాహం చేసుకుంటాడట.

"దానికి పెళ్ళెందుకూ? ఎలాగూ దాంతో వుంటున్నారుగా. ఉంచుకున్నాననుకోండి" అంది వీరభద్రమ్మ.

"పెళ్ళి చేసుకోకపోతే నాకు వారసుడెలా వస్తాడు?" అన్నాడు ప్రసాదరావు.

"చస్తే మీకా కాగితం రాసివ్వను" అంది వీరభద్రమ్మ.

"రాసివ్వకపోతే చస్తావు...." అన్నాడు ప్రసాదరావు.

అతడామెను బెదిరించాడు—ఆమెను ఇంట్లో ఉరితీసి తనే ఆత్మహత్య చేసుకున్నట్లు అందర్నీ నమ్మిస్తాడట. అప్పుడు హాయిగా ఆ యువతిని పెళ్ళి చేసుకుంటాడట.

"చస్తావో, కాగితం రాసిస్తావో ఆలోచించుకో" అన్నాడు ప్రసాదరావు.

అతడామెకు ఎన్నో ఆశలు కూడా చూపించాడు. ఆ ఆస్తిలో సగం వీరభద్రమ్మ పేరున రాస్తానన్నాడు. ఆమెను ఎంతో గౌరవంగా అభిమానంగా చూసుకుంటానన్నాడు. ఆ యువతిచేత ఆమెకూడిగం చేయిస్తానన్నాడు.

దేనికీ వీరభద్రమ్మ లొంగలేదు. భర్తను తనతోపాటు మరో స్త్రీ పంచుకోవడం ఆమెకు రుచించలేదు.

"అనవసరంగా ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నావు. నిన్ను చంపైనాసరే దాన్ని పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు ప్రసాదరావు.

అతడు వీరభద్రమ్మకు రెండురోజులు గడువిచ్చాడు. ఈ రోజుతో గడువుకాలం ముగుస్తుంది.

"పరిస్థితి నా చేయి దాటిపోయిందనిపిస్తోంది. నేను చావుకైనా సిద్ధపడతానుగానీ బ్రతికుండగా ఈ పెళ్ళికి ఒప్పుకోలేను. ఇంట్లో పెళ్ళీడు ఆడపిల్ల వుండగా ఈయనకిలాంటి పాడుబుద్ధి పుట్టడం నా దురదృష్టం" అంది వీరభద్రమ్మ.

"నేనేం చేయ్యనత్తయ్యా!" అన్నాడు ఆత్మారామం.

"ఆయన నన్నెలా చంపాలనుకుంటున్నారో నాకు చెప్పారు. అదే విధంగా చంపుతారేమోనని నా భయం. చస్తానన్న భయం నాకులేదు. నేను గనుక హత్య చేయబడితే ఆయన నేరం బయటపడాలి. ఆయన జైల్లోకి

వెళ్ళాలి. అప్పుడు నువ్వు నీ మరదల్ని పెళ్ళి చేసుకుందుకు ఏ అడ్డూ వుండదు. ఆ విధంగా నా ఆత్మ శాంతిస్తుంది. ఆయనతో నేను పడుతున్న ఇబ్బందులూ, ఆయన బెదిరింపులూ సవివరంగా స్వదస్తూరీతో రాసి నీ కిస్తాను. నేను హత్య గావించబడితే ఆ ఉత్తరం నువ్వు పోలీసుల కివ్వాలి—"

వీరభద్రమ్మ ఉత్తరం రాసి ఆత్మారామం కిచ్చింది. అతడది యింట్లో భద్రంగా దాచాడు. ఆ మర్నాడుదయం ప్రసాదరావు స్వయంగా ఆత్మారాంను కలుసుకున్నాడు.

"నేను తననేం చేసినా నువ్వు నన్ను పోలీసులకు పట్టిస్తావని పేల్తోంది మీ అత్తయ్య. నా సంగతి నీకు తెలియదు. నువ్వు వెధవ పనులేం చేసినా నన్ను నేను రక్షించుకో గలను. కానీ ఆ తర్వాత నిన్ను నువ్వు రక్షించుకో లేవు—" అంటూ ప్రసాదరావతడిని తీవ్రంగా హెచ్చరించాడు.

ప్రసాదరావుకు డబ్బుంది. ఆ డబ్బుతో అతడు పోలీసుల్ని కూడా కొనేయగలనన్న నమ్మకంతో వున్నాడు. అతడి హెచ్చరికకు ఆత్మారామం భయపడ్డాడు.

ఆ రోజే వీరభద్రమ్మ ఆత్మహత్య చేసుకుని చచ్చిపోయింది. చనిపోయే ముందామె ఉత్తర మొకటి రాసింది. దస్తూరీ హడావుడిగా, చిందరవందరగా రాసినట్లుంది. సంతకం ఆమెదే!

"నాకు మగ సంతానం లేదు. నేనుండగా నా భర్త మరో వివాహానికి అంగీకరించడం లేదు. ఆయనకు వారసుడు లేకుండా పోవడం నా కిష్టం లేదు. ఇందుకు నా చావు తప్ప దారి లేదనిపించింది—" అని వ్రాసిందామె.

ఆమెది ఆత్మహత్య కాదనీ—హత్య అనీ ఆత్మారామంకు

తెలుసు. అందుకు అవసరమైన సాక్ష్యం కూడా వుంది. కానీ అతడు ప్రసాదరావుకు భయపడి నోరు మూసుకుని ఊరుకున్నాడు.

ఇప్పటికి వీరభద్రమ్మ చనిపోయి మూడు వారా లయింది.

*　　　*　　　*

"వీరభద్రమ్మకో తమ్ముడున్నాడు. అతడికి అక్కంటే పంచప్రాణాలూను. అక్క పాడిన పాట లున్న కేసెట్టే అతడు బావ నడిగి తీసుకువెళ్ళాడు. ఆ పాటల మధ్య— వీరభద్రమ్మ నీతో చేసిన సంభాషణ రికార్డయింది. అదతను విన్నాడు...." అన్నాడు బ్లాక్ మెయిలర్.

"ఇది చాలా తమాషాగా వుంది—" అన్నాడు ఆత్మా రామం.

"వీరభద్రమ్మ కిది అలవాటే నట. ఎవరితోనైనా మాట్లాడుతున్నప్పు డామె అప్రయత్నంగా టేపురికార్డరు— రికార్డింగ్ స్విచ్ నొక్కుతూంటుంది. అలాగే ఇప్పుడూ జరిగి వుండాలి. లేక కావాలనైనా ఆమె అలా చేసి వుండాలి. ఏమయితేనేం ఆమె తమ్ముడి కిది తెలిసింది. అతడికి ప్రసాదరావుమీద మంట పుట్టింది. అతడి నేరాన్ని బైటపెట్టాలని పట్టుబట్టాడు. నిన్ను చూచాయగా కదిపి చూశాడు. నువ్వు ప్రసాదరావంటే భయపడుతున్నావనీ నీ నుంచి ఆ సమాచారం మామూలుగా బైటపడదనీ తెలుసు కున్నాడు. అప్పుడు నేను అతడి కోరికమీద రంగంలోకి దిగాను. ఇప్పుడు నీ దగ్గర వున్న ఆ వుత్తరం విలువ లక్ష రూపాయలు. అది నాకు అందజేసి ఈ నెగెటివ్‌లు తీసుకుని పోవచ్చు—" అన్నాడు బ్లాక్ మెయిలర్.

"ఆ వుత్తరం బయట పెడితే ప్రసాదరావు నన్ను........"

"నువ్వు భయపడకు. నీ పేరు బయటకు రానివ్వడం జరుగదు. వచ్చినా నువ్వు ప్రసాదరావు కంటె బలవంతుడి రక్షణలో వుంటావు. ఓ దుర్మార్గుడిని ఉరికంబ మెక్కించ డానికి నువ్వు చేస్తున్న సాయం నీ భవిష్యత్తుకు మంచి బాట వేయగలదు...."

"అయితే ముందు నా కా నెగెటివు లివ్వు...."

"నోనో! వుత్తర మిచ్చాకనే నెగెటివ్సు...."

"ఉత్తర మిచ్చాక నువ్వు నన్ను మోసం చేస్తే....?" భయంగా అడిగాడు ఆత్మారామం.

"మోసంచేసి నేనేం బావుకుంటాను. నువ్వేమైనా రాజకీయ నాయకుడివా, పారిశ్రామికవేత్తవా—బ్లాక్ మెయిల్ చేస్తే పరువుపోతుందనుకుందుకు. నీ నుంచి ఈ వుత్తరం ప్రయోజన మండడంవల్ల తప్పితే నిన్ను బ్లాక్ మెయిల్ చేయాలనుకునేటంత చచ్చు వెధవెవడూ వుండడు...."

ఆత్మారామం ముఖం చిన్నబోయింది. అయితే ఆలోచించాడు.

అత్తయ్య తన సమర్థతను విశ్వసించి ఓ పని తనకు అప్పజెప్పింది. ఆమె ఆత్మకు శాంతి కావాలంటే ఆ పని పూర్తిచేయాలి.

అతడా వుత్తరం బ్లాక్ మెయిలర్ కందజేయాలని నిర్ణయించుకున్నాడు. అందువల్ల మరో లాభముంది. ప్రసాదరావు జైలు పాలయితే ఆయన కూతుర్ని తనే వివాహం చేసుకొనవచ్చు. అడ్డేవా రుండరు. అదీకాక అది కన అభీష్టమని వీరభద్రమ్మ వుత్తరంలో రాసింది.

3

ప్రసాదరావు నేరం ఋజువయింది. అతడు జైలుపా లయ్యాడు. ఆయన కుమార్తె సుమలత ఒక్కసారిగా దిక్కులేని దయింది. ఆమెను సమయానికి ఆత్మారామం తలిదండ్రులు పెద్ద దిక్కుగా ఆదుకున్నారు.

ఆత్మారామం యిప్పుడు సుమలత సాహచర్యం కోసం తహ తహ లాడుతున్నాడు. ఆమె తనది కాగలదని ఆశ పడుతున్నాడు. యెటొచ్చీ మర్యాదకు కొద్ది వారాలు ఆగాడు.

ఒక రోజున ఆమెతో యేకాంతం కల్పించుకుని తనామెను ప్రేమిస్తున్నాననీ, పెళ్ళి చేసుకుంటాననీ అన్నాడు.

"వద్దు బావా! నువ్వు పిరికివాడివి. పిరికివాళ్ళతో నేను సుఖపడలేను. నీకై నువ్వే ధైర్యంచేసి నీ దగ్గరున్న ఆ వుత్తరం బయటపెట్టి వుంటే నేను చాలా సంతోషించే దాన్ని. నీ పిరికితనం మన మధ్య దూరాన్ని సృష్టించింది" అంది సుమలత అదోలా.

"అదేమీ కాదు. నేను మి నాన్నను నేరస్థుడిని చేశానని నీకు నా మీద కోపం. అవునా....?" అన్నాడు ఆత్మారామం.

సుమలత నవ్వి—"నా ప్రాణానికి ప్రాణమైన అమ్మను —మరో ఆడదానిమీది వ్యామోహంతో పొట్టబెట్టుకున్న ఆ కిరాతకుడంటే చిన్నతనం నుంచీ నాకు ద్వేషమే! నిన్ను కాదనడానికి కారణం వేరే వుంది—" అంది.

"ఏమిటది?"

"నేను నా భర్తను మరో ఆడదానితో పంచుకోలేను."

అంది సుమలత.

"అంటే?"

సుమలత అతడికో కవరు అందించింది. అందులో రెండు ఫోటో లున్నాయి. ఆ ఫోటోలు ఆత్మారామంకు పరిచితమైనవే!

"ఆ బ్లాక్ మెయిలర్ యెంతపని చేశాడు?" అన్నాడు ఆత్మారాం.

"ఎంతపని చేసినా అది కేవలం నా కోరికమీదనే! కాసెట్టులో అమ్మ మాటలు విని నేను మామయ్యకు చెప్పాను. ఆయన ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లు—నాన్న నేరాన్నీ, నీ మనోదౌర్బల్యాన్నీ కూడా ఋజువు చేశాడు. అందుకే అన్నాను—నువ్వు పిరికివాడివి కాకుండా వుంటే బాగుండేదని! అప్పుడీ వుత్తరాన్ని ముందే పోలీసుల కిచ్చి—అటు నాన్నను జైలుకు పంపి—ఇటు నా ప్రేమాభిమానాలను పొందగలిగేవాడివి. నువ్వు తప్పు చేశావని తెలుసు. నిన్నింక నా జీవితంలోకి ఆహ్వానించలేను...."

ఆత్మారామం దిగులుగా ఆ ఫోటోల వంకనే చూసుకుంటూ "బ్లాక్ మెయిలర్! నీ ఫోటోలు నా జీవితాన్ని నాశనం చేశాయి—" అనుకున్నాడు.

ఓ సంవత్సరం గడిచేక ఆ బ్లాక్ మెయిలర్ సుమలతకు భర్త స్థానం ఆక్రమించగా—ఒకే దెబ్బకు అతడెన్ని పిట్టల్ని కొట్టాడా అని లెక్క చూసుకోసాగాడు ఆత్మారామం! ఆ పిట్టల్లో తనూ ఒకడన్న యదార్థం మాత్రం అతడికి తెలుసు. □

గిరిజశ్రీ భగవాన్

సీరియల్

మృత్యుతార

(గత సంచిక తరువాయి)

18

"ప్లీజ్! తొందరపడవద్దు! తొందరపడి ఒక నిర్ణయానికి రావడం ఎవ్వరికీ మంచిది కాదు నర్సన్! శాంతించండి! ఆలోచిద్దాం!" అన్నాడు గాడ్‌ఫాదర్ బలవంతాన

చిరునవ్వు నవ్వుతూ.

"యస్. యస్. నిదానం ప్రధానం! మీ లాంటి మేధావులు తొందరపాటుతో యిలాంటి నిర్ణయాలు ముందుగానే చేసుకోవడం తగదు!" అన్నాడు హిట్లర్ తేరుకుంటూ.

"నేను తొందరపడ్డానా? అని మీ రంటున్నారా?" సీరియస్‌గా అన్నాడు నర్సన్. ఆ యిద్దరి మొహాల్లోకి తీక్షణంగా చూస్తూ "భూమండలంమీద ఆధిపత్యం చేజిక్కించుకోవాలని నేను కుట్ర పన్నానా? మరో లోకపు సార్వభౌమాధికారాన్ని ఆశించానా? స్వార్థంతో విశ్వవిజేత ననిపించుకోవాలని పథకాలు వేశానా? ఏమిటి నా తొందరపాటు? మాకూ, మా లోకానికీ అపకారం తలబెట్టజూస్తున్న మిమ్మల్నీ, మీ లోకాన్నీ సర్వనాశనం చేసి నా వాళ్ళని రక్షించుకోవాలని ఆశించడం తొందరపాటా? నేరమా?" అని రెట్టించాడు తీవ్రస్వరంతో.

గాడ్ ఫాదర్, హిట్లర్ మొహాలు చూసుకున్నారు! ఆ ప్రశ్నలకి వాళ్ళు జవాబులు చెప్పలేదు! ఏదో ఒకటి వెంటనే చెయ్యకపోతే వాళ్ళకి ముప్పు తప్పదు! నాశనమైపోతారు!

"తొందరపాటు—అన్న పద ప్రయోగాన్ని ఉపసంహరించుకుంటున్నాను నర్సన్! మా పద్ధతి మాకు న్యాయంగా తోచినట్లే మీ పద్ధతి మీకూ న్యాయమే అనిపిస్తోంది! కనుక ఆ పదం వాడినందుకు ముందుగా మీకు క్షమాపణలు చెప్పుకుంటున్నాను. కనుక, మనం ఒక ఒప్పందానికి వద్దాం. అది అందరికీ మంచిది" అన్నాడు గాడ్‌ఫాదర్, ఒక మెట్టు కిందికి జారిపోతూ రాజీ ధోరణిలో! అతను ఒక్క మెట్టే దిగాడు! ఇంకా చాలా మెట్లు దిగాలి! దిగుతాడో? దిగినట్లే

నమ్మింపజేస్తూ కొత్త ఎత్తుగడ యేదైనా వేస్తాడో? చద రంగం ఆడటంలో అతను ఘటికుడు!

"ఒప్పందమా? మీతోనా? యెందుకు? అంత అవసరం నా కేమిటి?" మళ్ళీ రెట్టించాడు నర్సన్.

"నిజమే! మాతో ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సిన అవసరం యీ క్షణాన్న మీకు లేదు నర్సన్! ఒప్పుకుంటు న్నాను! కానీ, అలాంటి అవసరాన్ని కల్పింప చెయ్యగల శక్తి నాకున్నదని మాత్రం మీరు మర్చిపోవద్దు! నే నేం ఆషామాషీ మనిషిని కాను! ఒక గ్రహానికి నియంతని! సర్వ శక్తియుతుడినైన సర్వాధికారిని! మీ లోకాన్ని రక్షించుకోవాలనే తలంపు మీ కున్నట్లే, నా లోకాన్ని కాపాడుకోవాలనే లక్ష్యం నాకూ వుంది! ఆ ఆశతోటే మీతో రాజీ బేరానికి వచ్చాను! అది సాధ్యమని తేలితే, నేనూ, నా లోకమూ నశించిపోవడం అనివార్యమైతే, అంత కంటే ముందే మీ భూలోకా న్నంతటిని ధ్వంసం చేసే స్తాను. పొడి పొడిగా, నుగ్గు నుగ్గుగా చేసిపారేస్తాను. మైండిట్" అన్నాడు గాడ్ ఫాదర్ సీరియస్‌గా.

"మా భూలోకమంటున్నారు—మీది మాత్రం భూలోకం కాదా?" చటుక్కున ప్రశ్నించాడు నర్సన్. వెంటనే హిట్లర్ తలపంకిస్తూ "కాబట్టే తిప్పలు పడుతున్నాం" అనేసి, అలా నోరుజారినందుకు నాలిక కర్చుకున్నాడు.

"యూ షటప్ హిట్లర్...." గర్జించాడు గాడ్‌ఫాదర్. తీక్షణంగా నర్సన్‌వైపు చూస్తూ "మరోసారి మాటల్తో మమ్మల్ని బోల్తాకొట్టించే ప్రయత్నం చెయ్యవద్దని ఆఖరి సారిగా హెచ్చరిస్తున్నాను నర్సన్! నన్ను రెచ్చగొట్టి రహస్యాలు రాబట్టాలనుకోవడం వృధాప్రయాస! శ్రద్ధగా వినండి! గంటలోగా యీ సైకిలాబ్‌ని ధ్వంసం చేసే

బాంబుని మీరు వెంటబెట్టుకొచ్చారు. సంతోషం. ఆ బాంబు పేలి యీ స్కైలాబ్ ధ్వంసం కావడానికి యింకా యాభై నిమిషాల వ్యవధి వున్నది. అదే జరిగేటట్లయితే, మరి నేనేం చేస్తానో మీరూ తెల్సుకోండి...." అంటూ చకచక కుడివైపు నున్న మరో కంట్రోలింగ్ పానల్ దగ్గరికి వెళ్ళాడు.

టెలీప్రింటర్ డిస్ప్లే స్క్రీన్‌తో నిర్మించబడిన ఆ పానల్‌మీద భూగోళభౌతిక స్వరూపం, ఖండాలు, దేశాలూ రేఖా రూపాలతో కన్పిస్తున్నాయి. వాటిమీద చిన్న చిన్న గ్యాస్ బల్బ్స్ వెలుగుతున్నాయి. డిస్ప్లే స్క్రీన్ క్రింది భాగంలో పెర్మనల్ కీబోర్డుమీద రకరకాల బటన్స్ మెరుస్తున్నాయి. మీటలు, సూచికలూ కదుల్తున్నాయి.

టకటక కొన్ని బటన్స్ నొక్కాడు గాడ్‌ఫాదర్. మరుక్షణం స్క్రీన్‌మీద కాంతి కిరణంలా ఓ రేఖ బయల్దేరి ఆసియా ఖండంలోని ఇండియాదేశపు మధ్యభాగాన్ని కలిపింది. పొడుగాటి గీతలా ఏర్పడిన ఆ కాంతికిరణం మొదటి చివరలో ఎర్రటి బాణంగుర్తు ఒకటి ప్రత్యక్షమై అ సరళరేఖమీద దూసుకువెళ్ళడానికీ, ఇండియా ఢీకొనడానికీ వుత్సుకతతో దూకపోతూ పగ్గాలు బిగించిపట్టి ఆపినట్లు షేక్ అవసాగింది.

గాడ్‌ఫాదర్ గర్వంగా నర్సన్‌వైపు తిరిగి "తెలివితేటలు మాకూ వున్నాయి నర్సన్! మా వైజ్ఞానిక శక్తి అపూర్వం! అపారం! నేను తల్చుకుంటే యిక్కడ్నించి కదలకుండానే భూమండలాన్నంతటినీ తృటిలో భస్మం చేసెయ్యగల కాస్మిక్ డెత్‌రేస్‌ని సిద్ధం చేయించాను. మీటలు నొక్కి డైరెక్షన్ రేంజ్ రెడీచేస్తే—కాస్మిక్ డెత్ రేస్‌తో నింపిన రాకెట్ సెకనుకి వెయ్యి కాంతిమైళ్ళ

వేగంతో దూసుకువెళ్ళి డైరెక్షన్ ప్రకారం భూభాగాన్ని తాకుతుంది. మరుక్షణం అది తాకిన భూభాగం లక్ష భూకం పాల ప్రకంపనలతో అల్లల్లాడి ప్రచండమైన ప్రళయశక్తితో ప్రేలి ముక్కలు చెక్కలై నుసినుసిగా మారి, మహా శూన్యంలోకి కల్సిపోతుంది! ఇప్పుడొక రాకెట్‌ని మీ దేశా నికి డైరెక్ట్ రేంజ్‌చేసి మీటలు నొక్కి లాక్ చేశాను. ఇప్పుడా దేశాన్ని రక్షించుకునేందుకు మీకు కేవలం నలభై నిమిషాల అవకాశం మాత్రమే వుంది" అని నవ్వాడు.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్!" అరిచాడు నర్సన్.

"నో క్వశ్చన్ అఫ్ నాన్సెన్స్ నర్సన్! మీ ఎత్తుకి నా పై ఎత్తు! దట్సాల్!" అంటూ గాడ్‌ఫాదర్ మరోసారి నవ్వి "ఆ లాకింగ్ సిస్టమ్ నా కొక్కడికే తెల్సు నర్సన్! దాన్ని ఓపెన్‌చేసి ఆ రాకెట్‌ని సేఫ్టీ సెల్‌లోకి, వెనక్కి పంపకపోతే, సరిగ్గా నలభైయ్యవ నిమిషంలో ఆ రాకెట్ ముందుకు దూసుకువెళ్ళి మీ ఇండియాని స్మాష్‌చేసి పారే స్తుంది. మీరు తొందరపడి ఆ పానెల్‌ని ధ్వంసం చెయ్యా లనుకుంటే, పానెల్‌మీద చెయ్యివేస్తే, గడువుకి ముందే రాకెట్ దూసుకుపోతుంది. మీరు పెట్టిన గడువుకి ముందే యీ స్కైలాబ్‌ని పేల్చేస్తే, దీనితోపాటే, రాకెట్ దూసుకువెళ్ళి మీ దేశం కూడా పేలిపోతుంది. ఏం? నా మాటలమీద నమ్మకం లేదా? అయితే యిలా రండి. వచ్చి, యీ పానెల్‌మీద చెయ్యి వెయ్యండి. గడువుకి ముందే మీ దేశం ఎలా స్మాష్ అయిపోతుందో మీ కళ్ళారా చూడండి" అని మరోసారి నవ్వి, "ఇప్పుడు చెప్పండి నర్సన్! మాతో రాజీకి రావాల్సిన అవసరం మీకున్నదా?" అని రెట్టించాడు గాడ్‌ఫాదర్ పరిహాసంగా.

నర్సన్ మొహం పాలిపోయింది, గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. శత్రువుల అణ్వాస్త్ర శక్తిని తక్కువగా అంచనా వేసుకోడానికి వీల్లేదు. వాళ్ళ మాటలు పూర్తిగా అబద్ధాలూ కావు. అభూత కల్పనలూ కావు.

భూమినించి తనని తీసుకు వచ్చిన అంతరిక్ష వాహన గమనాన్నిబట్టి, యీ స్పైకలాబ్ నిర్మాణాన్నిబట్టీ, అమెరికా, రష్యావారి అంతరిక్ష పరిశోధనశాలలు సైతం దీని ఉనికిని గుర్తించలేకపోవడాన్నిబట్టి గాడ్ ఫాదర్‌వద్ద అసాధారణమైన అణుధార్మికశక్తులేవో వున్నాయని నిర్ధారణ చేసుకోవచ్చు. అతడు చెప్పినట్లు కాస్మిక్ డెత్ రేస్ కూడా కల్పన అనుకోవచ్చు. అయితే నలభయి నిమిషాల్లో ఇండియాదేశం నామ రూపాల్లేకుండా....?

"ఏమిటి మీ సంధి బేరం?" తేరుకుంటూ అడిగాడు నర్సన్.

"గుడ్! ఇప్పుడు దారికి వచ్చారు"అంటూ గాడ్‌ఫాదర్ నవ్వి, "వినండి. మీ లోకాన్ని ధ్వంసం చేస్తే మాకేం వుపయోగం లేదు. అలాగే మా లోకాన్ని నాశనం చేసుకోవడాని క్కూడా మేం తయారుగా లేము. సృష్టివైపరిత్యమో, మరొకటో నే చెప్పలేనుగానీ, మమ్మల్ని పోలిన మనుషులే మీ లోకంలో వున్నారు. కేవలం రూపాలూ, పేర్లు మాత్రమే కాక మనం మాట్లాడే భాష కూడా ఒక్కటే కావడం నిజంగా చిత్రాతి చిత్రం. బహుశా యీ సౌరకుటుంబంలోని మరేగ్రహవాసుల్లోనూ ఇలాంటి పోలికలు కవ్పించకపోవచ్చు. అందుకే మీ లోకం మీద శులభంగా ఆధిపత్యం సంపాదించవచ్చునని మేము ఆశించాం. వైజ్ఞానికంగా మీకంటే మేమెంతో ముందంజ వెయ్యడం వల్లనే యిలాంటి అభిప్రాయానికి వచ్చి అది సాధ్యమో

కాదో తేల్చుకోడానికే నీ పోలికలున్న మా మనిషిని పంపి ఎక్స్‌పరిమెంట్ చేశాం. ఏ గందరగోళం, గొడవా, పోరాటం లేకుండా చాలా కామ్‌గా, నిశ్శబ్దంగా విజయాన్ని సాధించవచ్చునని విశ్వసించాం. బట్ ఉయ్యార్ ఫెయిల్డు" అని ఆగాడు.

"మళ్ళీ మీలోకం, మాలోకం అంటాదేవిటీ? వీళ్ళు నిజంగానే యింకో లోకం మనుషులా? కథ మళ్ళీ మొదటికి వస్తోందా?" ఆలోచనలో పడ్డాడు నర్సన్.

"మేమెంత తెలివిగల వాళ్ళమో, మీరూ అలాగే అంతే తెలివి గలవాళ్ళనీ, శక్తియుక్తుల్లో మాకేమాత్రం తీసిపోరనీ, ఇప్పటివరకూ జరిగినదాన్నిబట్టి స్పష్టమైంది. బహుశా మనం ఒకే పోలికలు కలిగిన మానవజాతివాళ్ళం కావడంవల్లనే మన శక్తిసామర్థ్యాలు కూడా సరిసమానమై వుంటాయి. ఆ సంగతి నిరూపణ అయిం తర్వాత ఎవరి లోకాల్లో వాళ్ళు సురక్షితంగా మనుగడ సాగించగలమనుకోవడం భ్రమ! ఒకే ఒరలో రెండు కత్తులు యిమడటం అసాధ్యమైనట్లే ఒకే పోలికలూ, భావాలూ కలిగిన రెండు లోకాల మానవులు ఎవరి మానాన వారు జీవిస్తారని ఆశించడం అవివేకం! ఎప్పటికయినా ఒకర్నించి మరొకరికి ప్రమాదం వాటిల్లుతుందనే భయం ఇరు పక్షాలకీ కలగడం సహజం! యీ పరిస్థితిలో యీ జటిల సమస్యకి ఒక్కటే పరిష్కారం...."

"ఏమిటది! మీ సార్వభౌమత్వాన్ని అంగీకరించడమా?"

"ఎగ్జాట్‌లీ! మిమ్మల్ని వెంటనే మీ లోకానికి పంపిస్తాము! ఇక్కడ మీరు చూసిందీ, తెల్సుకున్నదీ మీ భూమండల వాసులకి వివరంగా చెప్పండి. వాళ్ళకి నచ్చ చెప్పండి! మా సార్వభౌమత్వాన్ని నామమాత్రంగా అంగీక

రించండి. చాలు! మేం మీ జోలికి రాము! మీ పరిపాలన మీరు చేసుకోవచ్చు! అయితే...."

"అయితే ఆ అయితే ఏమిటో కూడా బయట పెట్టండి."

"దయచేసి కోపం తెచ్చుకోవద్దు! వివేకంతో ఆలోచించండి. మీ భూమండలం మీద ఏర్పడిన దేశాలన్నీ మా అభీష్టాలకూ, ఆశయాలకూ అనుగుణంగా ఆ యా దేశాల్ని పరిపాలించుకోవాలి. ఎప్పటి కప్పుడు ఉపగ్రహాలద్వారా మేము పంపే సందేశాల ననుసరించి పరిపాలన సాగించాలి. ఇందుకు భిన్నంగా వ్యవహరించే దేశాల పరిపాలనా వ్యవహారాల్లో జోక్యం కల్పించుకునే హక్కు మాకు వుంటుంది."

"అంటే పరోక్ష బానిసత్వ జీవనమన్న మాట! దిసీజ్ టూమచ్! ఇంపాజిబుల్! అయినా నేను వెళ్ళి నచ్చజెప్ప డానికి ఒక్క వూరు కాదు, ఒక్క దేశం కాదు! ప్రపంచంలో నూట అరవై ఆరు దేశాలున్నాయి. వాళ్ళందరికీ నచ్చజెప్పించడానికి నేనేం దేవుణ్ణి కాను."

"అయితే, మొదట మీ దేశాన్ని ఒప్పించండి. కాల క్రమేణా మిగతా దేశాలు ఆంగీకరించేటట్లు మేం చూసుకుంటాము. మిమ్మల్ని రప్పించినట్లే మిగతా దేశాల్నించి కూడా కొందరు మేధావుల్ని రప్పించి వాళ్ళద్వారా కార్యాన్ని సాధించుకుంటాము. ఇలా అయితే మన జాతుల మధ్య గొడవ రాదు. మా వల్ల మీ ప్రపంచానికి హాని సంభవించదు."

"నో, నో, నో! ఇలాంటి బానిసత్వపు బ్రతుకుకంటే చావడం మేలు. ఐ కాంట్."

"ఇది బానిసత్వమని మీరు అభిప్రాయపడితే మేం చెయ్యగలిగిందేమీ లేదు నర్సన్! మా శక్తిని మీరు అను

భవపూర్వకంగా గ్రహించారు. మరో ముప్ఫయి నిమిషాల్లో మీ దేశం నాశనం కాబోతోంది. ఆ తర్వాత మీ ప్రపంచాన్నే నాశనం చేస్తాం. అప్పుడు మీరు చెయ్యగలిగిందేమీ వుండదు. ఆలోచించండి. ముప్ఫయి నిమిషాలే టైము."

"ఆలోచిస్తాను. ఆలోచించుకోవడానికి నాకు కొంత గడువు కావాలి! ఏకాంతం కావాలి" అన్నాడు నర్సన్ గంభీరంగా.

"ఆల్‌రైట్! ఏర్పాటు చేస్తాను. ఒక్క క్షణం" అని చెప్పి గాడ్‌ఫాదర్ వెనక్కి, పానెల్ వైపు తిరిగి మరికొన్ని మీటలు సవరించి,

"ముందు జాగ్రత్తకోసం మరికొన్ని మార్పులు చేశాను నర్సన్! ఏకాంతంలో మీరు అతితెలివి ప్రదర్శించి మమ్మల్ని వెన్నుపోటు పొడవకుండా జాగ్రత్తపడ్డాను. మీ దేశానికి టార్గెట్ చెయ్యబడిన మా రాకెట్ కాస్మిక్‌డెత్ రేస్‌తో స్లో మోషన్‌లో ప్రయాణం ఆరంభించింది. యీ డిస్‌ప్లే స్క్రీన్ మీద యారోమార్క్ ముందుకు కదలడాన్ని గమనిస్తున్నారు కదూ! సరిగా ఇరవై ఎనిమిదో నిమిషానికి మా రాకెట్ మీ దేశాన్ని తాకుతుంది. ఆలోగా మీ ఆలోచన పూర్తికాకపోతే, మీ నిర్ణయం మా అభిమతానికి అనుగుణంగా వుండకపోతే.... తెల్సుగదా! ఇరవై యేడున్నర నిమిషాలే టైముంది! వెళ్ళండి. ఆలోచించుకోండి. అదిగో, మీ ఏకాంతానికి గది" అన్నాడు గాడ్‌ఫాదర్ నిబ్బరంగా.

షట్టర్ తొలగినట్లు గోడలో మార్గం ఏర్పడింది. తల పంకిస్తూ ఆ మార్గం ద్వారా లోపలికి వెళ్ళాడు నర్సన్. మరుక్షణం మార్గం మూసుకుపోయింది.

ఇంకా ఇరవై ఏడు నిమిషాలే వుంది. ఆలోగా ఏదైనా సాధించగలడా? తనవాళ్ళ నెవరినైనా సంప్రదించి చర్చించ గలడా!

తనకి యోగవిద్య తెలుసు! పారాసైకాలజీ ద్వారా టెలిపతీతో సంభాషించడం తెలుసు. అయితే టెలిపథీ ఎన్ని వందల, వేలమైళ్ళ దూరం వరకూ సంకేత ప్రసారం చేస్తుంది,

భూమికి టెలిపతీ ప్రసారం చెయ్యగలంత దూరంలో తానున్నాడా? తన ప్రసారాలను రిసీవ్ చేసుకుని సమాధా నాలు పంపడానికి అక్కడ యస్. బి. డైరెక్టర్ రావ్ అందుబాట్లో స్థిమితంగా వున్నాడా? గడువుండగా టెలిపతీకి అతను అందకపోతే, సమాధానాలు రాకపోతే, అ మరు క్షణమే కాస్మిక్ డెత్ రేస్ ప్రభావానికి గురై ఇండియా....?

గుండె రాయి చేసుకుని, నేలమీద బాసింపట్టు వేసు కూర్చుని కళ్ళు మూసుకున్నాడు నర్సన్. మరుక్షణం అతని భావతరంగాలు రావ్ మస్తిష్క తరంగాలను వెతు కుతూ ప్రయాణించాయి. వైజ్ఞానిక చరిత్రలో నూతనా ధ్యాయ సృష్టికి అన్వేషణ ఆరంభమైంది....

19

"చంపుదామనే ఉద్దేశం నాకు లేదు. సోఫా క్రిందినించి బయటికి వస్తుంటే చీకట్లో పిస్తోలు చేతికి తగిలింది. గురి చూడటం కూడా నాకు చేతకాదు. బెదిరిద్దామని గ్రుడ్డిగా ట్రిగ్గర్ నొక్కాను. ఆ గుండు దెబ్బకే ఇతని ప్రాణం పోయిందనుకోలేదు. నా చేత్తో హత్య చెయ్యాల్సి వస్తుందనీ కలలో కూడా వూహించలేదు" అంటున్నాడు భాస్కరాచార్య నొచ్చుకుంటూ.

ఆయన మాటలు వినిపించుకునే స్థితిలో లేడు రాయ్.

రక్తపు మడుగులో పడున్న శత్రువు శవాన్ని వెల్లకింతలా తిప్పి జేబులు వెతుకుతున్నాడు.

ఆ మనిషి దగ్గిర ఒక బాంబు వుండాలి. దాని స్వరూప, స్వభావాలు తెలియవు. అది ఏ టైంబాంబ్‌లాంటిదో ఐతే పేలిపోక ముందే దాన్ని కనిపెట్టి డిఫ్యూజ్ చెయ్యాలి. లేక పోతే ప్రమాదం.

"ఏమిటి వెతుకుతున్నారు? యీ మనిషి ఎవరో తెలియ పరిచే ఆధారాల కోసమా! ఎవరైతే మన కెందుకు! గ్రహపాటు సరిగా లేకపోతే హత్య చేశాను. నేరం ఒప్పుకుని శిక్ష అనుభవించడాని క్కూడా సిద్ధమే! ఇతడు శత్రుదేశం వాడని నిరూపించి నన్ను రక్షించాల్సిన అగత్యం లేదు. వెతుకులాట మానేసి మన పని చూడండి" అన్నాడు భాస్కరాచార్య గంభీరంగా.

అదే సమయంలో శవం ముస్తుల్లోంచి దీపావళి టపాకాయ ఆటంబాంబులాంటి వస్తువొకదాన్ని బయటకు తీశాడు రాయ్. అది చూట్టానికి టపాకాయలావున్నా చాలా శక్తివంతమైన బాంబు అని క్షణంలోనే గ్రహించాడతను.

వరండాలో వెలుగుతున్న లైటు కాంతిలో దాని మీదున్న కొన్ని అంకెలనూ అక్షరాలనూ జాగ్రత్తగా పరిశీలించాడు. అది లాటిన్ భాషగానీ, మామూలు ఇంగ్లీషు భాషగానీ కాదు. ప్రపంచంలోని ఏ దేశపు లిపితోనూ ఆ అక్షరాలకి దగ్గర పోలికలు కనిపించడంలేదు. మరి అది ఏ భాష?

"హత్యా నేరానికిగాను మిమ్మల్నెవ్వరూ శిక్షించరు ఆచార్యగారూ! ఆత్మ రక్షణార్థం మీరీ మనిషని చంపారన డానికి నేనే ప్రత్యక్ష సాక్షిని. అదీగాక ప్రస్తుత పరిస్థితిలో యీ మనిషిని చంపడం ఏవిధమైన నేరం క్రిందకీ రాదు.

అంచేత ఆ భయాన్ని వదిలేసి దీనిమీద రాసివున్న లిపిని మీరు గు_ర్తించగలరేమో చూసి చెప్పండి” అన్నాడు రాయ్.

“ఏమిటది?” అడుగుతూనే, అది బాంబు అని తెలియకుండానే అ వస్తువుని చేతిలోకి తీసుకున్నాడు భాస్కరాచార్య.

దాన్ని లైటు వెలుగులో కొద్దిసేపు పరీక్షించి “అంతరిక్ష పరిశోధన శాస్త్రజ్ఞులు ప్రత్యేకంగా రూపొందించిన లిపి ఇది. వివరాలను సులభంగా, సంక్షిప్తంగా తయారు చేసుకోడానికి యీ లిపి తయారు చెయ్యబడింది. దీనిమీద 'మృత్యుతార' ఎక్స్‌ప్లోజివ్-22 అని వుంది. ఎక్స్‌ప్లోజివ్ అంటే....” అంటున్న వాడల్లా “అమ్మో....బాంబు....” అంటూ భయంతో దాన్ని జారవిడిచాడు.

బాంబు క్రిందపడకుండా చటుక్కున దోసిలిపట్టి దాన్ని దోసిట్లో పట్టుకుని “ఇంకా నయం. ఇది క్రిందపడివుంటే మీరూ, నేనూ, యీ భవనం నామరూపాల్లేకుండా నశించి పోయి వుండేవాళ్ళం! ఇట్సాల్‌రైట్! ఇప్పుడీ బాంబు వల్ల ప్రమాదం లేదుగానీ, 'మృత్యుతార' అన్నారు. అదేమిటో, ఎక్కడుందో మీకు తెల్సా?” అనడిగాడు రాయ్.

“ఏమో, ఎక్కడుందో నాకేం తెలుసు! ఆ మృత్యుతార లోనివాళ్ళు యీ బాంబుని తయారుచేశారని మాత్రం దీని మీద రాసిందాన్నిబట్టి అర్థమవుతోంది.”

“అంటే 'మృత్యుతార' అనే పేరుతో మరో లోకమో, చంద్రుడూ, శుక్రుడూ లాంటి గ్రహమో వుందన్నమాట! డాక్టర్ స్నేత్నా ప్రాణం విడిచే ముందు యీ పేరే కలవరించాడట! నర్సన్ ఆ మృత్యుతారకే వెళ్ళివుంటాడు. స్నేత్నా వద్ద లభించిన కాగితంలో యీ తార వివరాలే

వుండుంటాయి. ఆచార్యగారూ! ఆ ఫోటోస్టాట్‌లోని వివ
రాలను సాధ్యమైనంత తొందరగా డీకోడ్ చెయ్యండి. ఆ
రహస్యాన్ని బయటకి లాగండి ప్లీజ్."

"లైబ్రరీ రూంలోకి వెళ్దాం. రండి" అంటూ వెనక్కి
తిరిగి లోపలకి దారితీశాడు భాస్కరాచార్య.

బాంబుని జాగ్రత్తగా జేబులో వేసుకుంటూ ఆయన్ని
అనుసరించాడు రాయ్.

"రండి. ఇదే నా లైబ్రరీ" అంటూ ఒక గదిలోపలికి
దారి తీశాడు. మౌనంగా ఆయన్ని అనుసరించిన రాయ్
లోపలకి అడుగుపెట్టి దిగ్భ్రాంతుడయ్యాడు.

లైబ్రరీ అంటే అది మామూలు గ్రంథాలయం కాదు.
అదొక వేధశాల! నక్షత్రశాల! ఆ గది కప్పు యావత్తూ
వివిధ గ్రహాల ప్రతిరూపాలతో, నక్షత్రమండలాల ప్రతి
బింబాలతో అలరారుతోంది. విశాల విశ్వంలో ఏ గ్రహం
ఎక్కడ వున్నదో, ఏ నక్షత్రం ఏ ప్రాంతాన వున్నదో
స్పష్టంగా, ఖచ్చితంగా తెలియపర్చే ప్లానిటోరియం అది.

"నా పాతికేళ్ళ నిర్విరామకృషి ఫలితం యీ వేధశాల!
నా స్వంత ఖర్చుతో, స్వశక్తితో యీ ప్లానెటోరియం
నిర్మించుకున్నాను రాయ్! ఏ గ్రహం, ఏ నక్షత్రం, ఏ
క్షణంలో ఏవైపు పరిభ్రమిస్తుందో ఇక్కడనించే నేను
గమనించగలను. వాటి స్థితిగతులను స్థిరీకరించగలను.

మన చతుర్వేదాల ఆధారంతో నేను నిర్మించిన యీ
నక్షత్రశాల ప్రపంచంలోని మరే యితర అధునాతన ప్లానె
టోరియంకీ తీసిపోదని ఢంకా బజాయించి చెప్పగలను.
అయితే నేను భారతీయుణ్ణి. అందునా ఆంధ్రుణ్ణి! పర
దేశీ సంస్కృతీ, విజ్ఞానాలను పొగుడుతూ మనవాళ్ళ
శక్తిని న్యూనత పర్చడం మన భారతీయుల నైజం.

క్రీస్టియానిటిని గౌరవిస్తారు. మార్క్సిజాన్ని నరనరాల్లో నింపుకుంటారు. హిందూయిజాన్ని ద్వేషిస్తారు. ఇలాంటి వాళ్ళు నా సోదర భారతీయులని చెప్పుకోడానికి నేను నిజంగా చాలా చాలా సిగ్గుపడుతున్నాను. ఎప్పటికయినా యీ పుణ్యభూమికి యీ దుష్కర్మని తప్పించమంటూ కనిపించని ఆ భగవంతుణ్ని ప్రార్థిస్తుంటాను" అన్నాడు భాస్కరాచార్య ఆవేదనతో.

రాయ్ మాట్లాడలేదు. కాదు! మాట్లాడలేకపోయాడు! ఆ అక్షర సత్యాన్ని శిరస్సు వంచి అంగీకరించేంతటి ధైర్యం కూడా అతనిలో కొరవడింది.

"సరే! నా కంఠశోష కేమొచ్చెలెండి! నా భావాలూ, బాధలూ నా కట్టెతోపాటే మట్టిలో కల్సిపోతాయి. నా సోది ఎవరి క్కావాలి? విని ఆలోచించేంతటి తీరుబడి, ఓర్పు మనవాళ్ళకి ఎక్కడుంది? అలా కూర్చోండి! ఫోటోస్టాట్ లోని వివరాలు డీకోడ్ చేసి తెలియపరుస్తాను" అన్నాడు భాస్కరాచార్య చాలా తేలిగ్గా.

రాయ్ మారు మాట్లాడకుండా పక్కనే వున్న స్టూల్ మీద కూర్చున్నాడు. భాస్కడాచార్య ఫోటోస్టాట్ కాపీని ఓరకంట పరికిస్తూ నక్షత్రశాల మధ్యకి వెళ్ళాడు.

ఫొటోస్టాట్ లో కొన్ని సాంకేతిక పదాలు స్పష్టంగా వున్నాయి. అవి: E-1505, M-62576 S-994264, అన్న సాంకేతిక పదాల మధ్యనించి డైరెక్షన్స్ గీసి మూడు రేఖలూ కలిసే బిందువు చుట్టూ ఓ సర్కిల్ సున్నలా చుట్టి దాని మధ్యలో 'DS' అని రాసి వుంది. E చుట్టూ ఒక సున్నా, M చుట్టూ మరో సున్నా, S చుట్టు ఇంకో సున్నా గీసివున్నాయి. ఇవికాక S కి దూరదూరంగా వివిధ డైరెక్షన్స్‌లో మరికొన్ని సున్నాలు చుట్టి వాటిల్లో

'N' 'G' అంటూ అక్షరాలు రాసివున్నాయి. ఆ ఫొటో స్టాట్‌లోని ఆ వివరాలనీ, నక్షత్రశాలలో రూపొందించ బడిన గ్రహసముదాయాన్నీ మార్చి మార్చి చూశాడు భాస్కరాచార్య.

"ఈ ఫొటోస్టాట్‌నిబట్టి E అంటే ఎర్త్-భూమి అనీ, M అంటే మూన్-చంద్రుడు, S అంటే సన్-సూర్యుడనీ మనం అర్థం చేసుకోవాలి. దట్‌మీన్స్-భూమి నించి 1505 మైళ్ళ దూరంలో చంద్రుడికి అభిముఖంగా ఒక సరళరేఖ గీసి చంద్రుడినించి 62576 మైళ్ళ దూరంలో మరో గీతా, సూర్యుడినించి భూమి వైపుకి 991264 మైళ్ళదూరానికి మరోరేఖా గీసి ఆ మూడు రేఖలూ కలిసేచోట - ఆ పాయింట్ ఏదో మనం తెలుసుకుంటే ఆ శూన్యంలో భూకక్ష్యని అధిగమించి ఆ శూన్యకక్ష్యని సమీపిస్తే అక్కడేదో 'DS' అనేది వుందన్నమాట! మిగతా సాంకేతిక పదాలన్నీ సౌరకుటుంబ స్థితిగతుల్ని వివరించే గుర్తులు కనుక వాటితో మనకి అంత అవసరం లేదు.

అయితే భూకక్ష్య దాటిన తర్వాత ఎదురయ్యే శూన్య కక్ష్యలో ఏ వస్తువూ స్థిరంగా నిలబడదు. ఆ కక్ష్యని అధిగమించలేకపోతే ఏదయినా ఆ శూన్యంలోంచి బయటపడలేక పరిభ్రమిస్తూ వుంటుంది. అందుకే రాకెట్స్ యీ కక్ష్యలోకి ప్రవేశిస్తుండగా దాన్ని అధిగమించి ముందుకు సాగిపోవ డానికి రెండవ ప్రేలుడు ఉత్పాదక శక్తిని ఏర్పాటు చేస్తారు. యీ శూన్యకక్ష్యలో రెండవ ప్రేలుడు సకాలంలో సక్రమంగా జరపడానికి శాస్త్రజ్ఞులు ఎంతో ఆరాటం చెందు తారు. ఈ కక్ష్యను దాటలేకపోతే రాకెట్స్, స్పుత్నిక్స్ మరో గ్రహానికీ ప్రయాణం చెయ్యలేవు. భూమికీ తిరిగి రాలేవు. ఇక్కడే యీ శూన్యంలోనే పరిభ్రమిస్తూ క్రమ

క్రమంగా విశ్వాంతరాళంలో కల్సిపోతాయి. ఇలాంటి చోట 'DS' అంటూ ప్రత్యేకంగా గుర్తింపబడిందంటే...." అంటూ తలెత్తి నక్షత్రమండలం వైపు తదేకంగా చూశాడు భాస్కరాచార్య.

రాయ్ మాట్లాడలేదు. ఆయన మాటలు వింటూ చర్యలను జాగ్రత్తగా గమనిస్తున్నాడు. సమయం దగ్గిర పడిపోతోందని తెలుస్తున్నప్పటికీ ఏమీ చెయ్యలేని స్థితి అతనిది!

ఫొటోస్టాట్ కాపీని బల్లమీద పెట్టి దారపు ఉండని తీసుకున్నాడు భాస్కరాచార్య. మైళ్ళని సెంటీమీటర్స్‌లోకి మార్చుకుంటూ సూర్యుడి నించి దారంతో ఓ గీతనీ, చంద్రుడి నించి మరో గీతనీ తయారుచేసి భూమినించి మరోదారపు గీతని పైకి తీసుకు వెళ్ళి టేపుతో ఆ మూడు దారపు కొసల్నీ కలిసేచోట అతికించాడు.

ఇప్పుడా టేపు ముక్క కనిపించీ కనిపించనట్లు చాలా అస్పష్టంగా అవుపిస్తోంది. మిగతా గ్రహాలూ, చిన్న చిన్న సుదూర నక్షత్రమండలాలు సైతం స్పష్టంగా కన్పిస్తున్నాయిగానీ, కళ్ళముందే అతికించిన ఆ టేపు ముక్క మాత్రం కనిపించనట్టే లెక్క! ప్రత్యక్షంగా చూస్తున్న ఆ యిద్దరికీ అలా వుంటే కొత్తవాళ్ళెవరయినా అక్కడికి వస్తే అసలా టేపు ముక్కని గుర్తించలేరు. కనిపెట్టలేరు.

"మైగాడ్...." అన్నాడు భాస్కరాచార్య ఆశ్చర్యంగా. అది మానవ నిర్మితమైన నక్షత్రణాలే అయినప్పటికీ అంతరిక్షంలో ఏ కక్ష్యలో ఎలాంటి మార్పులు సంభవిస్తుంటాయో ఖచ్చితంగా అలాంటి మార్పులన్నీ గుర్తించే విధంగా రూపొందించబడింది. అందుకే కళ్ళెదుట అతికించిన టేపు ముక్క కూడా యిప్పుడు కన్పించడం లేదు.

"డాక్టర్ స్నేత్నా సామాన్యుడు కాదు మిస్టర్ రాయ్, అసాధారణ ప్రజ్ఞావంతుడు. నన్నూ నాలాంటివాళ్ళ నెందర్నో మించిన మహా మేధావి. అందుచేతే చాలా కాలంగా ఎందరో శాస్త్రజ్ఞులను తికమక పెడుతున్న ఒక అద్భుత రహస్యాన్ని ఛేదించగలిగాడు. భూ కక్ష్యని దాటిన తర్వాత మహాశూన్యంలోకి ప్రవేశించే ముందు అవరోధంగా నిలిచే శూన్యకక్ష్యలో నిభిడీకృతమైన ఒక అద్భుత శక్తిని, మహా మహులు సైతం ఆలోచించి గ్రహించలేని ఒక పరమాద్భుత అదృశ్య శక్తిని...." ఆవేశంతో. ఉద్విగ్నతతో చెబుతున్న భాస్కరాచార్య హఠాత్తుగా మెలికలు తిరిగిపోతూ రెండు చేతుల్తో గుండె పట్టుకున్నాడు.

"ఆచార్యా....ఏమైంది!" కంగారుగా స్టూల్‌మీదనించి క్రిందికి వురికాడు రాయ్. అప్పటికే భాస్కరాచార్య కుప్ప కూలిపోయాడు. అద్భుతమైన రహస్యాన్ని తెల్పుకునేా ఉద్విగ్నతలో, ఆ ఎక్సయిట్‌మెంట్‌కి తట్టుకోలేక ఆయన గుండె పగిలిపోయింది. నోట్లోనించి ధారాపాతంగా రక్తం కారిపోతోంది. విపరీతమైన బాధతో విలవిల తన్నుకుంటూ మూలుగుతూ మృత్యువుతో పోరాడుతున్నాడు.

"ఆచార్యా....ఆచార్యా...." ఆందోళనతో ఆయన్ని సమీపించాడు రాయ్.

మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతాన తెరిచి పెన్నూ, కాగితం కావాలంటూ సైగ చేశాడు భాస్కరాచార్య. పిచ్చి పట్టినవాడిలా అటూ యిటూ పరుగెత్తి వాటిని పట్టుకొచ్చాడు రాయ్. అప్పటికే ఆయనలో శక్తి పూర్తిగా క్షీణించి పోయింది. ఆలస్యాన్ని భరించలేనట్లు నోట్లోంచి కారుతున్న రక్తంలో చూపుడు వేలు ముంచి నేలమీద తన రక్తంతో— Vanish-Race-Vawes-Death-Sta..."

అంతే! చూపుడు వేలు జారిపోయింది. భాస్కరాచార్య తల పక్కకి వాలిపోయింది. కళ్ళు మూతలు పడ్డాయి.

"ఆచార్యా....ఆచార్యా...." రుద్ధకంఠస్వరంతో బిగ్గరగా అరిచాడు రాయ్. పెన్నూ, కాగితం విసిరి పారేస్తూ ఆయన తల ఒళ్ళోకి తీసుకున్నాడు. ఆయన మొహంమీదకి వంగి చూశాడు. చాలా ప్రశాంతంగా, గాఢంగా నిద్రపోతున్నట్లుగా వుంది ఆయన వదనం.

"ఆచార్యా....ఆచార్యా...." హీనస్వరంతో గాద్గదికంగా పిలిచాడు రాయ్. భాస్కరాచార్య పలకలేదు. జవాబు యివ్వలేని ఏ దూరతీరాలకో ఆయన ఆత్మ ఎగిరిపోయింది. యీర్ష్యాద్వేషాలకూ, మదమాత్సర్యాలకూ, స్వార్థపరత్వాలకూ అతీతమైన మరో లోకాన్ని వెతుక్కుంటూ ఆయనలోని జ్యోతి తరలిపోయింది. మానవ ప్రపంచానికి మహామేధావి భాస్కరాచార్య యిక లేడు!

"భాస్కరాచార్యా...." అనుకున్నాడు రాయ్ ఆవేదనగా. అతని నేత్రాల నుండి అశ్రుధారలు జల జలా ప్రవహించాయి. కన్నీటి తర్పణాల్ని వదుల్తూ ఆయన ఆత్మ శాంతి కోసం క్షణంపాటు మౌనంగా కళ్ళు మూసుకున్నాడు. మరుక్షణంలో కర్తవ్యం గుర్తుకొచ్చి కళ్ళు తెరిచాడు.

Vanish-Race-Vawe-Death-Sta...

ఆ సాంకేతిక పదానికి వివరణ ఏమిటి? ఎలా తెలుస్తుంది? అవతల సమయం మించిపోతున్న యీ తరుణంలో యీ అసంపూర్తివాక్యాన్ని ఎలా డీకోడ్ చెయ్యాలి? చెప్పేవాళ్ళెవరు? తెల్సుకోకపోతే అవతల నర్సన్ ఏమవుతాడు? ఏమవుతాడు? రెండు చేతుల్తో పిచ్చివాడిలా జుట్టు పీక్కున్నాడు రాయ్.

20

మైక్రో కంప్యూటర్ డిస్ప్లే స్క్రీన్‌మీద ప్రశ్నలూ సమాధానాలూ కన్పిస్తున్నాయి. స్క్రీన్‌కి ఎదురుగ్గా వున్న కుర్చీలో యస్.బి. డైరెక్టర్ రావ్ యోగ సమాధిలోని ఋషిపుంగవుడిలా నిశ్చలంగా నిర్మల మౌన ముద్రలో కూర్చుని వున్నాడు. బాహ్యప్రపంచంతో అతని సంబంధాలు తెగిపోయాయి.

రావ్‌కి కుడివైపున, వీడియో టెర్మినల్ పక్కన అతనికి అభిముఖంగా నిలబడి ఏకాగ్రతతో పారాసైకాలజీని ప్రయోగిస్తూ అతని మస్తిష్కాన్ని ట్రాన్స్‌లో నిశ్చలంగా వుంచుతున్నాడు ప్రొఫెసర్ గోమాగో. అతని దృష్టి కూడా స్థిరంగా వుంది.

ఆ యిద్దరికీ ఎడంగా, విడివిడిగా మూడు కుర్చీల్లో భారత ప్రధాని, కృపాల్, ప్రొఫెసర్ డోగ్రే కూర్చుని ఉద్విగ్నతతో స్క్రీన్‌వైపు రెప్పవాల్చకుండా చూస్తున్నారు. ఉత్కంఠతతో ఆ ముగ్గురూ వూపిరి పీల్చడమే మర్చిపోయారేమో ననిపిస్తోంది.

టెలిప్రింటర్ టకటక చప్పుడు తప్ప గదంతా నిశ్శబ్దం! సూది క్రిందపడినా చప్పుడు తెలిసేంతటి భయంకరమయిన నిశ్శబ్దం! ఆ నిశ్శబ్దానికి భంగం కలిగితే సైకాలజీ ట్రాన్స్‌కి అంతరాయం యేర్పడుతుంది! వార్తా ప్రసారం నిలిచిపోతుంది! ఆ సంగతి ముగ్గురికీ తెలుసు!

సైకాలజీ ట్రాన్స్‌లోకి జారిపోయిన రావ్ మస్తిష్కం భావతరంగాలను రిసీవ్ చేసుకుంటూ రేడియో వేవ్స్ ద్వారా ప్రశ్నలూ, జవాబులూ స్క్రీన్‌మీదకి ప్రసారం చేస్తోంది. ఆ ప్రసారంలోని మొదటి వాక్యం: "హలో....నర్సన్.... ఎలా వున్నారు...." ఒక్క క్షణం మౌనం.

"ఆల్‌రైట్...." క్షణం తర్వాత స్క్రీన్‌మీద జవాబు కనిపించింది.

"ఎక్కడ్నించి సంభాషిస్తున్నారు?" మళ్ళీ ప్రశ్న.

"తెలియదు. దూరంనించి....చాలా దూరాన్నించి.... బహుశా మరో లోకాన్నించి...."

"ఏమిటా లోకం? భూమికి ఎంత దూరంలో వుంది?...."

"అది తెల్సుకోడానికే ప్రయత్నించాను....బహుశా తెల్సుకోలేనేమో ...."

"ఎందుకని? తెల్సుకోనివ్వకుండా ఎవరైనా అడ్డు తగులుతున్నారా? ఏదైనా అవరోధమా?"

"తర్వాత చెప్తాను. స్నేత్నా ద్వారా సేకరించిన వివరాలు చెప్పండి. త్వరగా."

"పూర్తిగా తెల్సుకోడానికి కుదరలేదు....డీకోడ్ చెయ్యడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. డాక్టర్ స్నేత్నాని కారు యాక్సిడెంట్ చేసి చంపేశారు."

"ఎవరు? ఎవరు?" స్క్రీన్‌మీది అక్షరాలు తీవ్రంగా కంపించాయి.

"తెలుసుకోడానికి గట్టిగా ప్రయత్నాలు జరుగుతున్నాయి."

"వాళ్ళని పట్టుకోండి....అంత కంటే ముఖ్యం.... ఎప్పటికప్పుడు వాళ్ళకి తెలివిగా సమాచారాన్ని చేరవేస్తున్న మీ మధ్య నున్న మనిషి....ఆ ద్రోహి జేబులో శక్తివంతమయిన మీనియేచర్ యెలక్ట్రానిక్ మైక్రోఫోన్ వుండి వుండాలి. అందువల్లే మీ మాటలూ, చేతలూ ఆ మనిషి ద్వారా ఆటోమాటిక్‌గా తెల్సుకో గలుగుతున్నారు. వెంటనే ఆ మనిషిని కనిపెట్టి పట్టుకుని ఆ మైక్రోఫోన్‌ని

నాశనం చెయ్యకపోతే ముందు మీ అందరికీ ప్రమాదం. ఆ తర్వాత ....”

కూర్చున్న కుర్చీలోంచి నిశ్శబ్దంగా, చివాల్న లేచాడు ప్రొఫెసర్ డోగ్రే. అప్పటికే అతని మొహం జేవురించింది. కనుగుడ్లు ఎరుపెక్కాయి. కసిగా పెదాలు కొరుక్కుంటూ జేబులోంచి పిస్తోలు తీస్తున్నాడు. క్షణంలో ఆ విషయాన్ని గ్రహించారు పక్కనే వున్న మిగతా ఇద్దరూ! వాళ్ళకి విషయం పూర్తిగా అర్థమైపోయింది.

ప్రొఫెసర్ డోగ్రే దుర్మార్గుడు! శత్రువుల మనిషి! జేబులో మైక్రోఫోన్ వుంచుకుని సమాచారాన్నంతటినీ యిప్పటివరకూ వాళ్ళకు చేరవేశాడు. ఇప్పుడు గుట్టు బయటపడేసరికి ఏదో హాని తలపెట్టి ఆ వార్తా ప్రసారానికి ఆటంకం కల్పించడానికి పూనుకుంటున్నాడు. పిస్తోలుతో మిగతా నలుగుర్నీ కాల్చి చంపి తప్పించుకు పారిపోవాలనుకుంటున్నాడు! అయితే, చిన్న శబ్దం అయినా ట్రాన్స్‌కి భంగం కలుగుతుంది. ఏకాగ్రత భగ్నమై వార్తాప్రసారం నిలిచిపోతుంది.

“శత్రువుల స్థావరం ఢిల్లీలో ఎక్కడో వుంది....ఆ మనిషి ద్వారా వివరాలు చెప్పించి మొదట ఆ స్థావరాన్ని....” స్క్రీన్‌మీద అక్షరాలు వరుసగా ప్రత్యక్షమవుతున్నాయి.

ప్రొఫెసర్ కోటుజేబులోంచి పిస్తోలు తీస్తున్నాడు. చాలా వేగంగా అతనిమీదకు వంగాడు కృపాల్. వంగుతూనే అతని చెయ్యి బైటికి రానివ్వకుండా తన ఎడమచేతిని అతని చేతిమీదగా ఛాతీ చుట్టూ ఉక్కుతీగెలా బిగించేస్తూ కుడిచేతిని అతడి కంఠం చుట్టూ మెలికవేసి నోట్లోంచి

శబ్దం వెలువడకుండా నిరోధిస్తూ క్షణంలో అతన్ని చేతుల్తో ఎత్తేసుకుంటూ లేచిపోయాడు. డోగ్రే కాళ్ళు కుర్చీకి తగిలి చప్పుడయ్యే ప్రమాదం తప్పిపోయింది. అతను పీక తెగిన కోడిపెట్టలా నిశబ్దంగా కృపాల్ చేతుల్లో గాలిలో విల విల్లాడుతున్నాడు.

ప్రధాని కదల్లేదు. ప్రశంసాపూర్వకంగా కృపాల్‌వైపు చూశారు.

'జాగ్రత్తగా వుండండి' అన్నట్లు కళ్ళతోనే ప్రధానికి హెచ్చరిక చేసి, డోగ్రేని అలాగే పొదవి పట్టుకుని పిల్లిలా నిశ్శబ్దంగా గుమ్మంవైపు నడిచాడు కృపాల్. కాలితో తలుపు రెక్కని అంతకంటే నిశ్శబ్దంగా తెరిచి గదిలోంచి బయటకు వెళ్ళి దఢాల్న చప్పుడు చేస్తూ మూసుకోకుండా తలుపురెక్కకి వీపు నానించి ఒకొక్క అంగుళమే ముందుకు జరుగుతూ వీపును కదిలిస్తూ క్రమక్రమంగా నిశ్శబ్దంగా తలుపురెక్కను మూసేశాడు. ఆ తర్వాత వాళ్ళిద్దరూ కన్పించలేదు.

బరువుగా నిశ్శబ్దంగా నిట్టూర్పు వదిలారు ప్రధాని. ప్రొఫెసర్ డోగ్రే అయిదుగుర్లో ఒకడిగా ఆ మైక్రో కంప్యూటర్ రూంలోకి వస్తాననడంలోని ఆంతర్యం యిప్పటికైనా ప్రమాదం జరగముందే బయటపడింది. 'ఇక ముందు గతేమిటి?' అనుకుంటూ స్క్రీన్‌వైపు చూశారు.

"మీరెప్పుడు తిరిగి వస్తారు?" రావ్ ద్వారా ప్రశ్న వేయించారు ప్రొఫెసర్ గోమాగో.

"ఏమో....అసలు వస్తానో....రానో.... స్నేత్నా తెలుసు కున్న రహస్యం మీద నా రాకపోకలు ఆధారపడివున్నాయి.

ఇంకో అయిదు నిమిషాల్లో ఆ వివరాలు ట్రాన్స్ ద్వారా మీరు నాకు అందజెయ్యలేకపోతే....బహుశా మరో ఇరవై నిమిషాల్లో...."

"ఏమిటి? మీకేమైనా ప్రమాదం రానున్నదా?"

"నాకే కాదు....యావత్తు మానవ ప్రపంచానికి.... భూమండలాని కంతకీ ప్రమాదం తప్పదు....భూగోళాన్ని మరో ఇరవై నిమిషాల్లో స్మాష్ చెయ్యడానికి ఎరేంజ్ మెంట్...."

అదిరిపడ్డాడు ప్రధాని. భూగోళాన్ని నాశనం చెయ్యడానికి ఏర్పాట్లా? ఇంకో ఇరవై నిమిషాల్లో భూమండలం, దీనిపై నున్న మానవజాతి, సకల జీవరాశీ అంతం కానున్నదా? వైజ్ఞానిక రంగం సాధించిన ప్రగతి యిదా? దీనికేమిటి పరిష్కారం?

"అయ్యో....ఎలా....ఏమీ చెయ్యలేరా....ఏమీ చెయ్యలేరా?" వాపోయాడు రావ్.

"ఏం చెయ్యను? ఎక్కడున్నానో ...అసలు భూమికి ఎంత దూరంలో ఏ కక్ష్యలో, ఏ గ్రహంలో వున్నానో కూడా తెలియకుండా....కనీసం భావతరంగాల ప్రసార వేగాన్నిబట్టి అంచనా వేసి లెక్కలుకట్టి నేనెంత దూరంలో వున్నానో ఎవరైనా చెప్పగలిగితే...."

తప్పదనుకుంటూనే ట్రాన్స్‌లోంచి తల త్రిప్పి ప్రధాని వైపు చూశాడు గోమూగో. అంతలో నిశ్శబ్దంగా తలుపు రెక్క తెరుచుకుంటోంది. ఇద్దరి చూపులూ అటు తిరిగాయి. తలుపు తెరుస్తున్న దెవరు? మిత్రులా? శత్రువులా? ఎందుకు? ఎందుకు??

(ఇంకా వుంది)

పునిస్త్రీ చావు

కురుమద్దాలి విజయలక్ష్మి

చివరికి నేనో నిర్ణయాని కొచ్చాను.

పునిస్త్రీగా నా భార్య మరణించాలి.

నా భార్య శాంతకున్న పెద్దకోరికలలో మొదటిది పునిస్త్రీగా పోవాలన్నది. రెండు కడుపు నొక కాయ కాయాలన్నది. ఆ రెండో కోవకే చెందిన కోరిక నేను సుఖంగా ఆరోగ్యంగా వుండాలన్నది.

లోకం దృష్టిలో మాది అనుకూల దాంపత్యం. అందులో ఏ మాత్రం సందేహంలేదు. మా మామగారికి నా భార్య ఒక్కతే కూతురు. వికృతాకారం కాదుగాని, మామూలు మనిషిలా వుంటుంది. అలంకరించుకుంటే అందంగా వుంటుందన్న మాట నిజమే కాని, అలంకరించుకోవాలన్న ధ్యాసే ఆమెలో వుండదు.

"సీతారాముడూ! నీ భార్య పేరుకు తగ్గట్లు శాంత స్వరూపిణి. ముచ్చటైన కనుముక్కు తీరు. పొందికగా వున్న శరీరం. వినయ విధేయతలు. ఇలాంటి ఇల్లాలుని పొందిన నీదిరా అదృష్టం!" బామ్మ బతికున్న రోజుల్లో తరుచు అనేది.

నూటొక్క జిల్లాల అందగాడిని కాకపోయినా, నేను మంచి అందగాడినన్న విషయం అందరికీ తెలుసు. నాకు సరి అయిన జోడీ హేమామాలినని నా దృఢనమ్మకం.

నాకు డబ్బు లేకపోవడం, మా మామగారి దృష్టిలో నేను పడటం, శాంతను చేసుకుంటావా అని ఆయన అడగటం జరిగింది. శాంత కన్నా శాంతతో వచ్చే లకారాలు నన్నెంతో ఆకర్షించాయి. బస్. మా పెళ్ళి జరిగిపోయింది. మామగారు బతికున్నంతవరకూ నేను చిల్లర తిండ్లవైపు తిరిగిచూడలేదు. ఒక శుభముహూర్తం చూసుకుని మూడంతస్తుల మేడ, రెండు లక్షల క్యాష్ శాంత పేరున రాసేసి సరాసరి స్వర్గానికే వెళ్ళిపోయాడు.

ఉన్న నా వుద్యోగం తప్పు చేశానంటూ తీసిపారేశారు. మా కో పాప పుట్టి మూడో నెలలో పోయింది. ఇది జరిగి ఎనిమిదేళ్ళు నిండింది. ఆ తర్వాత ఎన్నో రకాల బిజినస్‌లు చేశాను. ఏదీ కలిసి రాలేదు. మళ్ళీ పిల్లలు పుట్టలేదు. మేం

యిరువురం చూపించుకోని డాక్టర్లు లేరు. మీలో ఏ లోపం లేదు, పిల్లలు పుడతారు, అని అభయం యిచ్చేవారు ఫీజు పుచ్చుకుంటూ.

ఈ ఎనిమిదేళ్ళ కాలంలో నాలో మార్పు వచ్చిందం టుంది నా భార్య "లేదు నాలో కొద్ది మార్పు కూడా లేదు. మార్పు వచ్చింది నీలో. అతిచాదస్తం ప్రబలింది నీలో" అనేవాడిని నేను.

కారణం లేకపోలేదు. నాకు బైట తిరుగుళ్ళు ఎక్కువయ్యాయి. పేకాట వ్యసనంగా మారింది. మాలినితో పరిచయం అయింది. మాలిని పొందు నా కిష్టం. మాలినికి నగలు యిష్టం. ఇది నాలో మార్పు.

ఇహ శాంతలో మార్పు సోదమ్మ నుంచి చిలకజోస్యం వాడివరకు అందరిని పిలవటం, వాళ్ళడిగింది సమర్పించుకోటం, "నాకు పిల్లలు పుడతారా! పునిస్త్రీగా యీ లోకం నుంచి వెళ్ళిపోతానా!" అడగటం అరిగిపోయిన రికార్డ్‌లా తయారయింది. చెప్పేవాళ్ళకి ఏమీ వచ్చి చావదు కాబట్టి ఆరుగురు అబ్బాయిలు అయిదుగురు అమ్మాయిలు అని వకళ్ళు, పండులాంటి సుపుత్రుడు అని మరొకళ్ళు, ఇంకో మూడు నెలలకే నెలవంకలాంటి పుత్రిక కడుపులో పడుతుంది అంటూ చెప్పేవారు. ఇదంతా నాకు మా చెడ్డ చిరాకుగా వుండేది.

శాంతకి ముప్పైనాలుగోఏడు జరుగుతున్నది. పుట్టే అవకాశం వుంది. కాబట్టి పుడితే పుట్టవచ్చు. ఈ జోస్యంపిచ్చి నాకు నచ్చలేదు.

శాంతలో పీనాసితనం ప్రవేశించిందో, నా తిరుగుళ్ళు కనిపెట్టిందోగాని, అడిగినంత డబ్బు యివ్వటం మానేసింది. బిజనెస్ చేస్తానంటే—మనకెందుకు. ఏదీ కలిసి

రాలేదు. డబ్బు వృధా. ఉండటానికి మేడవుంది. కింద భాగాలు అద్దెకిచ్చాం ఆ అద్దెలొస్తున్నాయి. బ్యాంక్‌లో డబ్బుకి వడ్డీ వస్తున్నది. నెలకి మీ ఖర్చుకింద మూడు వందలు తీసుకోండి అని, ముష్టి మూడువందలు ఇచ్చేది. అది నాకు ఏ మూలకొచ్చేను. ఎంత శాంతవంతురాలైనా శాంత గుణం నాకు తెలుసు. మహా మొండిది. తను పట్టిన కుందేలుకి మూడేకాళ్ళు అనేరకం.

ఇలాంటి వాళ్ళని మోసంతో జయించాలి. అందుకే శాంతకి తెలియకుండా శాంత వక్కో నగ తీసుకెళ్ళటం అలాంటిదే డూప్లికేటు నగ రోల్డ్‌గోల్డ్‌ది చేయించి దానిని యింట్లో వుంచేవాడిని. అసలు నగ మాలిని మెడను అలంకరించేది. ఈ భాగోతమూ ఎన్నాళ్ళో సాగలేదు. మరీ విలువైన నగలు బ్యాంక్‌లో దాచబడ్డాయి. ఇంట్లో నగలు అయిపోయాయి. అందుకేనన్న మాట నేనీ నిర్ణయాని కొచ్చింది.

నా భార్య పునిస్త్రీ చావు చావాలి.

అంటే ఆమె నీ లోకం నుంచి పంపాలి.

ఎస్. ఆమెని చంపాలి. నా మీదకి హత్యానేరం రాకూడదు. పునిస్త్రీ చావు చచ్చిం తరువాత యావదాస్తీ నా కొస్తుంది. మాలినిని పూర్తిగా నా యింటికి తెచ్చుకోవచ్చు.

పిడిరాయిలాంటి మనిషి అకస్మాత్‌గా చస్తే అనుమానం నా మీదకే వస్తుంది.

ప్లాన్ ఆలోచించటంలో రాత్రింబవళ్ళు మునిగి పోయాను.

"ఏమిటా దీర్ఘాలోచన దిగులుగా వుంటున్నారేమిటి?" శాంత గుచ్చి గుచ్చి అడిగింది.

"శాంతా! విధిరాత నెవ్వరూ తప్పించలేరు" నిదానంగా శాంత మొహంలోకి చూస్తూ అన్నాను.

"అదేమిటో చెప్పండి. మీ మౌనం నన్ను బాధిస్తున్నది." పదేపదే ఆందోళనగా శాంత అడిగిం తరువాత చెప్పాను.

"ఫేస్ రీడింగ్ తెలిసిన ఒక పెద్దాయన ఈ మధ్య నాకు తటస్తించాడు. ఫేస్ రీడింగ్‌లో ఆయన ఎక్స్‌ఫర్ట్. అయినా అడిగిన అందరికీ జ్యోతిష్యం చెప్పడు. ఎవరికైనా చెప్పాలనిపిస్తే ఎదుటివారి ఫేస్ అలా చూస్తూనే నాలుగు ముక్కల్లో చెపుతాడు. ఇహ దానిలో తిరుగులేదు. మళ్ళీ మళ్ళీ అడిగినా చెప్పలేడు" అంటూ ఆగాను.

"ఆయనేం చెప్పారు చెప్పండి" నన్ను కుదుపుతూ ఆదుర్దాగా అడిగింది శాంత.

"నే చెప్పేది వింటే నీవు తట్టుకోలేవు" ఓ బాణం విసిరాను.

"అయినా సరే చెప్పితీరాలి" మొండిగా అంది.

"భరించలేని చేదునిజం అది."

"కాలకూటవిషమైనా సరే చెప్పండి."

"ఆయనేం చెప్పారంటే మరి....మరి....మరో ఆరు నెలలలో నేను మరణిస్తానుట...."

"శివ శివా!" అంటూ చెవులని చేతులతో కప్పుకుంది శాంత.

"నేను మరణించటం తథ్యం అని, జపాలు చేసినా, శాంతులు చేసినా లాభం లేదని, బతికున్న నాలుగు రోజులూ పుణ్యకార్యాలు చేయమని చెప్పాడు. ఈ ఆరు నెలల లోపల ఒకసారి మృత్యువు నిన్ను ముద్దుపెట్టుకు వెళుతుందిట. మరోసారి పూర్తిగానే తనతో తీసుకెళుతుందని

గట్టిగా చెప్పాడు."

శాంత కళ్ళనిండా నీళ్ళుబికాయి. పమిట కిందవున్న నానుతాడుని పైకితీసి మంగళసూత్రాలని కళ్ళకద్దుకుంది.

"వాడి ముఖం. తెలిసీ తెలియని వాగుడు వాగివుంటాడు. అదేం మనసులో పెట్టుకోకండి. మీ ఆయుస్సు ఎనభై. నా ఆయుస్సు అరవై ఆరు. నాకు పిల్లలు పుడతారు. నాకు పునిస్త్రీ చావు వస్తుంది. ఆ మధ్య నా చెయ్యి చూపి మహా జ్యోతిష శాస్త్ర పితామహుడైన మార్కండేయ శాస్త్రిగారు చెప్పారు. మీ రధైర్యం చెందకండి."

హతోస్మి, గాలిలో వదిలిన బాణం గురి తప్పింది. అయినా శాంతని నమ్మించాలి. శాంతలో అనుమాన బీజం నాటాలి. అనుమానంతో కృంగి కృశించి అది చావాలి. నే ఏ ఆయుధంతో చంపకపోయినా అది తీసుకు చస్తుంది. నాలుగు రోజులు టైం తీసుకున్నా సరే—

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" నన్ను కుదుపుతూ అడిగింది శాంత.

అప్పుడే తెలివిలోకి వచ్చినట్లు అయోమయంగా శాంత ముఖంలోకి చూశాను. "శాంతా! బాధల్లా నా గురించి కాదు. నే పోతే వంటరిగా యింత చిన్న వయసులో వితంతువుగా నీవు బ్రతకగలవా అని!"

శాంత చటుక్కున నా నోరు మూసింది. మరోచేత్తో కళ్ళు తుడుచుకుంటూ "మరోసారి యిలాంటి మాటలు అనకండి. అంటే నా మీద ఒట్టు. ఇహపై అందరికీ మనిద్దరి జాతకం చూపిద్దాం. అందాకా మారుమాట ఆడకండి" అంది.

ఆ మాటకి నా మెదడులో ఓ మెరుపు మెరిసింది.

"నీ యిష్టం శాంతా!" నిర్లిప్తంగా అన్నాను.

"భోజనానికి లేవండి. హాయిగా తిని పడుకుందాం. మీ కిష్టమైన శనగపిండి కూరిన దొండకాయ వేపుడు, టమేటా చారు చేశాను" నన్ను చెయ్యిపట్టి లేపుతూ అంది శాంత.

నే బాధ పడతానేమో అని పైకి బింకంగా వుందిగాని, పిచ్చి పిచ్చి జోతిష్యాలు నమ్మి పునిస్త్రీ చావు అంటే ప్రాణం పెట్టే శాంత లోలోపల భయపడుతున్నదని, నా మాటల ప్రభావం శాంతని కలవరపరచాయని, మనసులో అల్లకల్లోలం బయలుదేరిందని ఆ చూపులు చెప్పకనే చెపుతున్నాయి.

భారంగా ఓ నిట్టూర్పు విడిచి భోజనానికి లేచాను.

2

నే చెప్పింది శాంత నమ్మింది. ఆ రాత్రంతా నిద్రపట్టక పక్కమీద అటూ యిటూ దొర్లుతూనే వుంది. కొత్త ప్లాన్ ఆలోచిస్తూ నిద్రపోతున్నట్లు, నిద్రలో మధ్య మధ్యలో వులిక్కిపడుతున్నట్లు నటించాను. నా వులికిపాటు శాంత గమనించింది.

మర్నాడు శాంతకి మాటిమాటికి చమటలు పోయటం, వళ్ళు తూలటం చూసి డాక్టరుని పిలిచాను.

"శాంతకుమారిగారు దేనికో వర్రీ అవుతున్నారు. ఇదివరకే కొద్దిగా బి.పి. వున్న మనిషి. ఇప్పుడు బి.పి. బాగా పెరిగింది. రెస్ట్ బాగా అవసరం. షాక్ వార్తలు ఏవీ విని పించకండి. గట్టిగా శబ్దాలు వినటం కూడా మంచిది కాదు. మజ్జిగరసం, పళ్ళరసం యివ్వండి. ఉప్పు కారం పూర్తిగా మానేయండి" డాక్టర్ వృత్తిరీత్యా పాఠం అప్పజెప్పారు.

శాంతకి బి. పి. పెరగటానికి కారణం ఏమిటో చెప్పాను.

"డోంట్ బి సిల్లీ. అయినా జాతకాలు నమ్మేవాళ్ళ దగ్గర ఇలాంటి వార్తలు చెప్పవచ్చా?" డాక్టరు నన్ను కోప్పడ్డాడు.

తప్పుచేసినట్లు తలవంచుకున్నాను. ప్లాన్‌లో ఒక భాగం గానే కావాలని డాక్టర్‌తో చెప్పాను అంతే.

మర్నాటి నుంచీ శాంత నన్ను వేధించటం మొదలు పెట్టింది. "ఎవరినైనా జ్యోతిష్కుడిని పిలవండి. చిలక జోస్యం వాడిని పిలవండి. సోదమ్మని కేకెయ్యండి" అంటూ.

నా ప్లాను అమలులో పరిచాను.

"చేతులు చూచి చెపుతాం, ముఖము జూసి చెపుతాం, కొండదేవర ఆన....రామన్న, లచ్చుమన్న...." అంటూ తిరిగే కోయవాడిని పట్టాను. వాడిచేతిలో డబ్బు కుక్కాను. చెప్పవలసింది చెప్పాను.

ఆ రోజు శాంత పక్కగానే వాడు మా వాకిట్లో నుంచుని అరుస్తున్నాడు.

"వాడిని పిలవండి. వెళ్ళిపోతాడు తొందరగా పిల వండి" అంటూ శాంత నన్ను తొందర చేసింది.

"వెధవ జోస్యం పోనిద్దూ! తలొకడు తలకొక విధంగా చెపుతారు. వాళ్ళకేం పనిలేదు. విధిరాత ఎవరైనా ఆప గలరా! ఒకడు ఇద్దరు పిల్లలంటాడు. మరొకడు పదిమంది పిల్లలు పుడతారని చెపుతారు. తలోమాట. వాళ్ళ జాతకం వాళ్ళకి తెలిసిచావదు...."

నేను కూర్చున్నచోటు నుంచి లేవకుండానే మాట్లాడు తుంటే, శాంతే లేచివెళ్ళి వాడిని పైకిరమ్మని పిలిచింది.

నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నాను.

వాడు రూపాయి అడిగాడు.

"ఉన్నదున్నట్లు చెపితే అయిదు రూపాయలిస్తానంది" శాంత.

"ఇలా డబ్బు తగలెయ్యకు. చెప్పటానికేం సొల్లు కబుర్లు ఎన్నయినా చెప్పవచ్చు. వీళ్ళకు ఇదో లాభసాటి వ్యాపారం" విసుగ్గా అన్నాను.

కోయవాడు కళ్ళెర్రజేశాడు.

"అయ్యా! ఇది యాపారమే. ఎవరికి, చాతగాని వెధవలకి. కొండదేవర మీద ఆన. నేను మా తాతకాడ చెయ్యి చూడటం నేర్చుకున్నాను. ముఖం చూచి చెప్పటం నేర్చుకున్నాను. అంతెందుకు ఫోటో చూపి ఆడి మొత్తం భవిష్యత్తు చెప్పగలను. ఈ రామన్న దొర అందరిలాంటి ఓడూ కాదు. రూపాయంటే రూపాయే పుచ్చుకుంటాను. తక్కువ ముట్టను. ఎక్కువ ఆశించను. ఒకరోజు భుక్తికి మాత్రమే సంపాయించుకుంటాను. ఆశపడను. అనర్థకం కొని తెచ్చుకోను" కోయవాడు గంభీరంగా అన్నాడు.

విసురుగా లేచివెళ్ళి గోడనున్న నా ఫ్రెండ్ ఫోటో తెచ్చి వాడిముందు పెట్టాను. "వీడి జాతకం చెప్పు. నీ జాతకం ఆ దెబ్బతో తెలిసిపోతుంది" అన్నాను కోపంతో.

"ముందు రూపాయకాసు నా చేతిలో పడాల నేను పెదవి కదపాల. నా వాక్కు జోరుగా రావాల" అన్నాడు వాడు.

"ముందు చెప్పు యిస్తానన్నాను."

"అదంతా ముడియాదో సామీ! ఏక్ రూప్యా, సామీ, వన్ రుపీయే కదా!" అంటూ మొండిగా పంచభాషలు మొదలుపెట్టాడు.

మా యిరువురి మొండితనం శాంతకి తలనొప్పి కలగజేసింది. రూపాయి తనే తెచ్చి యిచ్చింది.

"ముందే చెపుతుండ దొర. చేతికి ఎన్నివేళ్ళు అయిదు. రోజుకి నేను అయిదుగురికే చెబుతాను. కొండదేవర ఆన. అంతే మరి. ఇప్పటికి ఇద్దరికి చెప్పటం అయింది. ఇంక మూడే చెప్పాలి. తర్వాత ఎవరైనా వచ్చి అడిగితే నా నోట వాక్కురాదు. కావాలంటే రేపొచ్చి చెపుత" అన్నాడు కోయవాడు

"ఈ కథలు చెప్పకపోతే చెప్పటం రాదని చెప్పరాదా? ఫోటో చూపి చెపుతాడట ఫొటో. చిత్రాంగి బొమ్మ చూపి జోస్యం చెప్పిన కాలం కాదిది" వ్యంగ్యంగా అన్నాను.

కోయవాడు చురచుర నావైపు చూచి, ఫోటో చేతిలోకి తీసుకున్నాడు. ఫోటోని తీక్షణంగా చూశాడు. లెక్క వేశాడు కళ్ళు మూసుకున్నాడు. తెరిచాడు. వేరుముక్క తీసి ఫోటోమీద పెట్టాడు. వేరుముక్కనే చూస్తూ గడగడ చెప్పాడు.

"ఈ ఫోటోలో అయ్య, బాగా డబ్బున్న ఓడు. అన్ని వ్యసనాలూ వున్నవాడు. పెళ్ళయింది. ఇద్దరు పుంజులు. పెళ్ళాం ఈ అయ్యకి యిడాకులు యిచ్చి వేరేవుంది. పెళ్ళి దగ్గర నుంచీ ఇద్దరూ పాముా ముంగిసాలా కాపురం జేశారు. పుట్టాల్సిన రాత వుండబట్టి పుంజులు పుట్టాయి. ఈ అయ్య మళ్ళా పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడొక బిడ్డడు. డెబ్బయి ఆరు ఏళ్ళు జల్సాగా హాయిగా బతుకుతాడు. బిడ్డ కూడా బంగారంలాంటిది పుట్టింది. అయితే ఆ ఆడకూన తప్ప మరోబిడ్డ అయ్యకుండదు" అని చెప్పి వేరుముక్క తీసుకుని ఫోటో నా చేతిలో వుంచాడు.

శాంత ఆశ్చర్యంగా నా వేపు చూసింది. అంతకన్నా ఆశ్చర్యంగా శాంతవేపు చూశాను. ఫోటో చూపి యింత చక్కగా చెప్పటం ఆశ్చర్యం అద్భుతంగాక మరేమిటి?

నిజం వాడికి. నాకు తెలుసు. వాడు గర్వంగా నవ్వాలి. నేను ఆశ్చర్యపోవాలి. ఆ సీను పూర్తి అయింది.

"నా జాతకం చెప్పు" అంటూ మరో రూపాయి నోటు తెచ్చింది శాంత.

"నువు చెప్పించుకోవద్దు" భయంగా అరిచాను.

"పోనీ మీరు చెప్పించుకోండి. మన యిరుపురిలో ఎవరం చెప్పించుకున్నా వకటే కదా?" అంది శాంత.

"వద్దు. భయంకర సత్యం వుంటే విని భరించలేము. నీ ఆరోగ్యం అసలే అంతంత మాత్రం" అన్నాను.

శాంత వినలేదు. "విధిరాత తప్పించలేమని మీరే చెప్పారు కదా! జరిగేది ఎవరం ఆపలేము. నా చేయి చూపి చెప్పు" అంటూ కొండదొరకి చేయి చూపింది.

శాంత అలాగే చేస్తుందని నాకు తెలుసు.

దిగులు ముఖం పెట్టి కూర్చున్నాను నేను.

కొండదొర తతంగం కానిచ్చి, శాంత చేతిలో వేరు పెట్టి దానినే చూస్తూ చెప్పసాగాడు.

"అమ్మా! మీ జననీ జనకులకు మీ రొక్కరే కూన. మీరు పసితనం నుంచీ బంగారు పూలమీద నడిచారు. ఇరవై రెండో ఏట మీకు పెళ్ళయింది. ఒక పాప మూడు నెలల కూనగా వుండగానే పోయింది. నీకు తాళి కట్టిన వాడు నీ వంటే బహుప్రేమేగాని, మనసు చంచలం. గాలి గుర్రమెక్కి తిరిగి వస్తుంటాడు. పెనిమిటి ప్రేమవుంది. ధనలక్ష్మి మీ పేరనుంది. కానీ అమ్మా! దుష్టగడియలు మీ జాతకంలో ప్రవేశించాయి. నీ ముఖాన విధవరాత ఆ మాయదారి దేవుడు రాశాడు...."

ఆ మాట వింటూనే శాంత 'కెవ్వు' మంది. అదేం వినిపించుకోకుండా కోయవాడు చెపుతూనే వున్నాడు.

ధైర్యం చెపుతున్నట్లు నేను శాంత భుజంమీద చేయి వేశాను.

"....అయ్యే యింక ఆరు నెలలు కూడా బతకదమ్మా. అకాల మృత్యువు అకస్మాత్తుగ అయ్యమీద పడి లాక్కెళు తుంది. ఆ తర్వాత...."

కోయవాడు మాట పూర్తిచేయకముందే ఛర్రుమని లేచాను. "ముందు బైటికి నడువు. ఇంకొక్క మాట నీ నోట్లోంచి వచ్చిందా? నీ నాలుక పీకి చేతిలో పెడతాను. వెధవ జోస్యం. ముండమోపి జోస్యం. నీ బతుకు నీకు తెలియదు. మా రాతలు చెపుతావా?" పెద్దగా అరుస్తూ మీద మీద కెళ్ళాను.

కోయవాడు తుస్సున కోపం తెచ్చుకుని విసురుగా లేచాడు. "గీతగీ అని రాగాలు తీస్తూంటే రాత నెవరు బాగుచేస్తారు. పోగాలం వస్తే యే దేవుడూ ఆపలేడు" అంటూ చరచరా వెళ్ళిపోయాడు.

అక్షరాల నే చెప్పినట్లు ఆచరించి కోయవాడు వెళ్ళి పోయాడు. బాగా నటించాడు. ఒకటా రెండా అయిదు వందల రూపాయలు అర్పించుకుంటిని.

వాడు వెళ్ళగానే శాంత వెళ్ళి నిస్సత్తువగా మంచం మీద పడుకుంది. ఈ షాక్ ట్రీట్‌మెంట్‌కి బి.పీ. బాగా పెరిగివుంటుంది. ముచ్చెమటలు పోస్తున్నాయి. రొప్పు తున్న గుర్తుగా గుండె ఎగిరెగిరిపడుతున్నది. ముందు ఆదుర్దా ప్రకటించి, శాంతకి అనుమానం రాకుండా వుండ టానికి డాక్టర్‌కి ఫోను చేశాను.

డాక్టర్ వచ్చి ఒక యింజక్షన్ యిచ్చి "మిమ్మల్ని జోస్యం యెవరు చెప్పించుకోమన్నారు?" అని శాంతను "నీకైనా తెలివి వుండక్కర్లేదా!" అని నన్ను కోప్పడి,

"ఇలా అయితే కష్టం" అని తీర్పు యిచ్చి, మరోసారి బి.పి. చూసి వెళ్ళిపోయాడు.

దిగులుతో శాంత మంచం ఎక్కింది.

నాకు కావాల్సింది అదే.

కాని మూడురోజుల తర్వాత తిప్పుకుంది. బి.పి. కొద్దిగా తగ్గిందని డాక్టరు చెప్పాడు. దిగులుని మించిన రోగం లేదంటారు. మేము మందు లివ్వగలం గాని రోగి మనో వ్యాధితో వుంటే రోగం తగ్గుముఖం పట్టదు అంటారు డాక్టర్లు. దానికి భిన్నంగా బి.పి. నార్మలు కొస్తున్నది. కాని శాంత మునుపటిది కాదు.

ఆమెలో అణువణువునా అనుమానం ఏర్పడింది. తనకి వైధవ్యం రాక తప్పదని, మాటి మాటికి కన్నీళ్ళు పెట్టుకునేవి. తదేకంగా నన్ను చూస్తూ వుండిపోయేది. ఈ మనిషిని మళ్ళీ చూస్తానా! ఆమె చూపుల్లో ఆ భావం కదులాడేది. గుళ్ళో పూజారికి డబ్బు యిచ్చి నా పేరున పలు రకాల అర్చనలు చేయించింది. ఇంట్లో యజ్ఞం చేస్తానంటే కొట్టిపారేశాను, పిచ్చి చాదస్తాలు పెట్టుకోవద్దని.

శాంత వడిలిపోయింది. కళ్ళకింద నల్లచారలు పడ్డాయి. కనపడ్డవాళ్ళతో నల్లా చెప్పుకుని బాధపడేది. తాయిత్తు సంపాదించి నా చేతికి మొలతాడుకి కట్టింది. ఆమె ప్రయత్నం ఆమె చేస్తున్నది.

3

ఆరునెలలు యెంతలో వస్తాయి గిర్రున తిరిగి వస్తాయి. పిడిరాయిలా నే వుంటే ఇంక శాంత ఈ జోతిష్యాలు నమ్మదు. ఎక్కడ చచ్చిపోతానో అన్న దిగులుతో కావాల్సినంత డబ్బు యిస్తున్నది. నా జల్సాలు ఎక్కువయాయి. అయినా శాంత మరణించకపోతే ఈ వైభోగం ఎన్నాళ్ళు?

ఇప్పుడు నాకు దిగులు పట్టుకుంది.

ఇలా వుండగా నా స్కూటర్‌ని మరో స్కూటర్ గుద్దుకోగా కొద్దిపాటి గాయాలు తగిలాయి. చక్కని అయిడియా వచ్చింది. ఇంటికి ఫోన్‌చేసి మౌత్‌పీసుకి కర్‌చీఫ్ అడ్డం పెట్టి బొంగురు కంఠం ఎరువు తెచ్చుకుని చెప్పాను. శీతారామ్‌గారికి బలమైన గాయాలు తగిలాయి. చావుబతుకుల్లో వున్నారు. మోహన్ హాస్పటల్లో చేర్చాము. స్కూటర్ యింకా రోడ్డుమీదే వుంది. అతని ఫ్రెండ్‌ని ఫోన్ చేస్తున్నాను" అని చెప్పి డాక్టర్ మోహన్ దగ్గరకు వెళ్ళాను.

ఈ దెబ్బతో శాంత పి.బి. పెరగటమో పూర్తిగా తగ్గటమో జరిగివుంటుంది. హార్ట్ ఆగినా ఆశ్చర్యపోనక్కర లేదు. కాని శాంత పక్కింటివాళ్ళని తీసుకొని ఆటోలో హాస్పిటల్‌కి వచ్చింది. నన్ను చూస్తూనే పెద్దపెట్టున ఏడుస్తూ నా మీద పడింది.

"ఇదేమిటి! ముందా ఏడుపు ఆపు. ఇది ఆసుపత్రి. ఇప్పుడేమైందని ఆ ఏడుపు. అసలు నీ వెలా యిక్కడికి వచ్చావ్?" విసుగు ఆందోళన మిళితం చేసి అడిగాను.

ఫోన్‌కాల్ గురించి చెప్పింది.

"ఇది చాలా విచిత్రంగా వుందే. వెధవ ఆ గోపీగాడి కంతా కంగారే, నీలాంటివాడే, దెబ్బ బాగా తగిలింది స్కూటర్‌కి. నాకు కాస్త కాళ్ళూ చేతులూ గీరుకు పోయాయి. అంతే!" అన్నాను.

"ఏం ఫరవాలేదమ్మా!" డాక్టర్ చిరునవ్వుతో అభయం యిచ్చాడు.

డాక్టరు అడగకపోయినా అప్పుడు నేను చెప్పాను.

"నా భార్య శాంత అమాయకురాలు. భయస్తురాలు.

ఈ మధ్య నా జాతకం....'' అంటూ వివరంగా డాక్టర్‌కి చెప్పాను.

"నాన్‌సెన్స్ జాతకాలని నేను నమ్మను'' డాక్టరు అన్నాడు.

"నేనూ నమ్మను, నా శాంతకి అమిత పిచ్చి'' ప్రేమగా శాంతను చూస్తూ చెప్పాను.

"నా భయం మీ కర్థం కాదు,'' శాంత అంది.

"అనవసరంగా మీరు వర్రీ అయి ఆయనని వర్రీ పెట్టకండి'' నెమ్మదిగా మందలించి డాక్టర్ నన్ను యింటికి పంపించేశాడు.

శాంతతో వచ్చిన ఆడంగులు "అలా అనకండి. శాంతమ్మ పసుపు కుంకుమల చల్లదనం, ఆమె తాళి గట్టిదనం, మీరు మృత్యుముఖం నుండి బైటపడ్డారు'' అంటూ తలోరకంగా వ్యాఖ్యానం చేశారు.

ఆ రోజు నుంచీ నే నో నిర్ణయాని కొచ్చాను. ఏం జరిగినా శాంత చావదు. చంపాలి. అప్పుడు చస్తుంది.

ఎలా చంపాలి?

ఎలా చంపాలి??

రాత్రింబగళ్ళు యిదే ఆలోచన. పిచ్చెక్కిపోతున్నది నాకు. అప్పటికి నాలుగు నెలలు గడిచిపోయాయి. శాంత ముఖం చూడాలంటే అసహ్యం కలుగుతున్నది. బైట తిరగటం యెక్కువ చేశాను. శాంత గోలపెట్టేది.

"మీరు యింటిపట్టున వుండటం లేదు. నా కన్నా మీకే దిగులు ఎక్కువయింది. జపతపాలు చేయించాను. తాయిత్తు కట్టించాను. ఇంక మీరు భయపడకండి'' అంటూ కన్నీళ్ళు పెట్టుకునేది.

4

ప్రతి రాత్రీ భోజనం కాగానే సిగరెట్ తాగుతూ పై మేడమీద పచార్లు చేయటం నా అలవాటు. భోంచేసి సిగరెట్ పెట్టె లైటర్‌తో మేడమీద కెక్కాను. వెన్నెల రాలేదు. వుండీ లేనట్లు కాంతి వుంది.

"శాంత పునిస్త్రీ చావు చావాలి ఎలా? ఎలా?" సిగరెట్‌తోపాటు నా ఆలోచనలు తగలడుతున్నాయి.

శాంత మేడపైకి వచ్చింది.

ఎప్పుడో ఓసారి తప్ప శాంత పై మేడమీదకి రాదు. నా ఆలోచనలకి అడ్డు తగులుతూ వచ్చేసరికి మండింది. ఆ మంట పైకి కనిపించకుండా, "ఏంటి పైకి వచ్చావ్?" అన్నాను.

"మన పక్కింటి రాఘవమ్మగారు అందండి. మార్కండేయ పూజ చేయిస్తే మృత్యుభయం వుండదుట. కాస్త ఖర్చుతో పని. అయినా మనం లేనివాళ్ళం కాదుకదా! ఇది గుర్తుకు వచ్చి మీతో చెపుదామని వచ్చాను. మార్కండేయ పూజ చేసే విధానం...."

శాంత చెప్పుకుపోతున్నది.

"నీ శార్ధం! నీ చావుకి నేను చూస్తుంటే, చావులేని నన్ను బతికించాలని పాట్లుపడుతున్నావు. వెధవ ప్లాను వేసిన నన్ను నే తిట్టుకోవాలి" ఊ కొడుతూ కసిగా అనుకుంటున్నాను.

శాంత పిట్టగోడ కానుకుని కిందకి చూస్తూ అంది. "చూశారా! విచ్చుకున్న బొడ్డుమల్లెలు. ఈ మూడో అంతస్తుకి కూడా కనపడుతూ ఎంతందంగా వున్నాయో? అబ్బ! రండి. చూడండి."

రెండుసార్లు పిలిచే టప్పటికి వెళ్ళక తప్పలేదు.

శాంత పక్క కొచ్చి దూరంగా నుంచుని పిట్టగోడని పట్టుకొని ముందుకు వంగాను.

అంతే! ఫెళ్ళున శబ్దం. నన్ను నే నిలదొక్కుకోలేక పోయాను.

డాబా పిట్టగోడ విరిగింది. నేను కిందపడుతున్నాను.... పడిపోతున్నాను.... అంతవరకే తెలుసు.

5

వళ్ళంతా బాధ. నెమ్మదిగా తెలివి వస్తున్నట్లు భ్రమ. కళ్ళముందు మసగ మసకగా తెర.

నాకేమయింది?

"లాభంలేదు. తెలివి రావటమే కష్టం. వచ్చినా బతకటం మరీ కష్టం. ఎడంకన్ను వేపు రెండు అంగుళాలు తప్ప బాడీ అంతా రక్తంముద్ద అయింది. మన డ్యూటీ మనం చేశాం. ఏమంటావు రవీ!"

"ఎస్ డాక్టర్! మీరన్నమాట అక్షరాల కరెక్ట్. ఇతనిలో కొనప్రాణం వుందేమో! అరె, తెలివి వస్తున్నట్లు వుంది."

"ఎస్."

నా కర్మమైపోయింది. నా కింకా తెలివి రాలేదనుకుని డాక్టర్లు బిగ్గరగా మాట్లాడుకుంటున్నారు. నే నిప్పుడు మృత్యుముఖంలో వున్నాను. నే చెప్పించిన తప్పుడు జోస్యం నా పట్ల నిజం అయింది. ఆరి భగవంతుడా! నన్ను బతికించు. ఇంక శాంత చావు కోరను అనుకుంటూ ఎడంకన్ను తెరిచాను.

నా చుట్టూ డాక్టర్లు నర్సులు కాస్త వంగి నా ముఖంలోకి చూస్తున్నారు.

"మీరు మమ్మల్ని గుర్తుపట్టారా? తెలివిలో వున్నారా?

మిస్టర్ శీతారామ్! మీకు యాక్సిడెంట్ అయింది. అయినా ప్రాణభయం లేదు. డోంట్ వర్రీ. మేడ పిట్టగోడ విరిగి పడేటప్పుడు మీరు బోర్లాపడటంతో నోటికి, కుడికంటికి దెబ్బలు బాగా తగిలాయి. కుట్లు వేశాము. మీరు మాట్లాడ లేరు. ప్రస్తుతం కుడికంటితో చూడలేరు. మేమేదైనా అడిగి నప్పుడు మీరు చెప్పే విధం ఒకటి చెపుతాము. బాగా గుర్తుంచుకోండి. ప్రశ్న అడిగి కుడిచేయి చూపుతాము. ప్రశ్న కరెక్ట్ అయితే కన్ను మూయకుండా వుండండి. అలాగాక కన్ను మూస్తే కరెక్ట్ కాదని....'' డాక్టర్ చెప్పుకు పోతున్నాడు.

అలాగే నన్నట్లు తల వూపబోయాను. వెయ్యి పిడు గులు తలని ఢీ కొన్నట్లయింది. కాళ్ళూ చేతులూ యేవీ కదిలించలేనని అర్థమైపోయింది. వెచ్చని కన్నీరు వుబికి ఎడంకంటి నుంచి కారింది.

నా కన్నీటిని కాటన్ పెట్టి తుడిచింది నర్స్.

"మిస్టర్ శీతారామ్! చాలా బాధగా వుందా?'' డాక్టర్ కుడిచేయి చూపుతూ అడిగాడు.

కన్నార్పకుండా కుడిచేతిని చూశాను.

"ఆకలి వేస్తున్నదా?'' కుడిచేయి అలాగే వుంచి అడిగాడు.

కన్ను మూసుకున్నాను. అంటే ఆకలి కావటం లేదని అర్థం.

ఇలాంటి మరో నాలుగు చచ్చుప్రశ్నలు వేసి, డాక్టర్ అంటే యమధర్మరాజని నిరూపించుకున్నాడు.

నా ఆలోచనలు రెండే. నేను బతకనని అనిపిస్తున్నది. రెండు. శాంతని క్షమించమని అడగాలి.

"మీకు తెలివిరాక ఒకటిన్నరరోజు అయింది. మీ భార్య శాంతకుమారిగారు మిమ్మల్ని విడిచి ఒక్క-క్షణం వుండనని గోలు గోలున ఏడుస్తున్నారు. మీకు తెలివి రానందున మా ప్రయత్నం మేము చేస్తూ బైట వుంచాము ఆమెని. మీరు ఆమెని చూడాలనుకుంటున్నారా?" డాక్టర్ అడుగుతూ కుడిచేయి నా కంటిముందు వుంచాడు.

కన్నార్పకుండా ఆ చేతిని చూశాను.

శాంతని రూంలోకి పిలిచారు.

శాంత దోసిట్లో ముఖం దాచుకుని, నన్ను చూస్తూనే రోదించటం మొదలుపెట్టింది.

నా ఎడంకన్ను వర్షించింది ధారాపాతంగా.

"రోగి ఎదుట ఏడ్వరాదు. ఇలా అయితే మీరు రూమ్ బైటనే వుండవలసి వస్తుంది," నర్స్ గద్దించింది.

"లేదు లేదు యేడ్వను. నా బాధను నాలోనే దిగమింగు కుంటాను. దయచేసి నన్ను యిక్కడే వుండనియ్యండి. నా హృదయం యేనాడో బండరాయి అయింది. వారిని చూస్తూ యిక్కడే వుంటాను," శాంత కళ్ళు తుడుచుకుని అంది.

నర్స్‌ని, శాంతని అక్కడ వుంచి డాక్టర్లు వెళ్ళి పోయారు. అవసరమయితే పిలవమని చెప్పి, ఒక చిన్న డాక్టర్‌తో గంట గంటకి నన్ను వచ్చి చూడమని పురమా యించారు.

నర్స్ గుమ్మందగ్గర కూర్చుంది.

శాంత నా పక్కనే స్టూలుమీద కూర్చుని తదేకంగా నన్నే చూస్తున్నది. బాధ భరించలేకపోతున్నాను. చస్తే బాగుండుననని అనిపిస్తున్నది. మాట్లాడటానికి వీలులేకుండా డాక్టర్లు నా నోరు కుట్టేశారు.

శాంతను చూసి వులిక్కిపడ్డాను.

శాంత చప్పుడుకాకుండా పళ్ళు కొరుకుతున్నది. నాలుక బైటకు జాపి ఎక్కిరిస్తున్నది. కళ్ళెరజేసి చూస్తున్నది.

శాంత అలా ఎందుకు ప్రవర్తిస్తున్నదో నాకు అర్థం కాలేదు.

నా కాలో, చెయ్యో కదిలిస్తున్నది. నాకు ప్రాణం పోతున్న బాధ.

ఇదంతా దేవతలాంటి నా శాంత చేస్తున్నదా? నేను భ్రమపడుతున్నానా? భగవాన్ యిలాటి బాధ, ఈ నరకం పగవాడికి కూడా వద్దు—

రూమ్‌లో లైటు వెలుగుతున్నది.

గడియారం ఎనిమిది గంటలు కొట్టిన చప్పుడు వినిపించింది.

డాక్టర్ వచ్చి తన ధర్మం అన్నట్లు చూసి వెళ్ళిపోయాడు.

"మాకు కావాల్సిన చుట్టం వచ్చాడు మాట్లాడి వస్తాను. నే యిక్కడ లేనట్లు డాక్టర్‌కి చెప్పకండేం. అరగంటలో వచ్చేస్తాను" నర్స్, శాంతని అడిగింది.

"ఫరవాలేదు. నే దగ్గర వున్నాగా. వెళ్ళిరామ్మా!" అంది శాంత.

నర్స్ వెళ్ళిం తరువాత రూమ్ తలుపులు వేసింది శాంత. వచ్చి కుర్చీపీట నా మంచానికానించుకు కూర్చుంది. నా ముఖంమీదకు వంగి, నా చెవికి మాత్రమే వినిపించే అంత నెమ్మదిగా చెప్పటం మొదలుపెట్టింది.

"జాగ్రత్తగా వినండి. మీకు తెలివి రావాలని పదే పదే దేముణ్ని ప్రార్థించాను. ఆ దైవం నా మొరవిన్నాడు...."

శాంత చెపుతుంటే నాకు అంతులేని ఆనందం కలిగింది.

"....మీకు తెలివి రావాలని ఎందుకు కోరుకున్నానో తెలుసా? మీకు తెలియని సత్యం, నా ఒక్కదానికే తెలిసిన సత్యం మీకు వినిపిద్దామని—అంతే. మీ కంటే నా కెంతో ప్రాణం. పునిస్త్రీగా వెళ్ళిపోవాలన్న కోరిక. పిల్లాపాప లతో కళకళ లాడాలని, నా భర్త శ్రీరామచంద్రుడు కావా లని అన్నీ కోరికలే. నా కున్నదల్లా అంతులేని ధనం. పాప పుట్టి పోయింది. మీ తిరుగుళ్ళు ఎక్కువయాయి. పునిస్త్రీగా చావాలన్న కోరిక తప్ప అన్ని కోరికలకీ ఆనకట్టకట్టాను.

నా నగలు మీరు మార్చి మాలిని అనే బజారు మనిషికి యిచ్చి, నకిలీ నగలు ఆ స్థానంలో వుంచారని గ్రహిం చాను. అయినా పెదవి కదిపి అదేం అని అడగలేదు.

నన్ను మంచాన పడేసి పీక్కు పీక్కు చావటానికి ప్లానువేసి, దొంగ కోయవాడిని తీసుకువచ్చి జోస్యం చెప్పించారు. నేను నిజంగానే మంచం ఎక్కాను. మీ కన్నా ముందు చనిపోవటానికి యే బావిలోనన్నా దూకుదా మనుకున్నాను. ఇంతలో అనుకోనిది జరిగింది.

"మీరు యింట్లోంచి బైటికి వెళ్ళటం చూసి ఆ కోయ వాడు నా దగ్గర కొచ్చాడు. ఇక్కడ జోస్యం చెప్పి వాడు యింటికి వెళ్ళేసరికి వాడికి లేక లేక కలిగిన ఒక్క కొడుకు చావు బతుకుల్లో వున్నాడుట. నా బిడ్డను బతికించు తల్లీ! ఆ అమ్మకి నిజం చెపుతాను" అని దేవతకి మొక్కు కున్నాడుట. వాడి కొడుకు బతికి బైటపడ్డాడు. వాడికున్న విశ్వాసం, మంచితనం మీకు లేకపోయింది.

మీరు బైటికెళ్ళిం తర్వాత వాడొచ్చి నా కాళ్ళు పట్టు కుని, జరిగిందంతా చెప్పాడు. అయ్య మీ ప్రాణాలు తీయ టానికి చూస్తున్నాడని హెచ్చరించి వెళ్ళాడు.

అప్పుడు సర్వం నా కర్థం అయింది. చంపితే హత్యా

నేరం మీదపడుతుంది. అందుకే మీరీ ప్లాన్ పన్నారు. ఫేస్ రీడింగ్ చెప్పాడు వకాయన అంటూ కథ అల్లారు. కోయవాడికి అయిదువందలు యిచ్చి దొంగజోస్యం చెప్పించారు. బహుశా ఆ రోజు ఫోనులో యాక్సిడెంటులో చావు బతుకుల్లో వున్నారని చెప్పింది మీ నాటకంలో ఓ భాగమై వుంటుంది. ఏది విన్నా నేను చావలేదు. మొండిప్రాణం. ఆయుస్సు వుండగా నే నెలా చస్తాను?

మీరు నన్ను చంపదల్చుకున్నారు. మాలిని పొందు మరిగారు. ఇంక నేను మీకు అనవసరం. మీ చేతిలో నా చావు తధ్యం. ముందు నేనే చద్దామని ఆలోచించాను. అప్పటికే మీ మీద నా మనసు విరిగిపోయింది. కపి బైలుదేరింది. ఆ తృప్తి అనుభవిస్తూ హాయిగా వుండవచ్చు. నే నెందుకు చావాలి? నే చచ్చి మిమ్మల్ని ఎందుకు సుఖపడనివ్వాలి?

అందుకే ఎదురు ప్లాన్ ఆలోచించాను. నాలో శాంతి చచ్చి అశాంతి ప్రవేశించింది. మీ లాంటి భర్త వున్నా వూడినా వకటే.

మీ చావు మీరే కొనితెచ్చుకున్నారు. ఆరు నెలలలో యాక్సిడెంటులో చస్తానని మీరే అందరితో చెప్పుకున్నారు. తథాస్తు దేవతలు తథాస్తు అన్నారు. ఊరు ఊరు మీరే టామ్ టామ్ వేసుకోబట్టి నా పని సులభం అయింది. మన పిట్టగోడ పగులు యిచ్చింది. దానిని పూర్తిగా విరగగొట్టి నామమాత్రంగా అతికించి వుంచాను. కింద రాళ్ళగుట్ట దానిమీద రేకుముక్కలు, సీసం పెంకులు నిలువునా సర్ది వుంచాను.

మీ అలవాటు నాకు తెలిసిందే కదా! మేడ యెక్కారు. మాటలు చెబుతూ సరిగ్గా విరిగిన పిట్టగోడ దగ్గరకు మిమ్మల్ని తీసుకువెళ్ళాను. మీరు వంగటమేమిటి మూడం

తస్తుల మీదనుంచి రాళ్ళగుట్ట మీద పడటం ఏమిటి? తల ఒకపక్క పగలటం, కుడికంట్లో గాజుముక్కలు దిగటం, నోరంతా రేకుముక్కలు పొడుచుకుని చీలటం! కాళ్ళు చేతులు శరీరం మీద ప్రతి అంగుళంలో పెంకులు దిగి చీల్చి చెండాడాయి.

కాలు విరిగింది. వెన్నుపూస తొలిగింది. చెయ్యి నజ్జు నజ్జు అయింది. ఏకాక్షి ఎడం కన్ను మిగిలింది. శరీరం మొత్తం కట్లే. మీరు బతకరని డాక్టర్లు చెప్పారు. ఓ వేళ బతుకుతారేమో! నేను బతకనివ్వను.

మీరు పూర్తిగా చావాలనుకున్న నేను ఈ నిజం మీకు వినిపించటానికి, కొద్దిసేపు మీకు తెలివివస్తే బాగుండునే అనుకున్నాను. దైవం నా పక్షం వుంది. నిజం మీకు విని పిద్దామనుకున్న నా కోరిక తీరింది.

మీరు మాట్లాడలేరు. రాసి చూపించలేరు. కనీసం కను సైగ చేయలేరు. ఇప్పుడు మీ ప్రాణాలు నా గుప్పిటలో వున్నాయి. నన్ను ఎవరూ అనుమానించరు. ఎందుకంటే, మీ చావు గురించి మీరే అందరితో చాటుకున్నారు. కాశీ మజిలీ కథల్లో చదివాను. మాంత్రికుడి ప్రాణాలు చిలకలో వుంటే ఆ చిలకని పట్టుకున్న రాకుమారుడు, చిలకకాలు, రెక్క ఏ కీలుకు ఆ కీలు విరిచి ఆనందించి ఆఖరికి చంపే వాడుట....''

శాంత చెప్పిందంతా వింటున్న నేను భయంతో వణికి పోయాను. ''నో....నో....'' పిచ్చిగా అరవబోయాను. ''రక్షించమంటూ'' ఆర్తనాదం చేయబోయాను. నా కసాధ్య మైంది.

శాంత పిడికిలి బిగించి నా కాలుమీద బలంగా గుద్ది ''విధిరాత. పునిస్త్రీ చావు నాకులేదు'' అంది.

ప్రాణం పోయినంత పని అయింది. భయంకరంగా అరవబోయాను. నోరు నెప్పిపుట్టింది.

"జోస్యం నిజమైంది కదండీ!" అంటూ ఈసారి పొట్ట మీద గుద్దింది.

"నన్ను దిక్కులేనిదాన్ని చేసి, వంటరిదాన్ని చేసి, సరాసరి స్వర్గానికి వెళ్ళుతున్నారా?" అంటూ నా చేతిని సాగదీసి వదిలేసింది.

"బాధ....బాధ....నరకం. చావు ముందు రాదేం? అయ్యో అమ్మో?"

నాది అరణ్యరోదన. కాదు కాదు నాది మూగరోదన. బాధతో గిలగిలలాడిపోతున్నాను.

"నాకు తెలుసండీ! మీది మొండి ప్రాణం. మూడంత స్తుల డాబా మీదనుంచి పడికూడా చావలేదు. విరిగించోటే మళ్ళీ విరగొట్టినా చావటంలేదు. కాని జాతకం ప్రకారం నాకు పునిస్త్రీ చావు లేదు కదా? జోస్యం ప్రకారం మీరు చావాలి కదా! ఒక్క నిమిషం ముక్కు మూస్తాను. బస్. సునాయాస మరణం సంభవిస్తుంది. ఆ తర్వాత పెద్దపెట్టున ఏడుస్తూ ఈ గదిలోంచి పరుగెత్తాలి. చాలా తతంగంవుంది. వంటరిగా అది నేనే చూసుకోవాలి కదా! నా జాతకం అది నా కర్మ...." అంటూ శాంత నా ముక్కు గట్టిగా మూసింది.

విదిలించుకోబోయాను. "వద్దు, వద్దు" అరవబోయాను.

భగవంతుడు నా ఒక్క కన్నుతప్ప, సర్వం కట్టేశాడు.

కసిగా నా కంట్లోకి చూస్తున్న శాంతలో రాక్షసిని కన్నార్పకుండా చూస్తూ గిలగిలలాడుతున్నాను.

ఊపిరి ఆడటంలేదు. దారుణమైన బాధ, మైకం కమ్ముతున్నది.

"శాంతా! శాంతా! రాక్షసీ! రాక్ష....సి....యి...." □

బ్యాంకు దోపిడి

బి. రాజేశ్వరి

సుధాకర్ చాలాసేపట్నుంచీ ఆ వ్యక్తిని గమనిస్తున్నాడు.

అతనికి దాదాపు ముప్పై ఐదేళ్ళుంటాయి. పొడువుగా, అందుకు తగ్గ లావుగా వున్నాడు. షర్టు, పాంటు వేసుకున్నాడు. గడ్డం నున్నగా గీసుకున్నాడు. చేతికి టిఫిన్ బాక్సు పెట్టుకునేలాంటి జిప్ బాగ్ తగిలించుకున్నాడు. ఉద్యోగస్థుడిలాగా వున్నాడు.

తొమ్మిదో నెంబరు బస్సు వచ్చింది చాలా రష్‌గా వుంది.

ఆ రష్ చూసి ఓ అడుగు వెనక్కి వేశాడు సుధాకర్. కాని ఆ వ్యక్తి మాత్రం మహాచొరవగా గుంపులో దూరేసి పుట్‌బోర్డు ఎక్కేశాడు. సుధాకర్ తనూ ఎడ్వంచర్ చెయ్య దల్చుకున్నాడు. ఆ వ్యక్తి వెనకనే తనూ ఎక్కేశాడు.

బస్ బయటనుంచి చాలా రద్దీగా కనిపించినా, బస్ మధ్యలో ఖాళీగానే కనిపించింది. సుధాకర్ మధ్యకు మెల్ల మెల్లగా సర్దుకున్నాడు. ఆ వ్యక్తికోసం చూశాడు. అతను అక్కడే పుట్‌బోర్డు పట్టుకునే వేలాడుతున్నాడు.

సుధాకర్‌కి కొంచెం వింతగానే కనిపించిం దతని వైఖరి. బహుశా రాబోయే ఒకటి రెండు స్టాపుల్లో ఎక్కడైనా దిగాల్సివుందేమో ననుకున్నాడు.

బస్ నాలుగు స్టాపులు దాటినా ఆ వ్యక్తి యింకా పుట్‌బోర్డునుంచి కదలకపోవటంతో సుధాకర్‌కి కుతూహలం రేగింది. ఆ వ్యక్తిమీద ఓ కన్నేసి చూస్తున్నాడు.

సుధాకర్ అనుమానం నిజమయింది. ఆ వ్యక్తి ప్రతి స్టాపుకీ పాసింజర్సుతోబాటు తనూ కిందికి దిగుతున్నాడు. మళ్ళీ ఎక్కుతున్నాడు. అతని చేతులు ఆ సమయాల్లో చాలా నిపుణతతో పని చెయ్యటం సుధాకర్ దృష్టిని దాటిపోలేదు. అతనికి కేసు అర్థమైపోయింది.

సుధాకర్ ఊహించినట్టే ఆ వ్యక్తి ఆ తర్వాతి స్టాపులో దిగిపోయి, మళ్ళీ ఎక్కే ప్రయత్నం చెయ్యలేదు. బస్ కదిలిపోయేవరకు చూశాడు, ఆ వ్యక్తి ఎక్కలేదు. సుధాకర్ గబగబ ఎదటినుంచి బస్ దిగేశాడు.

బస్ కదిలిపోయింది.

ఆ వ్యక్తి గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోతు

న్నాడు. సుధాకర్ వేగంగా పరుగులాంటి నడకతో ఆ వ్యక్తిని చేరుకున్నాడు. అతను ఎటూ చూడకుండా తిన్నగా నడిచి వెళ్ళిపోతున్నాడు.

సుధాకర్ అతన్ని సమీపించి "హలో" అన్నాడు.

ఆ వ్యక్తి గిరుక్కున తలతిప్పి అతన్ని చూశాడు. అతని వదనంలో రేకెత్తిన ఆశ్చర్యం, అదో విధమైన అనుమాన వాసనలతో సుధాకర్‌ని తాకింది.

"మీ రెవరు?"

"నీకు కావలసిన వాడ్ని!"

"ఏ రకంగా?"

"నువ్వు ఎలా కావాలనుకుంటే అలా!"

"మీరెవరో నాకు తెలీదు."

"ఇదివరకు తెలీకపోవచ్చు. ఇప్పుడు బాగా తెలుసుకుంటావు."

"అంటే....?"

"మనిద్దరం ఒకే బస్‌లో ప్రయాణంచేసి వచ్చాం."

"అయితే...."

"ఒకే బస్‌స్టాప్‌లో ఎక్కి ఒకేచోట దిగాం."

"దిగొచ్చు."

"దిగటం, ఎక్కడం సర్వసామాన్యం. కాని నీ గురించి అంత రద్దీలోనూ వర్రీ అయినవాణ్ణి నేనొక్కడినే!"

"ఎందుకు వర్రీ కావటం?"

"పట్టుబడితే నీ ఎముకలు సున్నమయిపోతాయేనన్న జాలితో."

"పట్టుబడిపోవటమా...." అతని కళ్ళు పెద్దవయ్యాయి. సుధాకర్ సమాధానంగా నవ్వాడు.

"మిష్టర్, మీరెవరో నాకు తెలియదుగాని, చాలా అవ

మానకరంగా మాట్లాడుతున్నారు."

"ఇప్పటిదాకా మాట్లాడటమే చూశావు. ఇక చేతలు చూస్తావా?" సుధాకర్ అతని జిప్‌బాగ్‌ని పట్టుకు లాగాడు.

అతను దొరికిపోయినట్టు చూశాడు.

"వసూలు ఏమాత్రం?"

అతని ముఖం నల్లబడిపోయింది.

"ఇంకా లెక్క చూడలేదు. నువ్వూ హేండేనా?"

"కాదనుకో! కాని నీది చాలా లాభసాటి వ్యాపారం. కాస్త ఎలర్ట్‌గా వుంటే రోజుకి వందలకి వందలు కళ్ళ చూడొచ్చు."

"దొరికిపోతే కటకటాలు లెక్కట్టొచ్చు!"

"అసలు దొరికితే కదా!? దొరికినా తప్పించుకోవటం కష్టం కాదుకదా! కాకపోతే సంపాదనలో సగం వాటా యిచ్చేస్తే సరి!"

"అయితే నీకిప్పుడు వాటా కావాలా?"

"వాటా కావలసింది నాక్కాదు. నిన్ను పట్టుకునే వాళ్ళకు? నేను నిన్ను పట్టుకోబోవటంలేదు."

అతని కళ్ళు పెద్దవయ్యాయి.

"మరి, అయితే...."

"నేను సులువుగా డబ్బు సంపాదించే మార్గం చెప్తాను. ఇలా చిల్లర దొంగతనాలు ఎన్ని చేసినా అలాంటి ఒక్క సాహసం సాటిరావు!"

"ఏమిటా సాహసం?"

"చెప్తాను. దీనికి చాకచక్యం, గుండె ధైర్యం కావాలి. మామూలు పిక్‌పాకెటింగ్‌కి హస్తలాఘవం ఒక్కటి వుంటే చాలు. దీనికలా కాదు."

"అబ్బ, సస్పెన్స్‌లో పెట్టేస్తున్నావు. అదేమిటో చెప్ప

కూడదా వెంటనే!"

"చెపుతాను. నీ కింకా గ్యాంగ్ వుందా?"

ఆ వ్యక్తి అనుమానంగా చూశాడు సుధాకర్ వంక.

"నేనేం పోలీసోడ్ని కాదులేవయ్యా బాబూ, నీ గ్యాంగ్ వివరాలు కనుక్కొని పట్టుకోవటానికి!"

"ఎందు కడుగుతున్నావు ఆ వివరాలు?"

"నేను వేస్తున్న పథకానికి మనుషులు అవసరం."

"మనిద్దరం చాలమా?"

"అదే కదా చెప్పేది. కనీసం ఓ పదిమందికి తక్కువ కాకుండా వుండాలి. ఇరవైమంది దాటకుండా వుంటే చాలు!"

ఆ వ్యక్తి కొద్ది క్షణాలు ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఇంతకీ నీ పథకమేమిటో ముందు చెప్పు. ముక్కూ మొకం తెలీనివాళ్ళకి మా వివరాలు చెప్పం. ఇది మా ముఠా ఒప్పందం."

"నీకింకా నా మీద అనుమానం పోలేదన్న మాట పోలీసోడినని. పోలీసు యింతసేపు నీతో అనవసరంగా తర్కం వేసుకూర్చుంటాడా? ఈ పాటికి ఏదొకటి సెటిల్ చేసి వుండేవాడు—వాటాయో, తూటాయో!"

ఆతను కొద్దిక్షణాలు ఏం మాట్లాడలేదు.

"ఏమిటో చెప్పు."

"బ్యాంకి దోపిడీ!"

పక్కలో పిడుగుపడ్డట్టు అదిరిపోయాడతను.

సుధాకర్ చిద్విలాసంగా నవ్వాడు.

"ఏమిటి నువ్వు చెప్పేది? బ్యాంకిని దోచెయ్యడమే."

సుధాకర్ మళ్ళీ నవ్వాడు.

"ఈ రోజుల్లో అతితేలిగ్గా డబ్బు సంపాదించే మార్గం బ్యాంకి దోపిడీయే! రోజూ పేపర్లో వార్తలు చూడటం లేదా నువ్వు? ప్రతిరోజూ దేశంలోని ఏదొక చోట బ్యాంకి దోపిడీ జరుగుతూనే వుంది. అయితే ఎంతమంది పట్టుబడ్తున్నారనే విషయానికొస్తే—మనలాంటి వాళ్ళు భయపడవలసిన అవసరం ఏం కనబడదు."

"నాకుగాని, మా గ్యాంగ్‌కిగాని యిలా చిల్లర దొంగతనాలు ముఖ్యంగా పిటీబస్సుల్లో పిక్‌పాకెటింగ్—తప్పి పెద్ద దోపిడీలు, దారి కాయటాలు-రావు."

"ఇప్పుడు నేర్చుకోవటానికి మంచి అవకాశం వచ్చింది. వదులుకోవద్దు."

"బ్యాంకి దోపిడీలు పట్టపగలే జరుగుతాయంటున్నారు. అదెలా సాధ్యం?"

"ఏముంది? ఒకేసారి పదిమంది బ్యాంకిలో జొరబడి ఆయుధాలు చూపించి బెదిరించి, కేషియర్ను దగ్గిరున్న మొత్తాలే కాకుండా మేనేజర్ని, యింకా బ్యాంకి ఆఫీసర్లని చంపుతామని బెదిరించి వాళ్ళచేతుల్తోనే బ్యాంకి సేఫ్టి లాకర్స్‌ని తెరిపించి దోచుకుపోతున్నారు. అయితే అది కొంత సీనియారిటీ వున్న డెకాయిట్స్ మాత్రమే చెయ్యగలుగుతారు. మనం అయితే కౌంటర్స్‌లో వుండే కేష్‌ని దోచుకుపోతే చాలు! అదే చాలా లక్షలుంటుంది!"

ఆ వ్యక్తి చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

"బ్యాంకి గురించి యిన్ని వివరాలు మీకెలా తెలుసు?"

సుధాకర్ నవ్వి "నేను పని చేస్తున్నది బ్యాంకులోనే కాబట్టి!" అన్నాడు.

ఆ వ్యక్తి త్రుళ్ళిపడ్డాడు.

"అయితే నువ్వు దొంగవి కాదా?"

"ఇప్పటివరకూ కాదు. ఇప్పుడు కూడా దొరకని దొంగని. దొరనే అనుకో! చెయ్యటానికి సాయం చేస్తాను గాని, నిజానికి దొంగతనం చెయ్యను!"

ఆ వ్యక్తి ఆశ్చర్యం నించి, అదురుపాటు నించీ ఇంకా తేరుకోలేదు పూర్తిగా.

"ఇప్పుడు చెప్పు నా మీద నమ్మకం కుదిరిందా?"

"ఇప్పుడిప్పుడే కుదురుతోంది. మా గ్యాంగ్ దగ్గర చిన్న చిన్న కత్తులు తప్ప ఆయుధాలు ఎవరి దగ్గిరా లేవు. బెదిరించటానికి అవసరమైతే పైకి కాల్చి అదరగొట్టటానికి తుపాకులు కావాలి కదా!"

"దానికి నేను పథకం సిద్ధంచేశాను. జలంధర్ కంపెనీ వాళ్ళు మామూలు తుపాకుల్లాగా కనపడే నకిలీ తుపాకులు తక్కువ ధరకు సప్లయి చేస్తుంటారు. ఆ కంపెనీ ఏజెంటు యీ వూళ్ళో వున్నాడు. అతను నాకు పర్సనల్‌గా తెలుసు. అతని ఎకౌంట్ మా బ్యాంకిలో వుంది. మనకి అవసరమైన నకిలీ తుపాకులు అతను సప్లయి చేస్తాడు. బెదిరించటానికీ, అదరగొట్టటానికి కూడా రెండు విధాల ఉపయోగపడతాయి. వాటిని పేల్చినపుడు నిజం తూటా పేల్చిన చప్పుడొస్తుంది. నిప్పురవ్వలు కూడా బయటికొస్తాయి. అవి నకిలీవని యెప్పుడు తెలుస్తుందంటే నిజంగా యెవడినైనా గురిచేసి పేలిస్తేనే! మనం పేల్చేది గాల్లోకే గాబట్టి బయటపడం."

"నా కింకో అనుమానం!"

"ఏమిటది?"

"కష్టమర్స్ వస్తూ పోతుంటారు కదా! ఎవడయినా పోలీసులకి ఫోన్ చేసి మనల్ని పట్టిస్తే?...."

"ఎందుకు పట్టిస్తారు? లోపలున్న కష్టమర్స్‌ని మనం

పట్టిస్తాం కదా! బయటివాళ్ళు కలగజేసుకుని పోలీసులకి కబురుపెట్టి వాళ్ళొచ్చేలోపల మనం మన పని పూర్తిచేసు కుంటాం కదా! బ్యాంకిలో ఫోన్స్ కనెక్షన్స్ ముందుగానే నేను కట్ చేసేస్తాను."

అతనింకా సందేహిస్తూనే వున్నాడు.

సుధాకర్ అతని వెన్ను చరిచి, "నాకో అయిడియా వచ్చింది. కస్టమర్స్‌తో యిబ్బందిలేని బ్రైట్ ఐడియా!" అన్నాడు.

"ఏమిటది?"

"జూన్ ముప్పయ్యో తేదీన బ్యాంకిలో మనీ ట్రాన్సాక్షన్స్ వుండవు. అంటే బ్యాంకి ఉద్యోగులు పని చేస్తారుగాని, కస్టమర్స్ సర్వీస్ వుండవు. ఆ రోజయితే మనం సరాసరి బ్యాంకి వుద్యోగుల్ని ఓ పని పట్టేస్తే సరి పోతుంది. సరాసరి మెయిన్ సేఫ్‌నీ లాకర్స్‌నీ లూటీ చేసెయ్యొచ్చు—యే లాకర్‌లో ఎంతుందో వివరాలు నేను రాసిపెట్టుకున్నాను. సాధారణంగా బ్యాంకిలోని అన్ని కౌంటర్స్ నేను యేదో సందర్భంలో డీల్ చేస్తూనే వుంటాను. మన పని తేలిగ్గా పూర్తిచేసుకోవచ్చు."

"ఈ అయిడియా బావుంది. ఎంతయినా బ్యాంకి ఆఫీసరువి కదా! కాని యిందులో మరో చిక్కుంది. కస్టమర్స్ వుండరు గాబట్టి కౌంటర్స్‌లో సొమ్ముండదు. కస్టమర్స్ దొరకరు."

"నువ్వు చెప్పేది అసలు సమస్యే కాదు. నేను సరాసరి సేఫ్‌నీ, లాకర్స్‌నీ లూటీచేసే వుపాయం నీకు చెప్పాను కదా! మెయిన్ సేఫ్‌లోని డబ్బే కదా కౌంటర్స్‌లో డిస్ట్రిబ్యూట్ అయేది. అదే కస్టమర్స్‌కి టర్నోవర్ అవుతుంది. జూన్ 30 న అయితే మనకు కస్టమర్స్‌నించి రిస్కే

వుండదు కదా!"

"నిజమే! నేను దూరం ఆలోచించలేదు. ఎంతైనా చిల్లర దొంగలం కదా! ఎంతొచ్చినా చాలనుకునే తత్వం మాది! అంచేత పెద్ద మొత్తాలంటే భయం, వణుకూను. సరాసరి ఖజానానే ఖాళీచేసే వుపాయం చెప్పావు. నీది మా గొప్ప బుర్ర!"

"చూశావా, బ్యాంకి దోపిడీ ఎంత తేలికో! మనకి డేట్ ఫిక్స్ అయిపోయింది గాబట్టి, నువ్వు మీ వాళ్ళని సేకరించి మన పథకాన్ని వాళ్ళకి వివరించు. ఈ లోపల ఆయుధాలు సమీకరించటం, జాగ్రత్త పరచటం నేను చూసుకుంటాను."

"మనం ఎక్కడ కల్సుకుందాం? బ్యాంకికి వస్తే అనుమానం రాదూ?"

"మెల్లగా అంటావేం? నువ్వు బ్యాంకివాళ్ళకి ఏమాత్రం గుర్తు దొరకర్కూడదు. అంతే కాదు, మనిద్దరి మధ్య జరిగే రహస్య సంభాషణలు, సమావేశాలు గురించి ఎవరికీ తెలియకూడదు. నీ గ్యాంగ్ మనుషులకి కూడా. ఏం జరిగినా మనిద్దరి మధ్యనే!"

"వాటాల విషయం కూడా యిప్పుడే మాట్లాడుకుంటే మంచిది కదూ!"

"అప్పుడే వాటాలదాకా పోయావా? అదీ మంచిదేలే. ముందుగా మాట్లాడుకోవటమే మంచిది. అయిడియా నాది, పని మీది కాబట్టి దోచుకున్న మొత్తంలో మూడో వంతు నేను తీసుకుంటాను. రెండువంతులు మీది."

"నాకు సమ్మతమే! ఆయుధాలు వగైరాకి అయ్యే ఖర్చు కూడా ఆ రేటు ప్రకారమే చూసుకుందాం."

"మంచి మాటన్నావు. నువ్వు వ్యాపారంలో అయితే

బాగా రాణిస్తావు."

"ఇదిగో, యీ దోపిడీలో బాగా కలిసొస్తే దొంగతనా లకి స్వస్తిచెప్పి ఏదయినా వ్యాపారం పెట్టుకుంటాను" ముసి ముసిగా నవ్వుతూ అన్నాడా వ్యక్తి.

సుధాకర్ ఫెళ్ళున నవ్వేసి, "నువ్వు గ్యారంటీగా దొంగతనాలనే కంటిన్యూ చేస్తావని చెప్పగలను—" అన్నాడు.

ఆ వ్యక్తి తెల్లబోయి, "అదేమిటి, అలా అన్నావు?" అన్నాడు.

"వెరీ సింపుల్. నీకు యీ బ్యాంకి దోపిడీతో కావలసి నంత అనుభవం, అంతకి మించి తెగింపు, ధైర్యం వస్తాయి. దాంతో నువ్వే పథకంవేసి వరసగా బ్యాంకి దోపిడీలు కండక్ట్ చేస్తావు. దాంతో దేశంలోని తిరుగులేని బ్యాంకి దోపిడీదారుగా లెక్కకు మించి సంపాదిస్తావు" అన్నాడు సుధాకర్.

అతను యిబ్బందిగా నవ్వి—"నిజమే సుమా!" అన్నాడు.

"ఇంతకీ నీ పేరు చెప్పావు కాదు—" అన్నాడు సుధాకర్.

"నా పేరు సాల్మన్‌రాజు" అన్నాడా వ్యక్తి.

"మంచి తెలివయిన పేరు" ప్రశంసగా చూశాడు సుధాకర్.

"మరి నీ పేరు?"

"సుధాకర్!"

"అన్నట్టు నీ దే బ్యాంక్?"

చెప్పాడు సుధాకర్.

"అయితే యికనేం? లక్షలకు లక్షలు దొరుకుతాయి. ఆ తర్వాత బ్యాంకి వుద్యోగం మానేస్తావా?"

"ఒక్కసారిగా మానేస్తే అనుమానం రాదూ? కొన్నాళ్లు చేసి, ఆ తర్వాత మెల్లిగా సర్వీస్‌నించి తప్పుకుంటాను—యేదో కారణం చూపించి."

"బావుంది. 30 నిర్ణయమే కదా!"

"నిర్ణయమే! ఈలోపల మనం ఆయుధాలు సేకరించుకోవటం, మన పథకాన్ని పకడ్బందీగా అమలుపరచుకోవటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చర్చించుకోవటం, జరగాలి! అందుకు నువ్వు నన్ను యీ అడ్రసులో కలుసుకొంటూ వుండు. ఇది మా ఫ్రెండు రూం అడ్రసు. అతను ఊళ్ళో లేడు. మన పని అయ్యే లోపల రాడు."

"అలాగే!"

"జాగ్రత్త....! నా పేరు యెక్కడా బయటికి రాకూడదు."

"నాకు తెలుసు కదా!"

2

జూన్ ముప్పయ్యో తేదీ.

సుధాకర్ హాఫ్‌యియర్లీ క్లోజింగ్ అకౌంట్స్‌తో చాలా బిజీగా కనిపిస్తున్నాడు. క్షణం క్షణం అతని కళ్ళు ద్వారంవైపు పరుగెడుతున్నాయి. అప్పటికే ఓ సారి సాల్మన్‌రాజు బ్యాంకి ముందు ఓ సారి పచారు చేసి పోయాడు—సుధాకర్ గ్రీన్ సిగ్నల్ కోసం.

సుధాకర్ యింకా సిగ్నల్ యివ్వలేదు.

సుధాకర్ ఓసారి స్టాఫ్ అందర్నీ కలయజూశాడు.

అందరూ లెడ్జర్‌తో హోరాహోరీ యుద్ధం చేస్తున్నారు.

ఓచర్స్ టాలీచేస్తూ, మేనేజర్‌తోను సీనియర్ ఆఫీసర్స్‌తోను చర్చిస్తూ బిజీగా వున్నారు.జనవరి నుంచి ఎక్కౌంట్సు సరిచూసుకోవటం పెద్ద టాస్క్!

సుధాకర్ ఓ సారి లేచి బాత్ రూంలోకి పోయి వచ్చాడు.

బ్యాంకికి నాలుగు టెలిఫోన్ కనెక్షన్లున్నాయి. వాటిని కత్తిరించెయ్యటం మొదట చెయ్యాల్సిన పని. తర్వాత స్టాఫ్‌ని ఒకచోట గుంపుగా చేరకుండా స్కాటర్ అయేలా చూడాలి. ఒకరికొకరు సాయం రాకుండా.

లాకర్స్‌కి, మెయిన్ ట్రజరీకి దార్లో ఏ ఆటకం లేకుండా లైన్ క్లియర్ చెయ్యాలి. బాక్‌డోర్ తెరిచి సాల్మన్‌రాజు గ్యాంగ్ లోపలికి తేలిగ్గా రావటానికి దారి సుగమం చేసి, అప్పుడు సాల్మన్‌రాజుకి గ్రీన్ సిగ్నల్ యివ్వాలి.

సుధాకర్ యింకా చెయ్యాల్సిన పనులు అలాగే మిగిలి పోయాయి. ఓ పక్క మేనేజర్‌కి తదితర స్టాఫ్‌కి అనుమానం రాకుండా యెక్కౌంట్సు టాలీ చేస్తున్నట్టు కనిపించాలి.

తను సేవింగ్స్ బ్యాంక్ కౌంటర్ చూస్తాడు. తనతో బాటు మరో ఆమె కూడా ఆ కౌంటర్ చూస్తుంది. మాటి మాటికీ ఆమె లెడ్జర్స్ తన ముందు పడేసి చిక్కు ప్రశ్నలతో వేధిస్తోంది, ఆమెకి సంతృప్తికరంగా సమాధానం చెప్పాలి. లేకుంటే చేజేతులా అనుమానం రేకెత్తించిన వాడవుతాడు.

మేనేజర్ పిలిచాడు.

సుధాకర్ వెళ్ళి "ఏమిటి సార్?" అనడిగాడు.

"మిస్టర్ సుధాకర్! ఇదిగో యీ తర్డ్ లెడ్జర్లోని ఎక్కౌంట్సు చూడండి. బాలెన్స్ మిస్ ప్లేస్ అయింది.

3638 నంబరు ఖాతాలో పడాల్సిన ఎమౌంట్స్ 3608 ఎకౌంట్‌లో క్రెడిట్ చేశారు. 3608 లో డెబిట్ చెయ్యాల్సిన ఎమౌంట్‌తో 3688 లో డెబిట్ చేశారు. ఆర్ యూ సఫరింగ్ విత్ ఎనీ షార్ట్ సైట్? గ్లాసెస్ వాడాల్సిన అవసరముందనుకుంటాను" అని సన్న సన్నగా చివాట్లు వేశాడు మేనేజర్.

సుధాకర్ యెటూ చెప్పలేక "సారీ సర్! రెక్టిఫై చేసుకుంటాను" అన్నాడు.

"ఏమిటీ సైటా, లెడ్జరా?...." అని నవ్వేశాడు మేనేజర్.

సుధాకర్ నవ్వాలి కాబట్టి తనూ నవ్వేసి, సీట్లోకి వచ్చేశాడు.

స్టాఫంతా హాల్లోని పొడవాటి బల్లలమీది లెడ్జర్స్ పడేసి పని చూసుకుంటున్నారు. మెసెంజర్లు బిజీగా లెడ్జర్స్ చేరేస్తున్నారు.

సుధాకర్ అందరూ బిజీగా వున్న విషయం గమనించాడు.

సీట్స్ అన్నీ హాల్లోకి చేరెయ్యటంవల్ల లాకర్స్‌కి, మెయిన్ ట్రెజరీకి, మధ్య ఆటంకాలు లేవు. అది ఒక విధంగా నయమే గాని, హాల్లో అందరూ ఒకచోట చేరి వుండటం ఓ విధంగా ప్రమాదకరం. అయినా ఫరవాలేదు. ఓ నలుగురు ఆయుధాలతో వాళ్ళందర్నీ అదుపులోకి తీసుకు రాగలరు. మరో నలుగురు లాకర్స్ పని పట్టిస్తారు. ఓ నలుగురు సెంట్రీ పని చూస్తారు. మొత్తం పదిహేను మంది నియమించాడు సాల్మన్‌రాజు. ఇంకా ముగ్గురు స్పేర్ లోనే వుంటారు!

సుధాకర్ మళ్ళీ మరోసారి స్టాఫ్ వంక కలియ

జూశాడు. ఎవరి పనుల్లో వారున్నారు. ఫోన్స్ నాలుగూ నాలుగు సీట్లలో వున్నాయి. మేనేజర్, ప్రొబేషన్ ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్లు యిద్దరు — మొత్తం నలుగురు సీట్లలోను వున్నాయి. సుధాకర్ సమయం చూసి మేనేజర్ కనెక్షన్ తప్ప తక్కిన మూడు కనెక్షన్స్ తెంచేశాడు.

మేనేజర్ బాత్రూంకి వెళ్ళటం చూసి, లెడ్జరు పట్టుకుని మేనేజర్ గదిలోకి అర్జంటుగా వెళ్ళిపోయాడు సుధాకర్. విజయగర్వంతో బయటకొచ్చాడు.

తర్వాత గ్లాస్ విండోస్‌లోనించి బయటికి చూసి, సాల్మన్‌రాజుకి గ్రీన్ సిగ్నల్ యిచ్చేశాడు సుధాకర్.

మేనేజర్ తన గదిలోకి తిరిగొచ్చాడు.

సుధాకర్ వెనక ద్వారంవైపు కదిలాడు. బోల్టు తీసేశాడు.

సాల్మన్‌రాజు యీ సరికి తన గ్యాంగ్‌కి సిగ్నల్ యిచ్చేసి వుంటాడు. ఏ క్షణంలోనైనా దాడి చెయ్యవచ్చు. మంచి అవకాశం!

మాటి మాటికీ వెనక ద్వారంవైపు తొంగి చూస్తున్నాడు సుధాకర్.

మళ్ళీ మేనేజర్‌నించి పిలుపొచ్చింది.

సుధాకర్ అన్యమనస్కంగానే మేనేజర్ రూంలోకి వెళ్ళాడు.

"అలా కూచోండి సుధాకర్!" అన్నాడు మేనేజర్.

"ఏమిటి సార్?" అలాగే నిలబడిపోయాడు.

"రోజు రోజుకీ బ్యాంకి దోపిడీలు ఎక్కువై పోతున్నాయి. పేపరు చూడటానికే భయంగా వుంది."

"అవును సార్! భయంగానె వుంటోంది."

"బ్యాంక్స్ అన్నిటికీ సెక్యూరిటీ ఏర్పాటుచేస్తే బావుం

టుంది. గవర్నమెంటు శ్రద్ధ తీసుకొంటున్నట్టు కనిపించదు. మనం రిప్రజెంట్ చెయ్యాలి''

"అవును సార్? ఇంత విపరీతంగా బ్యాంక్ రాబరీస్ జరుగుతుంటే సరైన ఏక్షన్ తీసుకోవటంలేదు గవర్నమెంటు? యిలా అయితే పబ్లిక్ మన బాంక్స్‌లోని సేఫ్టీ లాకర్స్ కన్న వాళ్ళింట్లోనే డబ్బు దాచుకోవటం మంచిదనుకుంటారు."

"నిజం, నిజం. మన ట్రాన్సాక్షన్స్ దెబ్బ తింటాయి."

సుధాకర్ సీట్లో యిబ్బందిగా కదిలాడు.

ఓపక్క సాల్మన్‌రాజు వచ్చే టయిమయింది. ఆటంకాల్లేకుండా లైన్ క్లియర్ చెయ్యాల్సిన తను యిక్కడ యీ మేనేజర్ గూడులో చిక్కుకుపోయాడు. ఎలా?

హాల్లో ఒక్కసారిగా కలకలం!

తుపాకులు గాల్లోకి పేల్చిన శబ్దం!

సుధాకర్ చటుక్కునలేచాడు. సాల్మన్‌రాజు గ్యాంగ్‌తో వచ్చేశాడు! తుపాకులు గాల్లోకి పేలుస్తున్నాడు. మేనేజర్ రూంలోకి రాలేదేమిటి? తను లేడనా?

మేనేజర్ దిగ్గున లేచాడు.

"ఏమిటి, ఏమిటా చప్పుళ్ళు?" గబగబ బయటికి వచ్చేశాడు వేగంగా.

సుధాకర్ తనూ కంగారు నటించాడు.

హాల్లో స్టాఫ్ చేతులెత్తి నించున్నారు.

ఏమిటి, పోలీసులున్నారు హాల్లో? సాల్మన్‌రాజు తన గ్యాంగ్‌తో పోలీసు వేషాల్లో వచ్చినట్టున్నాడే? తనతో ముందుగా చెప్పనేలేదు!

సుధాకర్ అనుమానం వెంటనే నివృత్తి అయి

పోయింది. సాల్మన్‌రాజు తన మామూలు వేషంలోనే వున్నాడు. కాని అతని గుండెలకి గురిచేసిన తుపాకీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ది!

అలాగే, అతని గ్యాంగ్‌కి గురి పెట్టివున్న తుపాకులు నిజం పోలీసులవే!

సుధాకర్ తన కళ్ళని తనే నమ్మలేకపోతున్నాడు.

సాల్మన్‌రాజు యెప్పుడొచ్చాడో తెలీదు. మరి యీ పోలీసులు సమయానికి యెలా వచ్చారు? సాల్మన్‌రాజు గ్యాంగ్‌ని యెలా పట్టేశారు? పెద్ద పజిల్‌లా వుంది సుధాకర్‌కి.

మేనేజర్ ముందుకి వచ్చి ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో కలచాలనంచేసి, "థాంక్యూ మిస్టర్ ఇన్‌స్పెక్టర్! సమయానికి పెద్ద రాబరీని అరికట్టి అమూల్యమయిన సేవ చేశారు. మీ డిపార్టుమెంటు టైంలీ ఏక్షన్ తీసుకున్నందుకు ఐ కంగ్రాట్యులేట్ యూ!" అన్నాడు.

సుధాకర్‌వంక కోరగా చూస్తున్నాడు సాల్మన్‌రాజు.

సుధాకర్ చూపు తిప్పుకున్నాడు.

సార్జంటు మేనేజర్‌వంక చూసి, సుధాకర్ దగ్గరికొచ్చాడు. హేండ్‌కఫ్స్ పైకితీసి సుధాకర్ చేతులకి తగిలిస్తుంటే సుధాకర్ పెద్దగా కేకపెట్టి "నన్నెందుకు అరెస్టు చేస్తున్నారు?" అన్నాడు.

మేనేజర్ సమాధానంగా నవ్వి, "బ్యాంకిని వెన్నుపోటు పొడిచినందుకు నీ కిది సత్కారం, మిస్టర్ సుధాకర్! నువ్వు వేసిన మాస్టర్ ప్లాన్ నాకు వారంరోజుల ముందే తెలుసు! నీ డైరీలోనించి, బ్యాంకి లాకర్స్‌లోని ఎమౌంట్స్, వస్తువులు వివరాలున్న కాగితం జారిపడటం నీకు తెలీదు గాని, మన మెసెంజర్ కైలాసం తెచ్చి భద్రంగా నాకిచ్చాడు.

లాకర్ల వివరాలు నీకెందుకు కావలసివచ్చిందో మొదట నా కర్థంకాలేదు. ఆ వివరాల వెనకనే పాపం, జలంధర్ కంపెనీవాళ్ళ ఆయుధాల వివరాలు, వాటి ధరలు నువ్వు రాసుకున్నావు చూడు, అదే నీమీది అనుమానాన్ని బల పరిచింది.

రాబరీకి యీ రోజే ముహూర్తం పెట్టిన సంగతి మన కైలాసం చెప్పిన మరో సమాచారంవల్ల తెలిసింది. అదే-నువ్వు టెలిఫోన్ వైర్లు తెంచిన సంగతి! అదీ అతనే గమనించాడు: నేను బాత్‌రూంకి వెళ్ళినపుడు! నేను వైర్లు కనెక్ట్‌చేసి వెంటనే పోలీసుకు రిపోర్టిచ్చాను. మీ వాళ్ళు వస్తూనే పోలీసుల చేతుల్లో పడిపోయారు" అన్నాడు.

సుధాకర్‌కు తల కొట్టేసినట్లు అయింది. తల దించుకొని సహచరులతో వెళ్ళి జీప్‌లో కూర్చున్నాడు. □

నీకంటే వాడే నయం!

"మీ ఊరికి రైలు తెప్పిస్తాను. ఇంటింటికి కుళాయి తెప్పిస్తాను. నాకే ఓటువేసి నన్ను గెలిపించండి" అన్నాడు అభ్యర్థి.

"మీకంటె ముందు గెల్చిన ఎం. ఎల్. ఎ. గారే నయం ఆయన మాట ప్రకారం 'విమానం' మా ఊరిపై పోయేట్లు చేశాడు!"

—బాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

దొంగలకు సెంటిమెంట్సుండవు

భమిడిపాటి భాస్కరరామారావు

ఉదయం ఆరు గంటలు.

డిటెక్టివ్ ప్రభాకర్ అతడి అసిస్టెంట్ హరి డైనింగ్ టేబులు ముందు కూర్చునివున్నారు. స్థానిక దినపత్రిక ఉదయం ఎడిషన్‌లోని వార్తలు వినిపిస్తున్నాడు హరి.

జాతీయ అంతర్జాతీయ వార్తలు కొన్ని చదివాక,

"పెండ్లికి మంగళ సూత్రాల నిమిత్తం సబ్సిడీ ధరలో బంగారం అమ్మించడానికి ప్రభుత్వం త్వరలో ఆజ్ఞలు జారీ చేయనున్నదని ప్రధాని ఈ రోజు మా విలేఖరికి తెలియ జేశారు...." అని మరో వార్త చదివాడు హరి.

ప్రభాకర్ కాఫీ తాగుతూ మౌనంగా వినసాగాడు.

ప్రభాకర్ భార్య ఛాయ తనూ ఓ కప్పు కాఫీ తెచ్చుకుని వచ్చింది అప్పుడే. ఆమె వెనుకనే హరి భార్య సుజాత కూడా వచ్చింది.

"సినీమా నుండి తిరిగి వస్తున్న యిరువురు యువతులను అడ్డగించి గుర్తు తెలియని దుండగులు మంగళ సూత్రాలు దోచుకున్నారు. నేరస్థుల కోసం పోలీసులు గాలిస్తున్నారు" మరో వార్త చదివాడు హరి.

"తెల్లవారి లేవడం భయమౌతోంది. అన్నీ దిక్కుమాలిన వార్తలే!" ఛాయ అంది. ప్రభాకర్ కాఫీ ముగించి సిగరెట్ వెలిగించాడు.

"ఆడవాళ్ళ మంగళ సూత్రాల బంగారం కోసం దొంగలు ఎంత పని చేయడానికైనా వెనుదీయడంలేదు. కనుక మంగళ సూత్రాలను పంచలోహాలతో చేయించడం బాగుంటుందా అన్న విషయం పరిశీలించడానికి ఒక కమిటీ వేయాలి" అన్న ఓ ఎమ్.ఎల్.ఏ. పుంగవుని ఉవాచ కూడా చదివాడు హరి.

"కలికాలం! ఆడబ్రతుకు యెంత అధ్వాన్నమౌతోంది! కనీసం మంగళసూత్రం పేరనన్నా చిన్నమెత్తు బంగారం ధరించే దిక్కులేదన్నమాట" భారత గృహిణికి బంగారం మీద నుండే మోజు ధ్వనించింది ఛాయ కంఠంలో.

"నీ దంతా వట్టి చాదస్తం. ఇలాంటి సెంటిమెంట్లు దొంగలకుండవు. వాళ్ళకు కావలసిందల్లా డబ్బు. బంగారం

చూపి స్తే డబ్బు వెంటనే సమకూడుతుంది. దాని విలువ దానిదే!" అప్పటికి మౌనం విడిచి మొదటిసారిగా మాట్లాడాడు ప్రభాకర్.

"ఒక్క దొంగలేనన్న మాటేమిటి? బడా భూస్వాములు, ధనికస్వాములూ కూడా బంగారానికే ఎగబడుతున్నారు. గవర్నమెంటు ఎన్ని సీలింగులు పెట్టినా మసిపూసి మారేడు కాయ చేసి బంగారం నిల్వలు పెంచుకుంటున్నారు" అన్నాడు హరి.

"ఇంతగా బంగారంమీద మోజు పెరడానికి కారణం ఏమిటంటారు?" అడిగింది ఛాయ.

"ఏముంది రోజు రోజుకు వస్తువుల విలువ పెరిగి రూపాయ విలువ పడిపోతోంది. అంటే కొద్ది రోజులకు కోట్ల రూపాయలు కూడా గడ్డిపరక విలువ చెయ్యవన్న మాట. అయితే బంగారానికి మాత్రం విలువ పడిపోవడమన్నది జరుగదు. కనుకనే 'సర్వే జనాః కాంచన మాశ్రయంతి' అనే నానుడి కూడా ఏర్పడింది. పైగా ప్రపంచంలోని ఏ దేశానికి పట్టుకుపోయినా మారకం చికాకులు లేకుండా సొమ్ముచేసిపెట్టగల వస్తువు బంగారం ఒక్కటే. అందుకే ప్రభుత్వాల కన్నుగప్పి అయినా సరే బంగారం చేసుకోవాలనుకుంటారు ఆశ, అవకాశం ఉన్నవాళ్ళు" చెప్పాడు ప్రభాకర్.

హరి ప్రక్కనున్న షెల్ఫ్ నుండి ఒక పేపరందుకుని, "ఇది నిన్నటి పేపరు. ఇందులో వున్న ఈ వార్త వినండి" అని, "మొన్న రాత్రి తొమ్మిది గంటల మధ్య ఆదినారాయణ, రాఘవయ్యగారు కలిసి 'బీచ్ పార్క్ ఇంటర్నేషనల్ హోటల్' జంక్షన్‌లో కార్లాపి, చేతులతో బ్రీఫ్‌కేసులు పట్టుకుని గాఫ్ గ్రౌండ్ కేసి కాలినడకన బయలుదేరారు,

ఒక గంట పోయాక వట్టిచేతులతోనే వెనక్కి తిరిగి వచ్చారు. అప్పుడు వాళ్ళ అవతారాలు గమనిస్తే ఏదో పెద్ద దెబ్బలాట ఆడినవారిలా ఉన్నారు.

గాఫ్‌గ్రౌండ్స్ పరిసరాలలో ఎవరో కొందరు వ్యక్తులు కొట్టుకుంటున్నారని పోలీసుల కెవరో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. పోలీసులు వెంటనే వెళ్ళారు. కాని అప్పటి కక్కడ ఎవరూలేరు.

అంతమాత్రం చేత తృప్తిపడని పోలీసులు దరియాప్తు చేశారు. ఆ రాత్రి, ఆ సమయంలో ఆదినారాయణ రాఘవయ్యగార్లు అటు వెళ్ళినట్లు తెలిసి వారిని ప్రశ్నించారు."

"వాళ్ళేమన్నారు?" మధ్యలో అడిగాడు ప్రభాకర్.

"తామసలటు వెళ్ళలేదన్నారట."

"రెండిటిలో ఏది నిజం?"

"నేనూ దర్యాప్తు చేశాను. బరువైన బ్రీఫ్‌కేసులు మోయలేక మోస్తూ వారాదారిన వెళ్ళినమాట నిజం" చెప్పాడు హరి.

డిటెక్టివ్ ప్రభాకర్ కుర్చీలో వెనక్కి వాలి, కళ్ళు మూసుకుని, ఆలోచించసాగాడు.

హరి అతడి మౌనాన్ని భంగపరుస్తూ "బాస్! వాళ్ళ నెవరైనా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారేమో?" అన్నాడు.

"ఎందుకొచ్చింది నీ కా అనుమానం?"

"వీళ్ళు బాగా బలిసినవాళ్ళు. బంగారం స్మగ్లింగ్ చేస్తారని రకరకాల పుకార్లున్నాయి. నిప్పులేందే పొగరాదు కదా? వీళ్ళ ఆయువుపట్టేదో మరొకరికి తెలిసివుండాలని నా ఊహ. లేకపోతే ఆ రాత్రి వ్యవహారం గురించి వాళ్ళెం దుకు కబద్ధమాడాలి?"

"కేవలం ఊహాగానాలవల్ల ప్రయోజనం లేదు హరీ.

కాకపోయినా యిప్పుడు మనం చర్చిస్తున్నది కేవలం పేపరు వార్తల ఆధారంగా. నీవనుకుంటున్నట్టు వాళ్ళ దగ్గర దొంగ బంగారం నిల్వ ఉన్నదే అనుకో. మన కెందుకు? ఆ వ్యవహారం ప్రభుత్వం చూసుకుంటుంది. ప్రస్తుతం అది మన కనవసరం...." అని ప్రభాకర్ ఇంకా ఏమో అనబోతున్నంతలో రివ్వున సుడిగాలిలా దూసుకుంటూ కామాక్షి లోపలకు పరుగెత్తుకు వచ్చింది.

కామాక్షి ఫణిభూషణంగారి కూతురు. ఫణిభూషణం గారు పేరుప్రతిష్ఠలు దండిగా వున్న కోటీశ్వరుడు. కామాక్షి సుజాతకు స్నేహితురాలు. బి.ఏ. వరకూ ఇద్దరూ కలిసి చదువుకున్నారు. సుజాతకు హరితో పెళ్ళయి చదువు విరమించుకుంది. కామాక్షి పోస్టుగ్రాడ్యుయేషన్ చెయ్యడానికి యూనివర్సిటీ మెట్టెక్కింది.

వెనుక ఎవరో తరుముకొస్తున్నంత కంగారుగా పరుగెత్తుకుని వచ్చి ఆయాసంతో కూలబడిన కామాక్షి వైపు ఆందోళనగా నడిచి వీపుని నిమరసాగింది సుజాత. ప్రభాకర్ అటు చూచి, "ఏమ్మా కామాక్షీ! చాలా ఆందోళనగా కనిపిస్తున్నావు?" అని అడిగాడు.

"ఇల్లు కదిలితే కాళ్లు విరగొడతానన్నారు మా నాన్న" కామాక్షి జవాబు.

"కంగారుపడకమ్మా! తాపీగా చెప్పు."

కామాక్షి గాబరా అణచుకుందుకు ప్రయత్నిస్తూ, "ఏం వచ్చిందో తెలియదు. నిన్న సాయంకాలం ఒక్కసారి నా మీద విరుచుకుపడి, బరబరా నన్ను నా గదిలోకి ఈడ్చుకు వెళ్ళి బయటనుండి తలుపు మూస్తూ, 'ఇంతవరకూ వెలగబెట్టింది చాల్లే! ఇక గుమ్మం కదిలావంటే కాళ్ళు విరగ్గొడతాను' అని తలుపు తాళంపెట్టారు. నేను ఎంతగా అరచినా

విపిపించుకోలేదు. 'ఏమిటండీ!' అంటూ అడ్డు వచ్చిన మా అమ్మను కూడా కసిరి కొట్టారు."

"ఇంతకూ నీ తప్పేమిటి?"

"నాకేం అర్థం కాలేదండి. నేను కాలేజీ నుండి ఇంటికి వచ్చే వేళకే ఒక కవరు తెరచి ఉత్తరం చదువుతున్నారు. నేను మామూలుగానే మా నాన్నగారిని 'ఎక్కడి నుండి నాన్నారూ ఉత్తరం?' అని అడిగాను. ఆయన జవాబు చెప్పడం మాట దేవుడెరుగు, అగ్గిరాముడిలా మండిపడి నన్ను గదిలో బంధించారు. ఇవాళ ఉదయం బాత్‌రూమ్‌కి వెళ్ళడానికి మా అమ్మ తలుపు తెరిచింది. నేను బాత్ రూంకు వెళ్ళినట్టే వెళ్ళి పిల్లిలా తిరిగివచ్చి మా నాన్నగారి డ్రాయరు తెరిచి పైనే వున్న కవరు సంగ్రహించి యిలా పరుగెత్తుకొచ్చాను" కవరందించింది కామాక్షి.

కవరందుకున్నాడు ప్రభాకర్. అదో గులాబీ రంగు కవరు. పోస్టు ముద్రలనుబట్టి అ ఊళ్ళోనే పోస్టు చెయ్య బడ్డట్టు గ్రహించాడు. కవరు తెరిచాడు. లోపల ఒక ఉత్తరం మరో కార్డుసైజు ఫోటో వున్నట్టు గమనించాడు. ముందుగా వుత్తరం బయటకు తీశాడు.

"మిస్టర్ ఫణిభూషణం

నీ ఎత్తుగడలతో ప్రభుత్వం కళ్ళు గప్పగలవేమో కాని యీ 'కాలచక్రం' కళ్ళు కప్పలేవు. ప్రభుత్వం అనుమతించిన పరిమితికి మించిన బంగారం నీ దగ్గర వుందన్న విషయం నాకు తెలుసు. ఎలా తెలుసన్న విషయం నన్నడక్కు. ఎంతుందో చెప్పమంటావా లేక ఈ వుత్తరం అందిన వెంటనే అది నా కందచెయ్యడానికి నిశ్చయించు కుంటావా? ఆలోచించుకో.

ఈ ఉత్తరం పుచ్చుకుని ప్రభుత్వ సహాయంకోసం

నువ్వెల్లాగూ పోలేవు. అది నాకు తెలుసు. ఇదేదో పిచ్చి వాని వ్రాత క్రింద జమకట్టేదామనుకుంటున్నావేమో! ఆ పప్పులేం వుడకవు. ఇందుతోబాటే ఒక ఫోటో పంపిస్తున్నాను. చూచి ఆనందించు.

ఈ వుత్తరం నీకీ రోజు సాయంకాలం టపాలో అందుతుంది. రేపు రాత్రి పదిగంటలకు నీ దగ్గర పరిమితికి మించి వున్న బంగారం (నీ తల్లి బంగారం నాకక్కర లేదు. నీ దగ్గరి నల్లబంగారం అంతా బిస్కట్ల రూపంలో వుంది. అ బిస్కట్లమీద 'సనాయ్' దేశపు ముద్రలుంటాయి. ఈ వైనాలు చాలనుకుంటాను.) బ్రీఫ్‌కేసులో పేర్చుకుని 'బీచ్‌పార్క్ ఇంటర్నేషనల్ హోటల్' దరినున్న గాఫ్ గ్రౌండ్స్ ఈశాన్యభాగంలో నిలబడు. మా మనిషి కారులో వస్తాడు.

వచ్చిన వ్యక్తిని 'టైమెంతయింది మాష్టారూ?' అని అడుగు. 'సూర్యోదయాని కింకొక్క ఘడియే వుంది,' అని జవాబు చెపుతాడు. అతడే నా మనిషి. మారు మాటాడకుండా బ్రీఫ్‌కేసు అతడి కందించు. మరునాటి టపాలోనే ఈ ఫోటో తాలూకు నెగిటివే కాక, నీవు దొంగ బంగారం సంపాదించిన వివరాల తాలూకు రుజువుల ఒరిజినల్స్ కూడా నీకు చేరతాయి. జాగ్రత్త సుమా! పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే నీ ముద్దుల కూతురు బ్రతుకు బజారుపాలు కావడమే కాక, ప్రభుత్వాధికారులు వేట కుక్కలవలె నీ వెంట పడతారు.

—కాలచక్రం."

అని వుంది వుత్తరంలో.

కవరులో వున్న ఫోటో బయటకు తీశాడు ప్రభాకర్. ఆ ఫోటోలో కామాక్షి ఒక చెట్టుకొమ్మమీదకు వెనక్కి

వంగి వుంది. ఆమెపైన వంగి మరొక పురుషుని ఫోటో వుంది. పురుషుని ఫోటో సైడు పోజులో ముఖం కాస్త ఆ వైపుకు తిప్పి వుండడంతో అతడెవరన్నది పోల్చడానికి వీలులేకుండా వుంది. ఆ ఫోటో తాలూకు బ్యాక్‌గ్రౌండ్ సీనరీనిబట్టి భీమిలి నృసింహస్వామి ఆలయ ప్రాంతాల తీసినదై వుండవచ్చని ఊహించాడు ప్రభాకర్.

ఫోటోలోంచి తలయెత్తి కామాక్షివైపు చూచాడు ప్రభాకర్.

"ఆ ఫోటో ఎలా వచ్చిందో నాకు తెలియదండి. నన్ను నమ్మండి" కామాక్షి కంఠస్వరం సిగ్గుతో వణికింది.

"అదేమిటమ్మా అలా అంటావు. ఈ ఫోటో భీమ్లిలో తీసినట్టు కనిపిస్తుంటేను?"

"నా ఉద్దేశ్యం మీ కర్థం కాలేదండి. నేను నా స్నేహితురాళ్ళు కలిసి భీమ్లీలో పిక్నిక్ వెళ్ళినప్పుడు మేమందరం అదే స్థలంలో అదే పోజుతో ఫోటోలు దిగాం. కాని ఇలా ఎవరో పురుషునితో మాత్రం కాదు. మా అందరి ఆల్బంస్ లోనూ కాపీ లున్నాయి. మీరు దరియాప్తు చేసి రుజువు చేసుకోవచ్చు. ఇదెలా వచ్చిందో నా కయోమయంగా వుంది" కళ్ళ వెంబడి నీరు కారుతోంది కామాక్షికి.

"అయితే ఈ ఫోటో అబద్ధమా?"

"మీ రా వుత్తరం చదివారు కదా! ఎవడో దుర్మార్గుడు మా నాన్నగారి నుండి బంగారం సంగ్రహించడానికి యీ ఎత్తువేసి వుంటాడు. మా నాన్నగారు దీనికి భయపడి బంగారం అప్పచెప్పినా వాడి దాహం తీరుతుందని యేముంది? మీరు కలగ జేసుకోవాలి" అర్థించింది కామాక్షి.

"మీ నాన్నగారి దగ్గర సీలింగుకి మించి బంగారం

వున్నట్లుగా అర్థమౌతోంది ఈ వుత్తరాన్నిబట్టి. ఆయన నాతో సహకరించకపోవచ్చు."

"ఏ మార్గానఅయినా మా నాన్నగారిని లొంగదియ్యండి. బ్లాక్ మెయిలర్ ఆట కట్టించండి. ఈ గొడవతోనైనా మా నాన్నగారు న్యాయమార్గస్థుడు కావచ్చు."

2

"ఈ విషయం మీ దాకా ఎల్లాగా వచ్చింది. ఇప్పుడు మీరు నాకో సాయం చేయాలి" చెప్పాడు ఫణిభూషణం.

"నేను వచ్చినదే అందుకు. చెప్పండి ఏం చెయ్యాలో" అడిగాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"ఈ విషయం మీ కనవసరమని ఊరుకోండి. మీరు కలగజేసుకోవడంవల్ల మాకే నష్టం" నిష్కర్షగా చెప్పాడు ఫణిభూషణం.

"మీ దగ్గర దొంగబంగారం వున్నట్టు మీ మాటలను బట్టే తెలుతోంది. మేము ప్రయత్నించి కూడా మీ దొంగ బంగారం నిల్వలు బయటపెట్టలేకపోవచ్చు. కాని మీరు ఎవ రిదో బెదిరింపుకు లొంగితే ఇంతటితోనే అతడి ఆశ తీరు తుందని గ్యారంటీ ఏమీలేదుకదా! మీరిలా బ్లాక్ మెయిలర్‌కు లొంగడం బాగాలేదు."

"అతడు నా కూతురుకు సంబంధించిన వెధవపని నిరూ పించే ఆధారం సంపాదించాడు. ఇంతవరకూ నా కూతు రెంతో బుద్ధిమంతురాలనుకున్నాను."

"అంటే మీ కూతురుమీద మీకు నమ్మకం లేదన్న మాట?"

"ఇంతవరకూ వుండేది."

"ఫణిభూషణంగారూ! కామాక్షి మాటమీద మీకు

నమ్మకం లేకపోవచ్చు. నాకుంది."

"ప్రత్యక్ష సాక్ష్యమైన ఆ ఫోటో మాట ఏమిటి?"

"ఒక తండ్రి అడగవలసిన ప్రశ్న అదికాదు. నేను పరిశీలించాను. అది కేవలం ట్రిక్ ఫోటో."

"అది నిజమా? అయితే నన్నిప్పుడేం చెయ్యమంటారు?"

"మీ దగ్గర వున్నది 'సనాయ్' దేశపు ముద్రలున్న బంగారం. అది మీరెలా సంపాదించారో చెప్పండి చాలు."

"బోయపాలెం టర్నింగు దగ్గరకు ఒక వ్యక్తి వస్తూ వుంటాడనీ అతడి దగ్గర చౌకధరలో స్వచ్ఛమైన బంగారం దొరుకుతుందనీ ఒక మిత్రుడు చెప్పాడు."

"ఎవరా మిత్రుడు?"

ఫణిభూషణం చెప్పడానికి సందేహించాడు.

ప్రభాకర్ అది గమనించి "ఫణిభూషణంగారూ! మీ దగ్గర పరిమితికి మించిన బంగారం ఎంత వుందో సరిగ్గా చెప్పగలిగాడు కాలచక్రం. అవునా? అంటే మీకు దొంగ చాటుగా బంగారం అమ్మిన వ్యక్తే ఆ కాలచక్రం కావచ్చు. మీరు సందేహించి ప్రయోజనంలేదు" అన్నాడు.

"నాకు చెప్పిన వ్యక్తి ఆదినారాయణ."

"సరే! మిగిలిన విషయాలు నేను చూసుకుంటాను. మీకు రాగల భయం ఏమీలేదు."

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటారు?"

"కాలచక్రం కోరినట్టు అతడికీ రాత్రి బంగారం అందించండి."

ఓ

"ఏమిటంత అర్జంటుగా రమ్మని ఫోన్ చేశావు?" వస్తూనే అడిగాడు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ.

"ఈ రోజు రాత్రికి నీకు చేతినిండా పని" చిరునవ్వు నవ్వుతూ చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్.

నెత్తిమీది హ్యాట్ బల్లమీద పెట్టి, కూర్చుని, కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ, "నువ్వు పిలిపించావంటేనే చేతి నిండా పని. ఇంతకూ ఏమిటో చెప్పావు కాదు" అన్నాడు రామకృష్ణ.

"హరీ! ఆ ఉత్తరం తాలూకు కాపీ మన రామకృష్ణ కియ్యి."

ఒక బాండ్ పేపరుమీద టైపుచేసిన ఉత్తరం తెచ్చి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కందించాడు హరి. రామకృష్ణ దాని నందుకున్నాడు.

"పైకే చదువు. మేమూ వింటాం" చెప్పాడు ప్రభాకర్.

ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఇలా చదివాడు—

"మిష్టర్ రంగనాథం,

'ఆపిల్' ఉపగ్రహం పేరు విన్నావు కదూ? అదేం చేస్తుంది? ఈ భూమండల గర్భంలో ఎక్కడెక్కడ ఏమేమి నిక్షిప్తమై ఉన్నాయో తరచి తరచి లోతులకంటా చూపులు పరపి పరపి రహస్య నిక్షేపాల గుట్టు బట్టబయలు చేస్తుంది—తెలుసు కదా!

మరి ఈ 'సూపర్ ఆపిల్' ఏం చేస్తాడో తెలుసా? చెపుతా విను. ఎవరెవరి దగ్గర ఎంతెంత బంగారం నిల్వ లున్నాయో తెలుసుకుంటాడు. అందులో తెలుపెంత నలు పెంత అన్న ఆరాలు అతడికి కరతలామలకాలు.

రంగనాథం నువ్వూ తక్కువ వాడివి కాదు. ఈ మధ్య కాలంలో నువ్వెవరెవరినైతే బ్లాక్‌మెయిల్ చేసి బంగారం కాజేశావో నాకు తెలుసు. వాళ్ళచేత ఆ దొంగబంగారం

కొనిపింపజేసిన ఘనుడవు నీవేనన్న సంగతి కూడా నాకు తెలుసు. రంగనాథం! ఇప్పుడిదంతా యెందుకో తెలుసా? నువ్వు అక్రమంగా ఆర్జించిన ఆ బంగారంలో సగం నా పరం చెయ్యాలి. అలా చెయ్యనినాడు నిన్నెక్కడికి పంపుతానో అక్కడికి పంపిస్తాను.

అందుకు నువ్వు చెయ్యవలసిందేమిటో తెలుసా? చెపుతా విను. నువ్వు దొంగ బంగారాలందుకున్న గాఫ్ గ్రౌండ్స్‌కు ఉత్తరంగా కిలో మీటరు దూరంలో జీడితోట వుంది. అక్కడకు ఈ రాత్రి వచ్చి నన్ను కలుసుకో. లేదా నీ మనుషులను పంపించు. నేనే నీ దగ్గరకు వస్తాను. బేరం ఫయినల్ చేసుకుందాం.

అర్థమైంది కదూ? నీ దగ్గర కండలు తిరిగిన దండి మగలున్నారన్న సంగతి నాకు తెలుసు. నాతో మాట్లాడకుండానే నన్ను దారి తప్పించాలని ప్రయత్నిస్తే నీ ఆశలన్నీ అడియాసలవుతాయి. మరచిపోవు కదూ?

—సూపర్ ఆపిల్."

అని ఉత్తరం అంతా చదివి, 'ఏమిటిదంతా' అన్నట్టు ప్రభాకర్‌వైపు చూచాడు రామకృష్ణ.

కామాక్షి తన దగ్గరకు రావడం, తాను ఫణిభూషణంతో మాట్లాడడం, కాలచక్రం అన్న వ్యక్తి బంగారం అపహరించడానికి పన్నిన పన్నాగం, మొదలగు వివరాలు చెప్పి,

"రామకృష్ణా! నేను సేకరించిన సమాచారం ఆధారంగా ఫణిభూషణాన్ని ప్రశ్నించాను. పరిమితికి మించి బంగారం వున్నవాళ్ళ రహస్యం రూఢిగా ఎవరికి తెలుస్తుంది? వాళ్ళకా బంగారం అమ్మిన వాళ్ళకుగాని దొరికేచోటు చెప్పిన స్నేహితులకు కాని తెలుస్తుంది, అవునా?" అని,

అప్పుడు నేనేం చేశానో తెలుసా? సరిగ్గా ఇల్లాంటి ఉత్తరం ఆదినారాయణకు వ్రాశాను. ఉత్తరంలో నే నాజ్ఞాపించిన రీతిగా ఆదినారాయణ నురుగులు గక్కుకుంటూ వచ్చాడు పట్టి చేతులతో. నేను గద్దించాను. అతడేమన్నాడో తెలుసా? 'మిష్టర్ సూపర్ ఆపిల్' నన్ను నమ్మ. నా దగ్గర వున్న బంగారం అంతా ఇప్పటికే కాలచక్రం చేజిక్కించు కున్నాడు.' అని కాళ్ళమీద పడ్డాడు.

అతణ్ణి అదరగొట్టి బెదరగొట్టి రాబట్టిన పేరు రాఘ వయ్యది. రాఘవయ్య ద్వారా రంగనాథం పేరు బయట పడింది. ఇప్పుడు నా అస్త్రం రంగనాథం మీద ప్రయోగిస్తు న్నాను. నా ఊహ కరక్టే అయితే ఇంతటితో యీ కేసు తేలిపోతుంది" అన్నాడు ప్రభాకర్.

"అయితే ఈ రాత్రికి నువ్వా జీడితోట దగ్గరకు వెడ తావు. అవునా? నా మందీ మార్బలాన్ని వెంటపెట్టుకుని రమ్మంటావా నీతో."

హరికి రామకృష్ణకు వా రా రాత్రి చెయ్యవలసిన పని చెప్పి, "ఈ రాత్రి నా కెదురయ్యే వ్యక్తులు నన్నక్కడి కక్కడే కాల్చి చంపడానికి ప్రయత్నించవచ్చు. నేనూ తగిన జాగ్రత్తలోనే వెడతాననుకో. అయినా వాళ్ళు నా వైపు కాల్పులు జరిపి వారి వాహనంలో పారిపోవచ్చు. అప్పుడు మీరిరువురూ వాళ్ళను వెంబడించి వాళ్ళ స్థావ రంలో ప్రవేశించి వాళ్ళ ఆట కట్టించాలి. అలా కాక వాళ్లు తమ వాహనంలో నన్ను వెంటపెట్టుకుపోవచ్చు. అప్పుడు మీరా వాహనాన్ని సావకాశంగా వెంటాడవచ్చు" అన్నాడు ప్రభాకర్.

"ఎలా?" అడిగాడు రామకృష్ణ.

డిటెక్టివ్ ప్రభాకర్ టేబుల్ సొరుగు నుండి అర్ధ

రూపాయ కాసంత బిళ్ళ ఒకటి తీసి బల్లమీద పెట్టాడు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ వింతగా వున్న ఆ బిళ్ళవైపు కుతూహలంగా చూడసాగాడు.

"రామకృష్ణా! ఇది మినియేచర్ ట్రాన్స్‌మిటర్. దీని తాలూకు రిసీవర్ నా కారు డాష్‌బోర్డులో వుంటుంది. ఆ విషయం హరికి తెలుసు. ఈ బిళ్ళ నా దగ్గర ఉన్నంత వరకూ నేను ఎటువైపు వెడుతున్నానన్నది నా కారులో తెలుస్తూనే వుంటుంది" అన్నాడు ప్రభాకర్.

4

శ్రావణ మాసపు తొలిదినాలు. చీకటికి సైదోడుగా ఆకాశం అంతటా ఆవరించిన కారుమేఘాలు. ఈదురుగాలి. దానికి తోడుగా సముద్రపు హోరు.

గాఫ్ గ్రౌండ్సుకు ఉత్తరంగా ఉన్న జీడితోట దగ్గర రోడ్డువారగా నిలబడి ఉందొక ఆకారం. బట్టతల, చెంపల వరకూ సాగిన సైడ్‌లాక్స్. బుర్రమీసాలు. పరిసర గాఢాంధకారంలో కలిసిపోతున్నరంగులో ఫుల్‌సూట్. తళుక్కున మెరుపులో కనబడ్డ ఆ ఆకారం రూపమది.

చప్పున దూసుకుంటూ వచ్చి అతడి ముందాగిందొక మెటడోర్ వ్యాన్. వ్యాన్ తలుపు తెరుచుకుని దిగారిద్దరు దృఢకాయులు.

"మిష్టర్ ఎవరు నువ్వు?" అడిగాడొక దృఢకాయుడు.

"అదే నేనూ అడుగుతున్నాను" గర్జించాడు సూట్‌వాలా.

దృఢకాయు లిద్దరూ చీకటిలోనే ఏవో సంజ్ఞలు చేసుకున్నారు. చివరకు, "కాలచక్రం ఆగదు" అన్నా డిద్దరిలో ఒకడు.

"సూపర్ ఆపిల్ చూస్తూ ఊరుకోదు" సూట్‌వాలా జవాబు.

దృఢకాయు లిద్దరూ చటుక్కున పిస్తోళ్ళు గురిపెట్టారు. అప్పటికే చీకటిలో చూడడాని కలవాటుపడ్డ సూట్‌వాలా, "మిస్టర్స్! మీలో ఎవరూ కాలచక్రం కాదు. నన్ను యిక్కడికిక్కడే కాల్చడంవల్ల మీ బాస్ తీవ్రంగా నష్టపోవడమే కాక చిక్కులలో ఇరుక్కుంటాడు" తొణుకూ బెణుకూ లేకుండా చెప్పాడు.

ఇద్దరూ పిస్తోళ్ళు దించారు ఆ మాటతో. "కమాన్ మిష్టర్ సూపర్ ఆపిల్!" అన్నా డిద్దరిలో ఒకడు. సూట్‌వాలా అనుసరించాడు.

దృఢకాయులలో ఒకడు వ్యాన్ వెనుక తలుపు తెరిచాడు. మారుమాట్లాడకుండా ఎక్కి కూచున్నాడు సూట్‌వాలా. తన వెనుకనే వ్యాన్ తలుపు తాళం పెట్టినట్టు గ్రహించాడు శబ్దాన్నిబట్టి. లోపల భాగంలో చుట్టూ చూశాడు. నలుపురంగు గ్లాసెస్ బిగించివున్నాయి వ్యాన్‌కు. నిశ్చింతంగా అక్కడ వున్న సీట్లో కూచున్నాడు సూట్‌వాలా.

జీడితోటలో గుబురుగా ఎదిగిన జీడిచెట్టు చాటున కారునానుకుని నిలబడ్డ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వ్యాన్ బయలుదేరిన శబ్దం విని, హరి నుద్దేశించి, "హరీ! మన గురుడు వాళ్ళతో బయలుదేరి నట్టుంది. హర్రీఅప్!" అని కారెక్కాడు.

హరి డ్రయివింగు సీటులో కూచుని, డాష్‌బోర్డు తెరిచి, అందులో వున్న రిసీవర్ యాక్టివేట్ చేశాడు. ఒక గుండ్రని డయల్ వంటి పరికరంలోని పైభాగంలో పచ్చచుక్క ఒకటి వెలుగుతూ స్థిరంగా నిలిచివుంది. మరొక యెర్రచుక్క క్రమక్రమంగా పచ్చచుక్కకు దూరమవుతూ కనిపించింది. ఆ ఎర్రచుక్క శత్రువుల కారును సూచించేదని

అర్థం చేసుకున్నాడు ఇనస్పెక్టర్ రామకృష్ణ.

కారు స్టార్ట్ చేశాడు హరి వెనుక నున్న పోలీస్‌వ్యాన్ కూడా బయలుదేరింది.

కారు స్పీడు అరవై వరకూ పెంచాడు హరి డయల్‌లో కదులుతున్న ఎర్రచుక్క స్థిరంగా నిలిచివున్న పచ్చచుక్కకు దగ్గర కాసాగింది.

ఎర్రచుక్క చటుక్కున ఎడమకు తిరిగినట్లు గుర్తించాడు హరి. డయల్లో చుక్కల మధ్యదూరాన్నిబట్టి ముందు పోతున్న కారు ఎంత దూరంలో ఎడమకు తిరిగిందో అంచనా వేసి తనుకూడా ఎడమప్రక్క రోడ్లోకి తిప్పాడు కారు.

ఎర్రచుక్క పచ్చచుక్కకు రానురాను దగ్గరవసాగింది. హరి నడుపుతున్న కారు మరికొంత ముందుకు పోగానే తిరిగి డయల్‌వైపు చూచి చటుక్కున కారాపాడు హరి. అప్పుడు డయల్లో రెండుచుక్కలూ ఒకదానిలో ఒకటి చెరి సగం కనిపిస్తూ కలిసిపోయివున్నాయి.

హరి కారెందుకు ఆపినదీ రామకృష్ణకు అర్థంకాలేదు.

"మనం రావలసిన చోటుకు వచ్చాం" చెప్పాడు హరి.

రామకృష్ణ డయల్‌వైపొక మారు చూచి, ముందుకొక మారు చూచి, "అయితే మనం వెన్నాడిన కారెక్కడా కనిపించదేం?" అన్నాడు.

ఇంతలో వెనుక పోలీస్ వ్యాన్ ఆగిన చప్పుడు కూడా అయింది.

హరి తిరిగి డయల్‌వైపు మరోమారు చూచి, "ఇక్కడే ఎక్కడో ఎడమవైపు నున్న ఏ యింటి ఆవరణలోకో మళ్ళివుండాలి మనం వెన్నాడిన కారు" అంటూ కారు దిగాడు.

"వెల్కమ్ మిష్టర్ సూపర్ ఆపిల్! నిన్ను యిక్కడి కిక్కడే అంతంచేస్తే నీకు దిక్కెవరు?" వికటంగా నవ్వుతూ అడిగాడు అతను.

సూపర్ ఆపిల్ ఆ హాలు నలుమూలలా చూచాడు. ఏ క్షణాన మీదపడి పీక్కు తిందామా అని చూస్తున్న తోడేళ్ళలా నిలబడి వున్నారు గూండాలు.

తిరిగి తన్ను ప్రశ్నించిన వ్యక్తి వైపు దృష్టి సారించి, "మిష్టర్ కాలచక్రం! నోనో! మిష్టర్ రంగనాధం! ఆలోపుగా నీ పనేమవుతుందో చూచుకో!" గంభీరంగా అన్నాడు.

వికటంగా మరొకమారు నవ్వి, ప్రక్కనే వున్న అనుచరుడికి సంజ్ఞ చేశాడు కాలచక్రం ఉరఫ్ రంగనాధం.

ఆ అనుజ్ఞకోసమే ఎదురుచూస్తున్న అనుచరుడు సూపర్ ఆపిల్ వైపు చిరుతపులిలా దూకాడు. ఆ ఊపులో అతడు తనమీద పడితే తట్టుకోవడం కష్టమని అర్థం చేసుకున్నాడు సూపర్ ఆపిల్. కనురెప్పపాటు కాలంలో ఒక్కడుగు ప్రక్కకు వేశాడు. అయినప్పటికీ రంగనాధం అనుచరుడు మీద పడనేపడ్డాడు.

చాపచుట్టలా నేలమీద పడ్డారిద్దరూ. పైచేయి కోసం పెనుగులాడసాగారిరువురూ. అనుచరుడి శక్తిమీద అమోఘమైన విశ్వాసం వున్న రంగనాధం వినోదంగా చూడసాగాడు.

ఆ పెనుగులాటలో సూపర్ ఆపిల్ పెట్టుడు బట్టతల, మీసం ఊడిపడ్డాయి. రంగనాధం అనుచరుడిని మెడమీద ఒక్కటి చరచి తనదే పైచేయనిపించుకున్నాడు సూపర్ ఆపిల్.

లేచి నిలబడ్డ సూపర్ ఆపిల్ వైపు ఆందోళనగా చూగాడు కాలచక్రం ఉరఫ్ రంగనాధం.

"అ! నువ్వు.... నువ్వు డిటెక్టివ్ ప్రభాకర్‌వన్నమాట. ఫణిభూషణం కూతురు నిన్ను కలిసింది. కాని ఫణిభూషణం మామూలుగా ఏ మడతపేచీ లేకుండా బంగారం నాకందజేయడంతో నీదాకా రాలేదనుకున్నాను. సూపర్ ఆపిల్ నువ్వనుకోలేకపోయాను. ఇక నువ్వు ప్రాణాలతో బయటపడడం నాకు ప్రమాదం! భగవంతుణ్ణి చివరిసారిగా ప్రార్థించుకో!" ప్రభాకర్ వైపు రివాల్వర్ గురిపెట్టాడు రంగనాధం.

6

కారు దిగిన హరి ఈ వైపు ఆ వైపు చూస్తూ, ఎడమ ప్రక్కనున్న ఒక గేటువైపు వచ్చాడు.

ఆ గేటు చాలా ఎత్తుగా వుంది. లోపల దూరంలో పెద్ద భవనం ఉన్నట్టు గుర్తించాడు.

నలుమూలలా పరకాయిస్తున్న హరిమీద దబ్బున పడ్డాడొక వ్యక్తి. హరి అతడి నొక్క విదిలింపు విదిలించి రివాల్వర్ మడమతో నెత్తినొక్క మొత్తు మొత్తాడు. ఈ సందడిలో మరో వ్యక్తి హరిమీద దూకబోయాడు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అతడిని మధ్యలోనే యెదుర్కొని పడగొట్టాడు. వెనుక నున్న పోలీసులా ఇరువురినీ బంధించారు.

రామకృష్ణ, హరి పోలీసులు వెంటరాగా గేటు తెరుచుకుని భవన ముఖద్వారం దగ్గరకు చేరుకున్నారు. తలుపులు నెట్టారు. తెరుచుకోలేదు. లోపలవైపు నుండి తాళం వేయబడ్డట్టు గ్రహించారు.

సరిగ్గా అదే సమయానికి, 'నువ్విక్కడ నుండి ప్రాణా

లతో బయటపడడ....' అంటున్న రంగనాధం పలుకులు హరి చెవుల పడ్డాయి. తన బాస్ ప్రమాదంలో ఉన్నాడని అర్థమైంది హరికి.

తలుపుమీద విరుచుకుపడ్డాడు. బలం అంతా వుపయోగించినా తలుపు ఏ మాత్రం బెసకలేదు. ఇది పని కాదనుకుని క్షణం ఆలస్యం చెయ్యకుండా రివాల్వర్ తీసి తాళం కన్నానికి గురిపెట్టారు.

"ఢాం!!!" తెరుచుకున్న తలుపుగుండా బిలబిలమంటూ పోలీసులు వెంటరాగా లోపల కడుగు పెట్టారు హరి, రామకృష్ణ.

ఎదురుగా పొగలు గక్కుతున్న రివాల్వర్ చేతపట్టుకుని నిప్పులు కక్కుతున్న డిటెక్టివ్ ప్రభాకర్. రక్తం ఓడుతున్న కుడిచెయ్యి ఎడమచేత పట్టుకుని రంగనాధం. అతడి కాళ్ళదగ్గర అతడి రివాల్వర్.

"జాగ్రత్త! ప్రాణాలమీద ఆశ వుంటే అక్కడే ఆగండి. గుడ్డిగా ముందు కడుగేసిన ప్రతీ ఒక్కని గతీ యింతే!" పిడుగులు కురిపించాడు ప్రభాకర్.

తమ బాస్ పాటు చూచి కుతకుత లాడుతున్న రంగనాధం అనుచరులందరూ ఒక్కుమ్మడిగా ముందు కురకబోయారు.

'ఢాం! ఢాం! ఢాం! ఢాం!' ఏకకాలంలో గర్జించాయి అప్పుడే లోపల కడుగుపెట్టిన హరి, రామకృష్ణల రివాల్వర్లు. రంగనాధం అనుచరులు నలుగురు నేల కూలారు.

"జాగ్రత్త! ఇంకెవరు దుస్సాహసం చేసినా యిదే గతి!" హెచ్చరించాడు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ.

రామకృష్ణ ఆజ్ఞాపించగా అక్కడ వున్న అనుచరు

లందరినీ కష్టడీలోకి తీసుకున్నారు అతడి వెంట వచ్చిన పోలీసులు.

ఇనస్పెక్టర్ రామకృష్ణ, రంగనాథం వైపు కదల బోయాడు.

అంతలో రంగనాథం శ్లాక్ కాలరుకున్న ఒక ఎర్రని బొత్తం చటుక్కున తెంపి పళ్ళ మధ్య వుంచి కటుక్కున కొరికాడు. నురుగులు కక్కుతూ నేలకూలాడు రంగ నాథం.

"పూర్ ఫెలో! సయనైడ్ కాప్సూల్స్ కొరికాడు" అని, "రామకృష్ణా! ఈ ఇల్లంతా మూల మూలలా పరిశోధించు. మణుగులకొద్దీ బంగారం బయటపడుతుంది" అని హరి వెంట రాగా బయట కదుగేశాడు డిటెక్టివ్ ప్రభాకర్. □

విగ్రహం వయసు!

ఓ మ్యూజియంలో ఓ గైడు ఓ పురాతన విగ్రహాన్ని యాత్రికులకు చూపుతూ, "ఈ విగ్రహం వయసు 2000 సంవత్సరాలు" అన్నాడు.

"తప్పు! 2005 సదివంత్సరాలు" అన్నాడు యాత్రికుడు-

"అంత ఖచ్చితంతా ఎలా చెప్పగలవు?" కోపంతో అటి గాడు గైడు.

"ఐదు సంవత్సరాల క్రితం నేను మ్యూజియం చూడ్డానికి వచ్చినప్పుడు-అప్పుడు దీని వయస్సు 2000 సంవత్సరాలని అన్నావు!"

—చాగాపురం నాగేశ్వరరావు, గద్వాల.

కిడ్నాపర్స్ గ్యాంగ్

వసుంధర

అతడి పేరు విశ్వంభరం. వయసు యాభై అయిదు. తెల్లటి మీసాలు, జుత్తు! మనిషిని చూడగానే ముసలివా డనిపిస్తుంది. అతడికి పెళ్ళయింది. భార్యాబిడ్డ లున్నారు. కూతురికి మంచి సంబంధమే చేశాడు. కొడుకులిద్దరూ మంచి ఉద్యోగాల్లో వున్నారు. భార్య కొన్నాళ్ళు పెద్దకొడుకు

దగ్గరా, కొన్నాళ్ళు చిన్నకొడుకు దగ్గరా వుంటూంటుంది.

కొడుకులు తమవద్దకు వచ్చి ఉండవలసిందిగా విశ్వంభ రాన్ని అడుగుతూంటారు. కానీ చిన్నప్పట్నించీ ఆయన తరహా వేరు. ఇంట్లో అందరి సరదాలూ, అవసరాలూ తీరగా మిగిలిన డబ్బు తను ఖర్చు చేసేవాడు. నిలవల గురించి యెప్పుడూ ఆలోచించేవాడు కాదు. క్లబ్బులూ, నైట్‌క్లబ్బులూ ఆయన హాబీ! పేకాట, ఆడవాళ్ళు ఆయన అవసరం!

యాభై అయిదేళ్ళొచ్చినా యిప్పటికీ ఆయనకా అవసరా లలాగే వున్నాయి. సంసారం కంటె వీటితోనే ఆయన జీవితం ఎక్కువగా ముడిపడింది.

విశ్వంభరం దగ్గర డబ్బెప్పుడూ నిలవుండదు. కానీ ఆ విషయం యెవ్వరికీ తెలియదు. యెందుకంటే యెంత డబ్బు అవసరమైనా ఆయన అప్పటికప్పుడు ఎలాగో పట్టుకొచ్చే వాడు. ఆయన యెక్కడో డబ్బు దాస్తున్నాడనే భార్య అను కునేది. పేకాటలో తను బాగా సంపాదిస్తున్నానని ఆయన భార్యకు చెప్పేవాడు.

పేకాటలో విశ్వంభరం డబ్బు సంపాదించే మాట నిజం అయితే పేకాట డబ్బు పేకాటకు తప్ప యెందుకూ వుప యోగపడదన్నది అందరకూ తెలిసిన నిజం. విశ్వంభరం డబ్బు సంపాదించే పద్ధతి వేరే వుంది. ఆయనకు ఓ కిడ్నాపర్సు గ్యాంగుతో పరిచయముంది.

ఆ గ్యాంగులో మొత్తం అయిదుగురు. విశ్వంభరం ఆరోవాడు. అంతా ఆయనలాంటివాళ్ళే! వాళ్ళ అవసరాలు మరీ పెద్దవికాదు. అప్పుడప్పుడు యింటి ఖర్చులు తట్టు కోవడం కోసం వాళ్ళు మనుషుల్ని ఎత్తుకొస్తూంటారు. వచ్చిన డబ్బుని అంతా పంచుకుంటారు.

వాళ్ళలో మంచి అవగాహన కూడా వుంది. ఒకరికోసం ఒకరు త్యాగాలు చేస్తూంటారు. విశ్వంభరం కూతురి పెళ్ళికి పాతికవేలు అవసరమయ్యాయి. పెళ్ళికావలసిన ఓ ధనికుడి పిల్లని కిడ్నాప్ చేశారు. పాతికవేలే అడిగారు. పోలీసుల జోలికి వెళ్ళినా, తమ ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నించినా ఆ పిల్ల జీవితం నాశనం చేయగలమని బెదిరించారు. పాతికవేలూ పుచ్చుకుని పిల్లని వదిలేశారు. ఆ పాతికవేలూ విశ్వంభరం ఒక్కడికే వెళ్ళాయి.

వాళ్ళలో వాళ్ళకి అకౌంట్స్ లేవు. ఎవరికి అవసరమయినా మిగతావారంతా సహాయపడతారు.

ఆరుగురిలో ఒకడు వేషాలు మార్చడంలో దిట్ట. వాడి అసలు వేషమేమిటో వాడికీ తెలియదనిపిస్తుంది. ఎత్తుకొచ్చిన మనుషుల్ని దాచడానికి రెండిళ్ళున్నాయి.

వీళ్ళడిగే మొత్తాలు చిన్నవి. అడిగేది మధ్యతరగతి కంటె ఓ మాదిరి మెరుగయినవాళ్ళని. వ్యవహారం ఎంతో మర్యాదగా వుండేది; హెచ్చరిక దారుణంగా వుండేది.

ఈ కారణాలవల్ల వీళ్ళ వ్యవహారం ఎన్నో ఏళ్ళుగా నిరాటంకంగా కొనసాగిపోతోంది. అసలు వీళ్ళ గురించి పెద్ద ప్రచారం కూడా లేదు.

ప్రజలకు పిరికితనం వుండడం, పోలీసులు వారి పిరికితనాన్ని పోగొట్టేంత సామర్థ్యాన్ని కలిగి వుండక పోవడం—యిలాంటి నేరస్థులకు వరాలుగా ఉపయోగపడుతున్నాయి.

ప్రస్తుతం విశ్వంభరానికి కొడుకుల దగ్గర్నుంచి కొంత డబ్బు వస్తోంది. ఆయన ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేశాడు. మూడేళ్ళ క్రితం వాళ్ళాయన న్నుద్యోగం నుంచి తప్పుకోమన్నారు. అందువల్ల పెన్షనులాంటిది వేరే యేమీ

లేదు. ఆ ఊళ్ళో ఆయనకు రెండిళ్ళున్నాయి. ఓ యింటికి నెలకు ఆరువందలు అద్దెవస్తూంది. రెండో యింట్లో ఆయన ఉంటున్నాడు. అప్పుడప్పుడు వచ్చిపోయే కుటుంబ సభ్యుల కోసం అది అద్దెకివ్వకుండా అలాగే వుంచేవారు.

తనకు వచ్చేదికాక సుమారు మరో వెయ్యి రూపాయలు అవసరపడుతూంటుంది విశ్వంభరానికి. ఆయనకు కొన్ని ఆదర్శాలున్నాయి. తను అప్పు చెయ్యడు. ఎవర్నీ డబ్బు కావాలని అడగడు. అవసరమైన డబ్బు సంపాదించి ఖర్చు చేయడమే ఆయన పద్ధతి.

ఆ నెలలో విశ్వంభరానికి కొత్త యిబ్బంది వచ్చింది.

నైట్‌క్లబ్బుకొక కొత్తపిట్ట వచ్చింది. ఆమె విశ్వంభరానికి బాగా నచ్చింది. ముసలివాళ్ళకు ఆమె రేటు ఎక్కువ పెట్టింది. ఒక వారంరోజులు ఆయనతో గడపడానికి ఆ పిట్ట ఒప్పుకుంది. అందుకు అయిదువేలు అడిగింది.

విశ్వంభరం తన అవసరం గురించి కిడ్నాపర్సు గ్యాంగుకి చెప్పుకున్నాడు. వెంటనే వాళ్ళు రంగంలోకి దిగారు.

ఓ పెద్ద కేసునేపట్టి అంతా తలో అయిదువేలు అయినా సంపాదించాలని వాళ్ళు అనుకున్నారు. అయితే టైము యెంతోలేదు. విశ్వంభరానికి నచ్చిన పిట్ట ఆ ఊళ్ళో రెండు వారాలు మాత్రమే వుంటుంది. వచ్చి అప్పుడే రెండ్రోజు లయింది. ఆమెతో ఆయనకు వారంరోజులైనా గడిపే అవకాశం రావాలి.

కంగారుపడితే ఆలస్యం పెరిగిపోతుంది. ఓ పట్టాన మంచి కేసు దొరకలేదు. అప్పుడు వాళ్ళో నిర్ణయానికి వచ్చారు పెద్ద కేసు సంగతి తర్వాత చూడవచ్చును. ముందు విశ్వంభరానికి అవసరమయిన అయిదువేలూ దొరికే

కేసైనా చాలును.

ఈ నిర్ణయానికి రాగానే వాళ్ళ అవకాశాలు పెరిగాయి. యాభై వేలు ఇచ్చుకోగల వారికంటె—అయిదువేలిచ్చుకో గల వారెలాగూ యెక్కువే వుంటారు.

వేషాలు మార్చగల కిడ్నాపర్ వుత్సాహంగా బయ లేరాడు. అతడి చేతిలో చందాల పుస్తకం వున్నది. అది తీసుకుని యింటింటికీ వెడుతున్నాడు. వారి పరిస్థితి అంచనా వేస్తున్నాడు. ఎవరెవరు ఎంతివ్వగలరు? ఎవరెవరింట్లో ఎవర్ని కిడ్నాప్ చెయ్యవచ్చు?—అన్నవి అతడు పరిశీలించే అంశాలు.

అయితే కిడ్నాపింగుకి అతడికి వచ్చిన అవకాశాలు చాలా తక్కువ. అప్పుడు స్కూళ్ళకు సెలవు కూడా. కానీ అతడి అనుభవం!

ఓ యింట్లోంచి పనిపిల్ల రెండేళ్ళ కుర్రాడిని ఎత్తుకుని బయటకు రావడం చూశాడు. ఆ కుర్రాడు బొద్దుగా, ముద్దుగా—ఎంతో బాగున్నాడు. అందులోనూ పనిపిల్ల చంకలో మరింత మెరిసిపోతున్నాడు. ఆ పిల్ల నల్లగా వుంది. ముఖం కళగానే వున్నా బట్టల కారణంగా మరింత జిడ్డుగా అగుపిస్తోంది.

ఆ పిల్ల రోడ్డుమీదకు వచ్చేక కిడ్నాపర్ ఆమెను పలక రించాడు.

"పాపా—ఈ బాబు మీ తమ్ముడా?"

"కాదండి—" అందామె.

"అరే—అచ్చం నీకులాగే వుంటేనూ—" అన్నాడు కిడ్నాపర్.

పనిపిల్ల సిగ్గుపడింది. కానీ తను పనిపిల్లనని చెప్ప

లేదు. దానికి బహుశా పధ్నాలుగేళ్ళ వయసుంటుందేమో! నీటుగా కనబడే ఓ మనిషి—తనను ఆ బాబుకు అక్కగా గుర్తించినందుకు ఆ పిల్లకు ఆశ్చర్యానందాలతోపాటు సిగ్గు కూడా కలిగింది.

"ఎక్కడికి వెడుతున్నావ్?"

"కొట్టుకండి...." అందామె.

ఇద్దరూ పక్క పక్కన కొంతదూరం నడిచారు. చుట్టూ జనసంచారం లేదు.

"ఒక్కసారి బాబుని ఎత్తుకుని ముద్దాడొచ్చా?" అన్నాడతను.

"అయ్యో—తీసుకోండి—" అంది పనిపిల్ల.

అతడు చేతులు చాపిందే తడవుగా బాబు నవ్వుతూ వచ్చేశాడు.

"బాబుకి కొత్తలేదు. అంతా తనవాళ్ళే ననుకుంటాడు" అంధి పనిపిల్ల

అతడు నటిస్తున్నాడు కానీ దృష్టి కుర్రాడిమీద లేదు.

ఉన్నట్లుండి స్కూటర్ ఒకటి వచ్చింది. అందుమీద యిద్దరున్నారు. వెనకాల కూర్చున్నవాడు కిడ్నాపర్ చేతిలోంచి బాబుని తీసుకున్నాడు. స్కూటర్ వెళ్ళి పోయింది.

"అరే!" అన్నాడతను.

పనిపిల్ల కంగారుగా—"అయ్య బాబోయ్—అయ్యగారు నన్ను చంపేస్తారు—" అంది.

అతను నిట్టూర్చుతూ—"బాబు నా చేతిలో బదులు నీ చేతిలో వుండాల్సిందేమో—నీ దగ్గర్నుంచి లాక్కోవడం కష్టమయ్యేది—" అన్నాడు.

పనిపిల్ల ఈ లోకంలోకి వచ్చింది—"కొంతలో కొంత

యిదీ మెరుగే. నా చేతుల్లోంచీ బాబు మాయమయితే....” అని ఆమె మాటలు పూర్తిచెయ్యలేక పోయింది. బాబు పోయాడన్న బాధ కంటె శిక్ష గురించిన బెంగ ఎక్కువగా వుంది ఆమెకు.

“నువ్వేం కంగారుపడకు—” అన్నా డతను. వున్నట్లుండి అతడు మళ్ళీ—“అరే!” అన్నాడు. అతడి చేతిలో ఏదో కాగితముంది-బాబు నెత్తుకొనిపోయిన వాళ్లతడి చేతిలో యేదో వుత్తరం యిచ్చారు. “నేను గమనించనే లేదు—” అన్నాడతను.

అతను వుత్తరాన్ని పైకి చదివాడు.

“ఈ వుత్తరం అందిన వెంటనే పి. పి. రావు పేరున అయిదువేలకు డ్రాఫ్టు తయారు చేయించి—యిందులో యివ్వబడిన అడ్రసుకు పోస్టు చేస్తే—మీ బాబు మీకు క్షేమంగా జేరుతాడు. లేనిపక్షంలో బాబు శవమే మీకు లభిస్తుంది—”

పనిమనిషి మళ్ళీ ఘొల్లుమంది. కిడ్నాపర్ ఆమెను తీసుకుని వాళ్ళింటికి వెళ్ళాడు. నెమ్మదిగా జరిగింది చెప్పాడు. వాళ్ళను సముదాయించాడు. కంగారు పడవద్దన్నాడు.

ఇంట్లో రకరకాల చర్చలు బయల్దేరాయి. కిడ్నాపర్ పోలీసులకి రిపోర్టివ్వడంలోని ప్రమాదం గురించి చెప్పాడు. అందువల్ల దొంగలు బయటపడవచ్చు. కానీ బాబు దక్కక పోవచ్చు.

“అయిదువేలు ఒక్కసారి ఎలావస్తుంది?” ఇంటాయన వాపోయాడు.

“అది నేను చెప్పలేను. ఏదో దారినపోయే దానయ్యగా సలహా ఇచ్చాను. పాపం—ఇందులో ఈ పిల్ల తప్పేమీ

లేదు. అది—చెప్పడానికే వచ్చాను—" అన్నాడు కిడ్నాపర్.

ఎవరూ కిడ్నాపర్‌ని అనుమానించలేదు. అతడు ఆ యింట్లో సంభాషణ వింటున్నాడు. ఒక్కసారి అయిదు వేలంటే వాళ్ళకు చాలా కష్టం అని గ్రహించాడు.

2

"ఈవేళ మాకు వీడు దొరికాడు—" అన్నాడు ఒక అతను నవ్వుతూ.

విశ్వంభరం ఆశ్చర్యంగా ఆ కుర్రాడివంక చూశాడు. ఇంత చిన్న కుర్రాడిని కిడ్నాప్ చేయడం తమ గ్యాంగుకు ఇదే ప్రథమం.

"మీ యిల్లే వీడికి శరణ్యం. ఈ ఒక్కరోజూ మీరు వీడితో గడపాలి. ఆ తర్వాత అయిదువేలూ తీసుకుని హాయిగా కొత్త పిట్టతో వారం రోజులు గడుపవచ్చు—" అన్నాడు రెండో అతను.

"చంటి పిల్లలంటే నాకు బోరు...." అన్నాడు విశ్వంభరం.

"వారం రోజుల సౌఖ్యంకోసం—ఒక్కరోజు తప్పదు మరి...."

విశ్వంభరం చంటి పిల్లల్నెన్నడూ చేరదియ్యలేదు. ఆయనకు వాళ్ళంటే చాలా చిరాకు. ఈ కుర్రాడితో ఒక రోజంటే ఆయనకు తలచుకుంటేనే బెంగగా వుంది.

"ఈ ఫ్లాస్కు నిండా పాలున్నాయి. రెండోది—ప్యాకెట్—ఇందులో బిస్కట్లు, బిళ్ళలు వగైరాలున్నాయి. డబ్బు దండగని బొమ్మలు కొనలేదు. మీ యింట్లో ఏమైనా వుంటే చూసి యివ్వు—మరి మేము వస్తాం...." అన్నారు వాళ్ళిద్దరూ.

విశ్వంభరం పిల్లవాడిని అందుకుందుకు చేతులు చాపాడు. వా డాయనకేసి చూసి నవ్వి—"తాత.... తాత...." అని చప్పట్లు కొట్టాడు.

ఆ మాటలు, నవ్వు యేదో కొత్త అనుభూతినిచ్చాయి. ఆయన చటుక్కున వాడిని యెత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు.

బాబు వెంటనే రెండో బుగ్గ చూపించి ముద్దు ముద్దుగా—"మరొక్కతీ...." అన్నాడు. విశ్వంభరం అప్రయత్నంగా ఆ బుగ్గమీద కూడా ముద్దు పెట్టుకున్నాడు.

అప్రయత్నంగా ఆయనకు క్లబ్బుసుందరి గుర్తుకు వచ్చింది.

ఈ రోజుకు వీణ్ణి భరిస్తే—ఆ సుందరిని కూడా తనిలాగే వారం రోజులు ఎడతెరిపి లేకుండా ముద్దులాడ వచ్చు. విశ్వంభరం నళ్ళు జలదరించింది.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. అక్కడ విశ్వంభరం, బాబు మిగిలారు. వాళ్ళు వెళ్ళిపోతూంటే బాబు "టాటా!" అంటూ చేతులూపాడు. అప్రయత్నంగా వెళ్ళిపోతున్న వాళ్ళు కూడా బాబుకి టా టా చెప్పారు.

బాబు విశ్వంభరం చంక దిగాడు. అక్కడున్న వస్తువులు చక్కబెట్టడం మొదలు పెట్టాడు. విశ్వంభరం కాసేపు ఆలోచనల్లో వున్నాడు. తర్వాత ఏదో చప్పుడై ఈ లోకంలోకి వచ్చాడు.

బాబు అక్కడున్న స్టూలుని లాగి మీద పడేసుకున్నాడు. దెబ్బ తగిలిందో ఏమో ఏడుపు లంకించుకున్నాడు

"ఈ పిల్లలతో ఇదే బాధ-ఇట్టే నవ్వుతారు. ఇట్టే ఏడుస్తారు...." అనుకున్నా డాయన. నవ్వినప్పుడైతే ఫరవాలేదు. ముద్దుగానే వుంటారు. ఏడిస్తేనే చిరాకు.

బాబు ఏడుస్తున్నాడు. ఏడ్చి ఏడ్చి వాడే ఊరుకుంటా డులే అనుకుంటూ ఆయన ఆలోచనల్ని దారి మళ్ళించడం కోసం అటూ యిటూ చూడసాగాడు. అప్పుడాయన దృష్టి హఠాత్తుగా గోడకు వ్రేలాడుతున్న ఓ పటం మీదకు మళ్ళింది. అందులో విశ్వంభరం తల్లి వుంది, ఆ తల్లి చంకలో విశ్వంభరం. అప్పుడు విశ్వంభరం వయసు రెండేళ్ళ ఉంటుంది.

విశ్వంభరం తల్లి ఫోటోని తన డ్రాయింగ్ రూంలో వుంచాలని చాలాకాలంగా అనుకున్నాడు. ఇంట్లో ఆవిడ ఫోటో ఒక్కటీ లేదు. ఆరా తియ్యగా తియ్యగా మేన మామల ఇంట్లో ఈ ఫోటో దొరికింది. దాన్ని పెద్దదిగా మళ్ళీ తీయించి ఇక్కడి తగిలించాడు. అతడికి ఆరేళ్ళ వయస్సులోనే తల్లిపోయింది. కానీ ఈ ఫోటోని చూస్తే అతడిలో ఏవో జ్ఞాపకాలు వస్తాయి. తను ఏడ్చినపుడల్లా తల్లి హృదయానికి హత్తుకోవడం అతడికి లీలగా గుర్తొ స్తూంటుంది. ఆ అనుభూతి అతడి కందించే ఆనందమింతా అంతా కాదు.

అప్పుడు విశ్వంభరానికి మళ్ళీ వినబడింది — బాబు ఏడుపు.

వాడింకా ఏడుపు ఆపలేదు. ఇల్లదిరిపోయేలా ఏడుస్తు న్నాడు. విశ్వంభరం చటుక్కున వాడిని సమీపించి స్టూలు పక్కగా లాగాడు—"ఏమ్మా ఏమయింది?" అన్నాడు జాలిని కంఠంలో ధ్వనింపచేస్తూ.

వాడు చెయ్యి చూపించి—"ఆయి—" అన్నాడు.

ఈమాత్రం భాష ఆయనకు అర్థమవుతుంది. ఏం చేయాలా అని ఆయన ఆలోచిస్తూందగా వాడే—"ఊదు" అన్నాడు. ఆయన వాడు చూపిన చోట ఊదాడు. వాడు

ఉత్సాహంగా లేచి "తగ్గిపోయిందీ" అన్నాడు.

మాటలు బాగానే వచ్చు వాడికి. స్పష్టంగా లేకపోయినా అర్థమవుతున్నాయి. వాడలా అనగానే విశ్వంభరానికి ముద్దు ఇచ్చి - బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు. వెంటనే వాడు రెండోబుగ్గ చూపించి—"ఇక్కలో!" అన్నాడు.

విశ్వంభరం ఇంక తన్ను తాను అదుపు చేసుకోలేక పోయాడు. వాణ్ణి ముద్దులతో ముంచెత్తాడు. ఆ తర్వాత చాలాసేపు ఈ ప్రపంచాన్ని మరచిపోయి వాడితో ఆడుకున్నాడు.

బాబు చాలా చలాకీ అయినవాడు. తాతగారి మంచితనాన్ని ఆసరాగా తీసుకుని వాడు చాలా అల్లరి చేశాడు. ఆయన్ని గుర్రాన్నిచేసి మీద ఎక్కాడు.

వాడు ఆకలి అంటే ఆయనోసారి పాలు ఇచ్చాడు. మరోసారి బిస్కట్ పెట్టాడు. ఇంకోసారి చాక్లెట్ పెట్టాడు. వాడు విశ్వంభరాన్ని లోకువకట్టి వరుసగా ఆకలి అనసాగాడు. ఆయనా అది గ్రహించి వాణ్ని మరో ఆటలోకి మార్చి మరిపిస్తూండేవాడు. విచిత్రమేమిటంటే ఆయనకు ఆకలి గుర్తు రావడం లేదు.

అంతా వాడితో అయిదారు గంటలాడుకున్నాక బాబు అలసిపోయి నిద్రకు పడ్డాడు. నిద్రపోతున్నవాడి ముఖం ఎంత అమాయకంగా వున్నదో! ఆయన చాలాసేపు వాడి ముఖం వంకే చూస్తూ కూర్చున్నాడు. మధ్య మధ్యలో కలలు వస్తున్నాయో ఏమో-ఉన్నట్లుండి వాడు నవ్వుతున్నాడు. ఆ నవ్వు ఎంతో మనోహరంగా వుంది.

తన్ను చూడగానే వాడు "తాత ... తాత ...." అనడం గుర్తు వచ్చిందాయనకు. ఆయన మనసు పరిపరివిధాల

పోయింది. అవును....తనూ తాతేగదా మరి! తనకు మనుమలున్నారు.

ఆయన చటుక్కున ఉత్తరాల ఫైలు తీశాడు. తన కొచ్చిన ఉత్తరాలన్నీ ఫైల్లోకి వేసేయడం ఆయన అల వాటు. వాటిని మరీ అంత శ్రద్ధగా చదవడం ఆయనకు అలవాటు.

ఇప్పుడాయన ఆ వుత్తరాలు చదువుతున్నాడు. అవి భార్య రాసినవి. తన కోసం తన వాళ్ళ నందరినీ వదులు కుని వచ్చి కొన్ని దశాబ్దాలు తనతో గడిపి - ఆపైన తన సాహచర్యం పనికిరాదని తెలిసి కొడుకులవద్ద కాలం వెళ్ళబుచ్చుతున్న ఓ యిల్లాలు రాసిన ఆ ఉత్తరాల నాయన కనీసం శ్రద్ధగా కూడా చదవలేకపోయాడు.

ఇప్పుడా ఉత్తరాలు చదువుతూంటే ఆయన మనసు చలించి పోతోంది. వాటినిండా ఆప్యాయత రంగరించ బడి వుంది. ఏ పండుగ జరిగినా, ఏ వేడుక జరిగినా భర్త గురించి ఆమె, తండ్రి గురించి బిడ్డలు తల్చుకుంటూం టూరు. విశ్వంభరం కూడా తమ మధ్యన వుంటే బాగుండు నని అనుకుంటూంటారు. వాటిలో మనవళ్ళ ముచ్చట్లు కూడా ఎన్నో వున్నాయి.

వాటినాయన ఎన్నడూ పట్టించుకోలేదు. ఇప్పుడు చదువుతూంటే—తానేం పోగొట్టుకున్నాడో అర్ధమవు తోంది.

విశ్వంభరం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆయనకు ఏడుపు కూడా రాబోతోంది. ఆ సమయంలో గదిలో ఏడుపు వినిపించింది.

బాబు నిద్ర లేచాడు.

"ఏమమ్మా ఏడుస్తున్నావు!" విశ్వంభరం అడిగాడు.

"అమ్మ....అమ్మ కావాలి...." అన్నాడు వాడు ఏడుపు ఆపకుండానే.

"బిస్కట్ యివ్వనా?"

"వద్దు....అమ్మ కావాలి...." వాడింకా ఏడుపు ఆపలేదు.

విశ్వంభరం వాణ్ణి మురిపించడానికి కొన్ని ప్రయత్నాలు చేశాడు. వాడు మరిచిపోయినట్లే మరిచి మళ్ళీ కొద్ది క్షణాల్లోనే "అమ్మ కావాలి...." అంటున్నాడు.

ఆయన వాడినెత్తుకుని డ్రాయింగ్ రూంలోకి తీసుకెళ్ళి గోడకు తగిలించిన ఒకో బొమ్మే చూపిస్తూ-వాటి గురించి ఏమేమో వివరిస్తూ తన తల్లి బొమ్మదాకా వచ్చి మాటలు రాక ఆగిపోయాడు.

ఫోటోలో అమ్మ....అమ్మని హత్తుకుని తాను....

అమ్మను హత్తుకున్న తన కళ్ళలో ఎంత ఆనందం.... ఎంత తృప్తి....

అప్రయత్నంగా ఆయన బాబు కళ్ళలోకి చూశాడు. వాడి కళ్ళలో దిగులు, విచారం....అందుక్కారణం.... వాడికి అమ్మ కావాలి....వాడికి నగలు వద్దు....డబ్బువద్దు బొమ్మలు వద్దు....పాలువద్దు....బిస్కట్లు వద్దు...."

అమ్మ కావాలి!

మరోసారి ఫొటోలో తన ముఖం చూసుకోబోయాడు. కానీ అతడి కళ్ళు ఫోటోలోని తల్లని గమనించాయి. ఆమె తనవంక క్రూరంగా చూస్తోంది "ఛీ! నీచుడా! అన్నెం పున్నెం యెరుగని పసిపాపను అమ్మకు దూరం చేస్తావా?" అని గద్దిస్తోంది.

ఆయన బాబు వీపునిమిరి "అమ్మ కావాలా?" అన్నాడు

సానునయంగా. బాబు ఊఁ అన్నాడు— "తీసుకువెడతానేం మరి బుద్ధిగా వుంటావా?" అన్నాడు.

"ఇప్పులే!" అన్నాడు బాబు.

విశ్వంభరం మరి జాప్యం చెయ్యలేదు. చెప్పాలంటే బాబుకంటే ఆయనకే తొందరగా వుంది. చిరునామా ఆయన దగ్గర వుంది. వెంటనే ఆయన వాళ్ళింటికి బయల్దేరాడు....

బాబుకి తన యిల్లు చూడగానే సంతోషంవచ్చి పెద్ద గొంతుతో "అమ్మా!" అని కేకపెట్టాడు. ఆ పిలుపుకే ఆ యింటి తలుపు తెరుచుకుంది. గుమ్మంలోవున్న స్త్రీని బాబు తల్లిగా ఊహించాడు విశ్వంభరం.

బాబు తన శాయశక్తులా ప్రయత్నించి విశ్వంభరంని విడిపించుకుని దిగి పరుగున తల్లిని చేరాడు. ఆమె వాణ్ణి ఒక్క ఉదుటున హృదయానికి హత్తుకుంది.

అప్పుడు విశ్వంభరానికి తన డ్రాయింగ్ రూంలోని ఫోటోను చూస్తున్నట్లే ఉంది. ఆయన ఇంట్లోకి వెళ్ళి ఓ కట్టుకథ చెప్పాడు. ఆ కథను వాళ్ళు నమ్మారు. ఆయన్నెంతగానో పొగిడారు.

"వీడినెవరో కిడ్నాప్‌చేసి అయిదువే లడిగారు. ఆ డబ్బెలా సంపాదించాలా అని కొట్టుకుపోతున్నాం. అదృష్టంకొద్దీ మీరు దేవుడిలా వీణ్ణి ఆ కిడ్నాపర్స్‌బారి నుంచి రక్షించి అటు డబ్బుబాధా, ఇటు వీడేమయ్యాడోనన్న బాధా తొలగించారు. మీ ఋణం యెలా తీర్చుకోవాలో తెలియడంలేదు...."

ఈ మాటలు ఇంట్లో చాలామంది అన్నారు.

ఆయన అక్కణ్ణించి బయటపడ్డాడు. సాయంత్రం

ఆయన మిత్రులు ఆయన్ను కలుసుకున్నారు. విశ్వంభరం వారికి జరిగింది చెప్పాడు.

"మన గ్యాంగులో ఇంతవరకూ యిలా యెవ్వరూ ప్రవర్తించలేదు. ఇందుకు నువ్వు సంజాయిషీ యిచ్చుకోవాలి" అన్నాడు ఒకడు.

"అదిసరే నీ నైట్‌క్లబ్ పిట్టకు ఏం సంజాయిషీ ఇచ్చుకుంటావు?" అనడిగాడు ఇంకొకడు.

"ఇప్పుడు దాని కౌగిలి నాకు అవసరంలేదు. అంతకంటే అద్భుతమైన అనుభూతినిచ్చే కౌగిలి గురించి నే నిప్పుడు తెలుసుకున్నాను" అన్నాడు విశ్వంభరం.

"ఏమిటది — ఆ చంటికుర్రాడిదా?" వెటకారంగా అన్నాడొకడు.

విశ్వంభరం తమాషాగా నవ్వి "అంత తేలికగా తీసిపారెయ్యకు. మనిషికి మూడు దశలు. బాల్యంలో అమ్మ కౌగిలి బాగుంటుంది. యౌవనంలో ప్రియురాలి కౌగిలి అవసర మనిపిస్తుంది. వృద్ధాప్యంలో మనుమలిచ్చే ఆనందం మరెవ్వరూ యివ్వలేరు. నేనిది మరిచిపోయి నా యౌవనాన్నే పునరుద్ధరించాలనుకుంటూ జీవితం గడుపుతున్నాను. అందువల్లనే నాకు తెలియని అసంతృప్తి నన్ను వేధిస్తోంది. ఈ రోజు అనుభవం నాకు నిజం తెలియజేపింది, నేనిప్పుడు నా భార్య దగ్గరకు వెడుతున్నాను...." అన్నాడు.

"అయితే కిడ్నాపింగ్‌కి ఇక స్వస్తి చెబుతావా?"

"నౌ ఐ రియలైజ్ దట్ అయామే కిడ్నాపింగ్ ఆఫ్ మై ఓన్ హేపీనెస్ (నా సంతోషాన్ని నేనే హరిస్తున్నానని నేను ఇప్పుడు గుర్తించాను) ఇంకా కిడ్నాపర్‌గా యెలా వుండగలను?" అన్నాడు విశ్వంభరం.

మిగతావాళ్ళు ఆలోచనలోపడ్డారు.

బహుకోణపు ఆట

ఎమ్.వి.వి. సత్యనారాయణ

ఊర్వశీ సెవెన్ స్టారు హోటల్.

మెయిన్ హాలులో రంగు రంగుల దీపాలు వెలుగుతున్నాయి. కుర్చీలలో ప్రేక్షకులు కూర్చున్నారు. వేదిక మీద ఆర్కెష్ట్రా మ్రోగుతోంది. పాశ్చాత్య సంగీతం మృదువుగా వినిపిస్తోంది.

వేదికమీద లైట్లు ఆరాయి.

సంగీతం స్థాయి పెరిగింది. డ్రంస్ మ్రోగాయి. బమ్‌మ్‌మ్....సంగీతం ఆగింది. వేదికమీద తెర తప్పు కుంది. రీటా ప్రత్యక్షమయింది.

సంగీతం తిరిగి ప్రారంభమయింది. సంగీతానికి అనుగుణంగా రీటా కదులుతోంది. రీటా ఒంటిన చిలక పచ్చ రంగు మాక్సీ ధరించింది. మాక్సీమాటున ఆమె శరీరం ఎర్రగా మిలమిలలాడుతోంది.

ప్రేక్షకులు ఆమె నాట్యాన్ని తన్మయత్వంగా చూస్తోన్నారు.

కుర్చీలోంచి అతడు అసహనంగా లేచాడు. కుర్చీల వరుసలోంచి కదిలాడు. మెయిన్‌హాలు చివరకు వచ్చాడు.

సిగరెట్ వెలిగించి పొగపీల్చసాగాడు అతడు.

"గిరీ!"

అతడు వెనక్కి తిరిగి చూశాడు. ఎవరో ముస్లిం యువకుడు.

"ఎవరు నువ్వు?" అడిగాడు గిరి.

"సలీం."

"నా పేరు నీకు ఎలా తెలుసు!"

"నీవు రీటా మొగుడివని కూడా తెలుసు."

"మర్యాదగా మాట్లాడటం తెలియదా?"

"నువ్వు రీటాను హత్య చేయాలనుకుంటున్నావు."

గిరి ఉలిక్కిపడ్డాడు.

"నాన్సెన్స్. నువ్వు ఏం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?"

"నీకు కోటీశ్వరుడి కూతురు లల్లితో పరిచయమైంది. లల్లికి నువ్వంటే మోజు. కాని నీకు యిప్పటికే పెళ్ళయి

నట్టు లల్లీకి తెలియదు. అంతేకాదు. నీ పెళ్ళాం హోటల్లో డాన్సులు చేస్తుంది. అదే నీకు ఆదాయం!"

"ఓహ్! నీకు చాలా విషయాలు తెలుసు."

సలీం నవ్వాడు.

హాలులో చప్పట్లు మ్రోగుతున్నాయి.

"లాంజ్‌లోకి వెళ్దాం" అన్నాడు సలీం.

"పద!" అన్నాడు గిరి.

ఇద్దరూ బయటకు నడిచి లాంజ్‌లో కూర్చున్నారు.

"నా విషయాలు నీకు ఎలా తెలుసు?" అనడిగాడు గిరి.

"అది నా వృత్తిరహస్యం."

గిరి చికాకుగా చూశాడు. "నేను రీటాను చంపాలనుకున్నాను. కాని యింకా స్థిరంగా నిశ్చయించుకోలేదు."

"కావాలంటే రీటాను నేను చంపిపెట్టగలను. అయితే నా ఫీజు రెండు లక్షలు మాత్రమే!"

"గుడ్‌గాడ్. చాలా ఎక్కువ."

"లల్లీ తండ్రి కోటీశ్వరుడు."

"అయితే....అదంతా నా చేతిలో పడుతుందా?"

"ప్రశ్నలడక్కు! రీటాకో లల్లీకో నీ సంగతి చెప్పమంటావా?"

గిరి మాట్లాడలేదు.

"లల్లీ తండ్రి రాజ్‌మోహన్‌గారికి యీ సంగతి తెలిస్తే చాలా ప్రమాదం! నీ ప్రాణాలు తీస్తాడు."

గిరి ఆలోచనలో పడ్డాడు. సలీంగాడిని రాజ్‌మోహన్ వరకూ వెళ్ళనివ్వకూడదు.

"ఆల్‌రైట్! నీకు లక్ష రూపాయిలిస్తాను!" అన్నాడు గిరి.

"బేరాలు వద్దుబ్రదర్! చెప్పినట్టు చెయ్యి."

"కాని యిపుడు నా దగ్గర పైసాకూడా లేదు."

"లల్లీ నీ సొంతమయాకనే."

"రీటాను ఎప్పుడు చంపుతావు?"

"రెండు రోజులలో."

"ఎక్కడ?"

"ఈ హోటల్‌లోనే."

"ఎలా చంపుతావు?"

"కత్తితో."

"నా మీదకు పోలీసుల దృష్టి మళ్ళుతుందేమో!"

"మళ్ళదు. ఆ రోజు రీటా ఎవరితోనో ఘర్షణ పడుతుంది. అతడు ఆమెను బెదిరించి పారిపోతాడు. దట్సాల్. ఆ రాత్రి రీటాను ఎవరో కత్తితో పొడిచి చంపుతారు."

"ఎల్లుండి రాత్రి యిక్కడే కాచుకుని వుంటాను."

"మారుపేరుతో రూం నెంబర్ 17 బుక్ చేసుకో. రీటా శవంతో నేను నీ గదికి వస్తాను. శవాన్ని తృప్తితీరా చూడు. తరువాత శవాన్ని వేదికమీదకు చేర్చుతాను. నువ్వు గది ఖాళీచేయి."

"రైట్!"

"జాగ్రత్త, నన్ను డబుల్ క్రాస్ చేయబోయావా? నువ్వే నష్టపోతావు!"

గిరి తల అడ్డంగా త్రిప్పాడు.

2

లల్లీ కారుదిగింది. రోడ్డును అటూ యిటూ చూచింది. ఆకుపచ్చ రంగు డాబావైపు నడిచింది. కాలింగ్ బెల్ నొక్కింది.

డిటెక్టివ్ శిరీష్ తలుపు తెరిచాడు.

"లల్లీ! నువ్వా? ఏమిటిలా వచ్చావు?" అడిగాడు శిరీష్.

లల్లీ లోపలకు నడిచింది.

శిరీష్ తలుపు మూసి ఆమెవెంట కన్‌సల్టింగ్ రూంలోకి కదిలాడు.

"నన్ను ఎవరో వెంటాడుతున్నారు" అంది లిల్లీ.

"వెంటాడడమా?" రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చున్నాడు శిరీష్.

శిరీష్‌కు లల్లీ తండ్రి రాజ్‌మోహన్ తెలుసు.

"నిన్న రాత్రి నేను ఊర్వశీ సెవెన్ స్టార్ హోటల్‌కి వెళ్ళాను. డాన్స్ ప్రోగ్రాం జరిగింది. మరో పావుగంటకి డాన్స్ కార్యక్రమం ముగుస్తుందనగా నేను బయటకు వచ్చేశాను. నా కారు డ్రయివింగ్ సీట్లో ఒక అట్టముక్క కనిపించింది. అట్టముక్క తీసుకువచ్చాను." లల్లీ హాండ్ బాగ్ తెరిచింది. తెల్లటి అట్టముక్క తీసింది. శిరీష్‌కి అట్టముక్కను అందించింది.

శిరీష్ అట్టముక్కను పరిశీలనగా చూశాడు. కార్డ్‌బోర్డ్ అట్ట. దానిమీద నల్లసిరాతో రాసివుంది.

'మాడం! కారు బ్రేకులు ఫెయిలయ్యాయి!' ఇంతే వుంది.

శిరీష్ తల పంకించాడు.

"కారును పరీక్షించావు. బ్రేకులు నిజంగా ఫెయిలయివున్నాయి" అన్నాడు.

"అవును" అంది లల్లీ హీనస్వరంతో.

"నీకు అనుమానం యెవరిమీద కలిగింది?"

"ప్చ్. చెప్పలేను. ఇంతకాలమూ నాకు శత్రువులు లేరనుకున్నాను."

శిరీష్ సాలోచనగా తలూపాడు.

"కాని రాత్రి మరో సంఘటన జరిగింది."

"చెప్పు."

"అప్పుడు రాత్రి పన్నెండు గంటలు దాటివుంటుంది. నాకు చటుక్కున మెలకువ వచ్చింది. గదిలో ఎయిర్ కండిషనర్ ఆగిపోయి వుంది. కరెంటు ఫెయిలయి వుంటుంది. జీరోవాట్ బల్బుకూడా ఆరిపోయివుంది. గాజు అద్దాల కిటికీ తెరవాలనిపించింది. మంచం దిగాను. కిటికీని సమీపించాను" లల్లీ ఆగింది.

లల్లీ శరీరం చిగురుటాకులాగా వణకుతోంది.

శిరీష్ ఆమెను పరిశీలించి చూడసాగాడు.

"కిటికీ అద్దాలలోంచి బయట పండు వెన్నెల కనిపిస్తోంది. కిటికీవద్ద యెవరో నిలబడి వున్నారు."

"మగా? ఆడా?"

"మగవాడే ననుకుంటాను. కిటికి అద్దాలకు మొహం ఆన్చి నా గదిలోకి చూస్తూన్నాడు. నేను అరవబోయాను. ఆకారం మెల్లగా కదిలింది. నడవాలోంచి వెళ్ళిపోయి వుంటుంది. నాకు యిక రాత్రంతా నిద్రపట్టలేదు."

"మీ నాన్నగార్ని పిలవలేదా?"

"నాన్నగారు తన గదిలో వున్నారు. మెట్లుదిగి వెళ్లాలి. నాకు ధైర్యం చాలలేదు."

"నాన్నగారికి చెప్పావా?"

"చెప్పాను. 'కలకన్నావేమో' అన్నారు. రాత్రి అసలు కరెంటు ఫెయిల్ కాలేదట!"

"చిత్రంగా వుంది."

"ఈ రెండు సంఘటనలనుబట్టి నన్ను ఎవరో వెంటాడుతోన్నట్టు నిర్ణయించుకున్నాను."

"డాన్స్ ప్రోగ్రాంకి నువ్వు ఒకత్తెవే వెళ్ళావా?"

"అవును."

"ఈ మధ్య నీకు కొత్త స్నేహితులు, పరిచయస్తులు ఎదురయ్యారా?"

లల్లీ కొద్దిగా సిగ్గుపడి "గిరి అనే అతడు స్నేహమయ్యాడు" అని చెప్పింది.

"గిరా? అతడెవరు?"

"ఒంటరివాడు. మంచివాడు. నాన్నగారు కూడా అతడంటే లైక్ చేస్తారు."

"ఇప్పుడు నన్ను ఏం చేయమంటావు?"

"నా కారు బ్రేకులు ఎవరు ఫెయిల్ చేశారు. ఫెయిల్ చేసినవాళ్ళే నన్ను ప్రమాదంలో పడకుండా హెచ్చరించారా? లేకపోతే నా మీద కక్ష గట్టినవాళ్ళ బారినుండి ఎవరో అప్పులు రక్షించారా? రాత్రి నా గదిలో కరెంటు ఫెయిలు కావడం ఏమిటి? కిటికీవద్ద వేచివున్నది యెవరు? ఈ విషయాలు తెలుసుకోవాలి మీరు" అంది లల్లీ.

డిటెక్టివ్ శిరీష్ అంగీకరించాడు.

3

లల్లీ యింటిముందు కారాపి, ఇంట్లోకి నడిచాడు శిరీష్. అతడి వెనుకనే సలీం వచ్చాడు.

శిరీష్ కంట్లో పడకుండా సలీం మొక్కల చాటుకు తప్పుకున్నాడు. మెల్లగా ఇంటి వెనక్కి చేరుకున్నాడు.

"రండి శిరీష్‌గారూ!" ఆహ్వానించాడు రాజ్‌మోహన్.

శిరీష్ నవ్వి ఆయనతో కరచాలనం చేశాడు.

"లల్లీ పెళ్ళి విషయంలో మీవద్దకే రావాలనుకుంటున్నాను" అన్నాడు రాజ్‌మోహన్.

లల్లీ సిగ్గుగా చూచింది.

ముగ్గురూ బల్లచుట్టూ కూర్చున్నారు. పంటవాడు ముగ్గు

రికీ ఫ్రూట్ సలాడ్ సర్వ్ చేశాడు.

"వరుడెవరు?" అడిగాడు శిరీష్.

"లల్లీ దృష్టిలో గిరి!" అన్నాడు రాజ్ మోహన్. "మిష్టర్ శిరీష్! మీరు గిరి గురించి వివరాలు సేకరించాలి. లల్లీకి అతడు తగిన వరుడా కాడా అన్న విషయం నేను నిర్ధారించుకోవాలి."

శిరీష్ తలూపాడు.

రాజ్ మోహన్ కొంతసేపు మాట్లాడి బయటకు వెళ్ళిపోయాడు.

"నీ గదికి వెళ్దాం. పద!" అన్నాడు శిరీష్.

లల్లీ తన గదికి అతడిని తీసుకువెళ్ళింది.

అద్దాల కిటికీనీ, నేలనూ పరీక్షించాడు శిరీష్. అద్దాల కిటికీలోంచి తోట కనిపిస్తోంది. తోటలో మొక్కలు కదులుతున్నాయి. శిరీష్ అటుప్రక్కనే చూడసాగాడు.

ఎవరో కాంపౌండ్ గోడ దూకి అవతలకు పడ్డారు.

శిరీష్ చటుక్కున మేడదిగి తోటలోకి వచ్చాడు. రోడ్డు మీద మోటారు సైకిలు స్టార్టయింది. సర్రున దూసుకు పోతున్న చప్పుడు వినిపించింది.

తోటలో అడుగుజాడలు కనిపించాయి.

"ఎవరండీ?" అడిగింది లల్లీ.

శిరీష్ ఆమెను పరిశీలనగా చూశాడు.

"ఇంట్లో కెమేరా వుందా! వుంటే ఫిలిం లోడ్ చెయ్యి" అన్నాడు.

4

రీటా నాట్యం ముగించింది. గ్రీన్ రూంలోకి ప్రవేశించింది. గౌను విప్పి దుస్తులు ధరించింది. మేకప్ తుడుపుకుంది. నిలువుటద్దంలోకి చూచి తెల్లబోయింది.

అద్దంలో అతడు తన వైపే చూస్తున్నాడు.

"ఎవరు మీరు?" అరచింది రీటా.

సలీం చప్పున ఆమెను సమీపించాడు. అరచేతితో ఆమె నోరు నొక్కి పెట్టాడు.

"అరవక! నేను చెప్పినట్టు చెయ్యి" అన్నాడు సలీం.

రీటా గింజుకోబోయింది.

"నువ్వు ముందు నడువు. నీ వెనుక న్యూస్‌పేపర్ పట్టుకుని నడుస్తాను. న్యూస్‌పేపర్లో పిస్తోలు పట్టుకుంటాను. నువ్వు ఏ మాత్రం అరిచావా నీ ప్రాణాలు తీస్తాను."

"ఎక్కడికి?" మూలిగింది రీటా.

"రూం నెంబర్ 16."

"ఎందుకు?"

"చెబుతాను."

"చంపుతావా?"

"ఇక్కడే చంపగలను."

"నన్ను అన్యాయం చేయక! సంసారం... చేసుకుంటున్నాను."

"వూఁ! నడువ్" అరిచాడు సలీం.

రీటా బయటకు నడిచింది ఆమెను అంటిపెట్టుకుని సలీం నడవసాగాడు. అతడి కుడిచెయ్యి న్యూస్‌పేపర్ మాటున వుంది. న్యూస్‌పేపర్ ఆమె వీపును తాకుతోంది. నడవాలో జనం కదులుతున్నారు.

రీటానూ ఆమెను అనుసరిస్తోన్న సలీంనూ మామూలుగా చూశారు వాళ్ళు.

రూం నెంబర్ పదహారు ముందు ఆగింది రీటా.

సలీం ఆమెకు గది తాళంచెవి అందించాడు. రీటా తాళం

తెరిచింది. ఇద్దరూ గదిలోకి నడిచారు. సలీం చటుక్కున తలుపు మూశాడు.

రూం నెంబర్ 17 లో గిరి వున్నాడు. అతడి కళ్ళు రూం నెంబర్ 16 కి అతుక్కుపోయి వున్నాయి. గదిలోకి సలీం వెళ్ళాడు. అతడికి ముందు రీటా వెళ్ళింది. గిరికి గుండెలు దడదడ లాడాయి.

పాపం రీటా! తనకి యెదురుగా వున్న గదిలోనే ఆమె చావుకి సిద్ధంగా వుంది.

నిముషాలు గడుస్తున్నాయి.

రూం నెంబర్ 16 తలుపు తెరచుకుంది. సలీం రూం నెం 17 వైపు చూశాడు. వరండాకి అడ్డంగా నడిచి 17 ముందుకు వచ్చాడు, గిరి చప్పున తలుపు తెరిచాడు.

"గది ఖాళీచేసి రూం నెం. 16 కి రా!" అన్నాడు సలీం వెనక్కి తిరిగి.

గిరి అతడి ఆదేశాన్ని తు.చ. తప్పకుండా పాటించాడు.

రూం నెం. 16 లో బెడ్ మీద రీటా వెల్లకిల పడి వుంది. ఆమె కళ్ళు మూసివుంది. ఛాతీమీద రక్తం ధారగా కారుతోంది. బెడ్ రక్తంతో తడుస్తోంది.

గిరి గజగజ వణికాడు.

సలీం కసాయివాడు. మనిషిని ఎంత సులువుగా చంప గలిగాడు.

"కత్తిని ఏంచేశావు?" అడిగాడు గిరి.

సలీం బల్లవైపు చూపించాడు. పింగాణీ ప్లేటులో కత్తి వుంది. ఎర్రగా లక్క పూసినట్లు వుంది. దీపం వెలుగులో కత్తి మిలమిల లాడుతోంది.

"ఫ్లష్ అవుట్‌లో వేసి కొట్టేస్తాను" అన్నాడు సలీం.

"అడ్డం పడితే?"

"ముక్కలుగా కత్తిరించుతాను."

"శవాన్ని ఏం చేస్తావు?"

"శవాన్నీ అంతే!" పకపక నవ్వాడు సలీం.

గిరి మెల్లగా బెడ్‌ని సమీపించాడు.

"నీ మాట నిలబెట్టుకున్నావు" అన్నాడు గిరి.

"ఇక కట్టుబడవలసింది నువ్వే!" సలీం బెడ్‌మీది రీటాను భుజానికెత్తుకున్నాడు. బాత్‌రూంలోకి నడిచాడు. గచ్చుమీద రీటాను దింపి పడుకోబెట్టాడు.

గిరి అది చూడలేనట్లుగా బయటకు నడిచాడు. రూం నెం. 16 తలుపు మూసుకుంది.

5

వరండాలో డిటెక్టివ్ శిరీష్ నిలబడి వున్నాడు. అతడిని చూడగానే గిరి గతుక్కుమన్నాడు.

"మిస్టర్ గిరీ! మీరు ఘోరమైన తప్పు చేస్తున్నారు?" అన్నాడు శిరీష్.

"ఏమిటి సార్?" అడిగాడు గిరి.

"మీకు ఈ వూళ్ళో యిల్లు వుంది. అయినా హోటలు గదుల్లో మకాం పెడుతున్నారు."

"దానికేముంది సార్! నాది మొదటినుండీ కాస్త విలాస జీవితం."

"ఇలా అయితే లల్లీ డబ్బు హారతి కర్పూరంలాగా హరించుకు పోతుంది."

"నాకు లల్లీ దొరికితే అంత కంటే కావలసిందేమిటి సార్? ఈ విలాస జీవితానికి స్వస్తి చెప్పేస్తాను."

"కాని రాజ్‌మోహన్‌గారు నీలాంటి విలాస పురుషుడికి తన కూతురును యివ్వదల్చుకోవడంలేదు."

"ఆఁ? నిజమా?"

"మీకు వుద్యోగం లేదు. అయినప్పటికీ విలాసంగా జీవిస్తున్నారు. మీకు డబ్బు ఎలా వస్తూంది?"

"మా నాన్న మంచి ఆస్తిపరుడు."

"ఆయన బతికి వున్నారా?"

"లేరు. ఆయన పోయిన దుఃఖాన్ని మరచిపోవడానికే యిలా...." గిరి గొంతు వణికింది.

శిరీష్ తల పంకించాడు.

"మీరు రూం నెంబర్ 17 ని బుక్ చేసుకున్నారు. అవునా?"

"మీరు నన్ను వెంటాడుతున్నారా?"

"అవును. ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పండి."

"రూం నెం 17 ని ఇప్పుడు ఖాళీ చేస్తున్నాను."

"కాని మీరు రూం నెం 16 నుండి వస్తున్నారు."

నెత్తిన పిడుగుపడినట్టు చూశాడు గిరి. "మా ఫ్రెండ్‌ని కలిసి వస్తున్నాను...." నసిగాడు.

శిరీష్ అతడిని పరిశీలనగా చూపి వెనుదిరిగాడు.

6

మారుమూల వీధిలో చిన్నసైజు పెంకుటిల్లు. పెంకుటింటి ముందు పోలీస్‌జీపూ, అంబులెన్స్ వాన్, మోటార్ సైకిలూ, డాట్సన్ కారు ఆగివున్నాయి.

జనం దూరం నుండి చూస్తున్నారు. ఇంటినిండా పోలీసులు వున్నారు.

ఇన్స్‌పెక్టర్ కుమార్ శవంమీదకు వంగాడు. సలీం శవం గోడ మూలన కూర్చున్నట్టుంది. గుండెల్లో కత్తి దిగివుంది. అతని రెండు చేతులకూ రక్తం అంటి వుంది. కళ్ళు మూసి వున్నాయి. కాళ్ళు బారజాపి వున్నాయి.

"శవానికి ఫోటోలు తీయడం ముగిసింది. కత్తిని బయటకు తీయండి—వేలిముద్రలు చెరగకుండా" అన్నాడు కుమార్.

"ఎవరో పారిపోతున్నార్సార్!" అరిచాడు సార్జంట్.

ఇద్దరు కానిస్టేబుల్స్ రోడ్డుమీదకు పరుగెత్తారు. ఒక వ్యక్తిని భుజాలుపట్టి ఇంట్లోకి లాక్కువచ్చారు.

శిరీష్ అతడిని సమీపించి, "గిరీ!" అన్నాడు.

గిరి గదిలోని శవాన్ని చూచి గజ గజ లాడాడు. కుమార్ అతడి షర్ట్ పట్టుకుని ముందుకు లాగాడు.

"ఎందుకు పారిపోతున్నావ్?" అరిచాడు కుమార్.

"సలీంను కలుసుకోవాలని వచ్చాను. పోలీసులను చూచి పారిపోబోయాను" అన్నాడు గిరి.

"నీకు యితడు ఎలా తెలుసు?"

గిరి తటపటాయించాడు.

"ఇతడు రాజ్ మోహన్‌గారి అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. ఇతడి భార్య రీటా హోటల్‌లో డాన్స్ చేస్తుంది. ఆ విషయం నేను రాజ్ మోహన్‌గారికి చెప్పాను. ఇతడూ సలీమూ కలసి నిన్న ఊర్వశి సెవెన్‌స్టార్ హోటల్ రూం నెం 16 లో కలుసుకున్నారు—" చెప్పాడు శిరీష్.

కుమార్ మోకాలెత్తి గిరిని డొక్కలో గుచ్చాడు. గిరి గింగరాలు కొట్టి నేలమీద పడ్డాడు. పెదిమ చిట్లి రక్తం కారుతోంది.

"నీకు రూం నెం 16 లో ఏం పనిరా? నువ్వే చంపావా యితడిని?" అరిచాడు కుమార్.

గిరి మొహంలో మృత్యువు కదిలింది.

"నాకు యేమీ తెలియదు సార్! లల్లీ గురించి నాకు

సమాచారం యిస్తానని....'' గిరి మొహం పచ్చడయింది.

కుమార్ కాలితో తన్నిన తన్నుకు గిరి గోడకు కొట్టుకున్నాడు. తల పట్టుకు కూర్చున్నాడు గిరి.

"రాత్రి నా రీటాను ఆ గదిలో చంపేశాడు వీడు!'' గొల్లుమన్నాడు గిరి.

గదిలో సూది పడితే వినిపించే నిశ్శబ్దం!

శిరీష్ తమాయించుకున్నాడు. "అందుకని నీకు యితడిమీద కక్ష రేగింది. లల్లీ కోసం రీటాను చంపివేయమన్నావు. ఇప్పుడు లల్లీ నీకు దూరమయింది. అందుకే సలీంమీద పగ తీర్చుకోవాలనుకున్నావు. అవునా?''

"నామీద నాకే పగ రేగింది. తర్వాత సలీంమీద. అతడితో మాట్లాడాలని వచ్చాను'' హీనస్వరంతో అన్నాడు గిరి.

"సార్జంట్! ఇతడిని లాకప్‌లో పెట్టించు. శిరీష్! పద! హోటల్ ఊర్వశికి!'' కుమార్ బయటకు నడిచాడు.

7

రూం నెం 16 ఖాళీగా వుంది. కుమార్, శిరీష్ గది, బాత్ రూం, టాయిలెట్ రూం వెతికారు. ఎక్కడా శవం లేదు.

డిటెక్టివ్ శిరీష్ బెడ్‌వద్ద ఆగాడు. గచ్చుమీద గొంతు కూర్చున్నాడు. నేలమీద మెరూన్ కలర్‌లో మచ్చ వుంది. శిరీష్ మచ్చను వేలితో రాశాడు. జిగటగా సాగింది మచ్చ.

శిరీష్ వేలిని వాసన చూశాడు.

అతడి కళ్ళు మెరిశాయి.

"కుమార్! ఇక్కడ తిలకం మచ్చ వుంది'' అన్నాడు శిరీష్.

"తిలకం మచ్చా? అంటే?...." కుమార్ ఆగాడు.

శిరీష్ బెడ్‌మీది దుప్పటి తొలగించాడు. బెడ్ అంతా ఎర్రటి మరకలున్నాయి. తలగడ ఎత్తాడు. తలగడ క్రింద ఎర్రటి జాకెట్టు, పమిట బట్టా వున్నాయి.

"రూం నెంబర్ 16 యింకా సలీమ్ పేరనే వుంది కదా" అడిగాడు.

"అవును. గది తాళంచెవి సలీం దుస్తులలో దొరికింది" కుమార్ టేబులువద్ద ఆగాడు. టేబులుమీద పింగాణీ సాసర్ వుంది. సాసర్‌లో పొడవుపాటి ఎర్రటి మరక!

"ఇది కత్తి గుర్తు!" అన్నాడు కుమార్.

"రీటాను చంపినట్టు గిరిని నమ్మించాడు సలీం. మై గుడ్‌నెస్! అయితే రీటా బతికి వుందా? ఆమె దొరికితే చాల విషయాలు తెలుస్తాయి" శిరీష్ బయటకు నడిచాడు.

గదిలోంచి కుమార్ క్రయిమ్‌బ్రాంచ్ ఆఫీసుకు ఫోన్ చేశాడు.

శిరీష్ పోర్టికోలో దర్యాప్తు మొదలుపెట్టాడు.

"సలీం తన వెంట ఒక బురఖా వేసుకున్న యువతిని తీసుకువెళ్ళాడు సార్!" అన్నాడు వాచ్‌మాన్.

"వాళ్ళు ఎటు వెళ్ళారు?"

"రోడ్డుమీదకు వెళ్ళారు సార్. సలీం ఆటోను పిలవడం విన్నాను."

"ఆటోను చూశావా!"

"చూశాను సార్!"

"ఎవరి దా ఆటో?"

"మూర్తిగాడు నడిపే ఆటో."

"మూర్తి అడ్రసు తెలుసా?"

వాచ్‌మాన్ చెప్పాడు.

8

డిటెక్టివ్ శిరీష్ ఆ యింటి ముందు ఆగాడు. మారు మూల సందులో వున్న తాటాకు యిల్లు అది.

యింటి తలుపులు దగ్గరగా వేసివున్నాయి.

శిరీష్ తలుపు తట్టాడు.

"ఎవరు?" అంది ఆడగొంతు.

"పాలవాడిని అమ్మగారూ!" అన్నాడు శిరీష్.

తలుపు మెల్లగా తెరుచుకుంది. శిరీష్‌ను చూడగానే ఆమె తిరిగి తలుపు మూయబోయింది.

శిరీష్ చటుక్కున తలుపు మధ్యకు చొరబడ్డాడు.

"రీటా!" అన్నాడు శిరీష్.

రీటా ఆశలు కూలిపోయినట్టు నేలమీద కూలబడి పోయింది.

"రీటా! నువ్వు చనిపోయినట్లు నాటకమాడావు. సలీంతో కలపి నాటకమాడటంలో నువ్వు కథ ర క్తి కట్టించావు. సలీంను చంపిన తర్వాత నువ్వు బయటపడ్డావు."

"నేను సలీంను చంపలేదు."

"మరి ఎవరు చంపారు?"

రీటా తన పెట్టెలోంచి ఓ కవర్ తీసింది. శిరీష్‌కి కవరు అందించి చెప్పసాగింది—

9

"మిస్టర్ రాజ్‌మోహన్! సలీం గదిలో నీ వ్రేలి ముద్రలు దొరికాయి. నీ వ్రేలిముద్రలు లల్లీ గది అద్దం మీద కూడా వున్నాయి. యూ ఆర్ అండర్ అరెస్టు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కుమార్, అతడికి హేండ్‌కప్స్ బిగిస్తూ.

"అబద్ధం! ఎవరో నామీద కుట్రపన్ని........" గింజు కుంటున్నాడు రాజ్ మోహన్.

"రీటా వద్ద కవర్ వుంది. ఆ కవరులో నీకూ రీటాకూ అక్రమ సంబంధం వున్నట్టు నిరూపించే పత్రాలున్నాయి. ఆ పత్రాలను సలీం సంపాదించి నిన్ను డబుల్ క్రాస్ చేయ బోయాడు.

సలీంచేత లల్లీని వెంటాడించి, ఆమెకు ప్రాణ గండం వున్నట్టు భీతిని పుట్టించావు. సలీంచేత ఆమె కారు బ్రేకులు పాడు చేయించి ఆమెను హెచ్చరించావు. నువ్వు రాత్రివేళ ఆమె గది అద్దంవద్ద నిలబడి ఆమెను బెదరించావు. నీ వేలిముద్రలు దొరికాయి. ఇదంతా ఎందుకు చేశావు?" అడిగాడు శిరీష్.

రాజ్ మోహన్ నీరుకారిపోయాడు అతడి దృఢత్వం చెదిరిపోయింది.

"అవును. సలీంను చంపాను. వాడు నా ఉప్పుతిని నాకే ద్రోహం తలపెట్టాడు. లల్లీని వెంటాడి గిరిమీద ఆమెకు అసహ్యం కలిగించమని చెప్పాను. కాని అతడు ఇటు నాతోనూ, అటు గిరితోనూ మూడో కోణంలో రీటాతోనూ కుమ్మక్కయాడు.

నాకు సహకరిస్తోన్నట్టే నటించాడు. నాకూ రీటాకూ వున్న అక్రమ సంబంధం విషయమై రుజువులు సంపాదించాడు. సలీం నన్ను బెదిరించాడు. బ్లాక్ మెయిల్ చేయ సాగాడు.

నేను నయానా భయానా చెప్పి చూశాను. చివరకు కత్తితో పొడవక తప్పలేదు" అన్నాడు రాజ్ మోహన్ తల వించుకొంటూ. □



వాణిశ్రీ

కాంచన గ్రహం

(గత సంచిక తరువాయి)

44

ప్రొఫెసర్ సైరన్ 20 సంవత్సరాలు అహోరాత్రాలు కృషిచేసి, వేలకొద్దీ యువకుల శ్రమతో, కోట్లకొద్దీ ధనం ఖర్చు పెట్టి రూపొందించిన చంద్రలోక నగరం అతి రమణీయంగా రూపొందింది.

రెండువందలమైళ్ళ లోపు కొండల మధ్య వెలిసిన నగరంలో మాత్రమే వాతావరణం వుండి. ఆ కొండల సరిహద్దు దాటితే వాతావరణం లేదు కాబట్టి వూపిరి అందక చనిపోతారని హెచ్చరికలు చేసే బోర్డులు పెట్టారు.

మరొక శతాబ్దానికి భూలోకంలో మనిషి వుండడానికి చోటు చాలకపోవచ్చు. లేదా యుద్ధ ప్రమాదంతో మనిషి మనుగడకే ప్రమాదం రావొచ్చు. అట్టి పరిస్థితిలో చంద్ర లోకం మానవ నివాసంగా మారుతుంది. నెమ్మదిగా చంద్ర లోకం మొత్తంలో వాతావరణం యేర్పాటు చేయవచ్చు. అదేమీ అసాధ్యమైన విషయం కాదు అని గైడ్ వివరించింది.

ప్రయాణీకుల్ని బస్సులో తీసుకెళ్ళి చంద్రలోక నగరానికి నీరు సరఫరా చేసే టాంక్ చూపించారు.

అదొక క్రేటర్. పదిమైళ్ళ వెడల్పుతో వుంది. దాన్ని వర్షపు నీళ్ళతో నింపారు. అక్కడ్నుంచి పైప్‌లతో ఫ్యాక్టరీలకు, యిళ్ళకు, హోటల్స్‌కి నీరు సరఫరా అవుతుంది. నీళ్ళు తగ్గినప్పుడు వర్షం కురిపించి నింపుతారు. అదేకాక చిన్న చిన్న క్రేటర్స్‌లో గూడా నీళ్ళు నింపారు. వాటిల్లో చేపల్ని పెంచుతున్నారు.

'ఆఫ్రికా పార్కు' అనే పేరుతో పెద్ద 'జూ' ఏర్పాటు చేశారు. భూలోకంలోని క్రూరమృగాలు తప్ప చిన్న చిన్న జంతువులు, పక్షులు ఎన్నో అందులో జీవిస్తున్నాయి. భూలోకంలో క్రమంగా అంతరించిపోతున్న ఎన్నో జీవులు యిక్కడ సురక్షితంగా పెరుగుతున్నాయి.

ఒకే ప్రాంతంలో ఆయిల్, ఇనుము లభించడంవల్ల, చుట్టూ కొండలు, మెత్తటి మట్టి వున్నందున అక్కడ సిటీ ఏర్పాటుకు వీలయింది.

రాత్రి పధ్నాలుగు రోజుల సమయంలో ఆయిల్‌తో ధర్మల్ స్టేషన్ నడుస్తుంది. సిటీకి కావల్సిన కరెంట్ తయారుచేస్తుంది. పగలు వున్నప్పుడు సోలార్ ధర్మల్ స్టేషన్ నుంచి కరెంట్ వుత్పత్తి అవుతుంది. అవన్నీ గైడ్ ప్రయాణీకులకు చూపించింది.

"భూమిమీద దొరికే అన్ని ఖనిజాలూ చంద్రుడిమీద దొరకడం ఆశ్చర్యంగా వుందే?" అని ప్రయాణీకులు సందేహం వ్యక్తపరిచారు.

"ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు. సౌరకుటుంబం అంతా ఒకే పదార్థంతో యేర్పడింది. అసలు భూమి నుంచి చంద్రుడు పుట్టాడని శాస్త్రజ్ఞులు వూహిస్తున్నారు గూడా! భూమిలో దొరికే సమస్త ఖనిజాలూ చంద్రుడిలో వున్నాయి. చంద్రుడిలోనే కాదు గురుడు, శుక్రుడు మొదలైన యితర గ్రహాలలో గూడా దొరుకుతాయి" అని చెప్పింది గైడ్.

చంద్రలోక నగరంలో ఫ్యాక్టరీలు, థియేటర్లు హాస్పటల్ మొదలైనవన్నీ కార్లలోనే వెళ్ళి చూశారు. కాని వాతావరణంలేని చంద్ర ప్రాంతాలకు ప్రెషరైజ్ చేసిన విమానాలలో త్రిప్పి చూపించారు.

విమానాల అద్దాలలో నుంచి చూస్తుంటే వేలకొద్దీ క్రేటర్స్ అంటే గుంటలు కన్పించాయి. కొన్ని మైలుకు మించని వ్యాసం గలవి, పెద్దవి 150 మైళ్ళ వ్యాసంతో లోతైనవి గూడా వున్నాయి. ఇవి ఎలా ఏర్పడ్డాయో చెప్పడం సాధ్యం కాదు. సైంటిస్టులు భిన్నమైన అభిప్రాయలు వెలిబుచ్చుతున్నారు.

1957 నుంచి రోదసీ నౌకలు ప్రయోగించీ, 1969 లో మానవులు చంద్రమండలంలో కాలు పెట్టినప్పుడు చంద్రుడి

గురించి పూర్తి వివరాలు తెలుసుకోగలిగాం గాని అంతకు ముందు కేవలం టెలిస్కోపులతోనే చంద్రుడిని పరిశోధించారు. చంద్రుడివైపుకు టెలిస్కోపును 1610 లో గెలీలియో త్రిప్పినప్పుడే ఎన్నో విషయాలు తెలియడం ప్రారంభించాయి. అంతకు ముందున్న ప్రాచీనులు చంద్రుడి గురించి వట్టి వూహాగానాలు మాత్రమే చేశారు.

టెలిస్కోప్‌లతో పరిశోధనలు చేసే రోజుల్లో నల్లగా విశాలంగా వున్న ప్రదేశాలను శాస్త్రజ్ఞులు సముద్రాలని అనుకున్నారు. వాటికి ఎన్నో పేర్లుపెట్టారు. కాలక్రమంలో అక్కడ సముద్రాలు లేవని తేలినా వాటికి ఆ పేర్లే స్థిరపడి పోయాయి. నేతి బీరకాయలో నెయ్యి వున్నట్లే అక్కడ సముద్రాలలో నీరు కూడాను.

యాత్రికులకు సముద్రాలను, క్రేటర్స్, పర్వతాలు అన్నీ విమానాలలో త్రిప్పి చూపించారు.

ఓషన్ ఆఫ్ స్టారమ్స్, సీ ఆఫ్ షవర్స్, సీ ఆఫ్ మిస్ట్స్ సీ ఆఫ్ వేపర్స్ మొదలైన సముద్ర ప్రాంతాలు అలాగే ఎన్నో చిన్న పెద్ద క్రేటర్స్ గూడా చూశారు. క్రేటర్స్‌లో 'టైకో' అనే క్రేటర్ నుంచి కాంతి కిరణాలు విరజిమ్మడం చూశారు.

క్రేటర్స్‌లో అన్నిటికన్నా పెద్దది 'క్లాలియస్'. దాని వ్యాసం 154 మైళ్ళు. అదొక లోకంలా కనిపిస్తుంది. దాన్నిండా మళ్ళీ చిన్న చిన్న క్రేటర్స్, పెద్ద పెద్ద పర్వతాలు నిండివున్నాయి. అరిస్టార్కస్, ప్లేటో, న్యూటన్ మొదలయిన క్రేటర్స్ వున్నాయి. వాటన్నిటికీ ప్రముఖ సైంటిస్టుల పేర్లు పెట్టారు. భారతదేశ సైంటిస్టు విక్రమ్ సారాభాయ్ పేరుతో గూడా అక్కడొక క్రేటర్ వుంది.

45

వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి.

ప్రయాణీకులంతా ఎంతో తృప్తి చెందారు. చంద్ర లోకంలో సైట్‌సీయింగ్‌తోపాటు థియేటర్‌లో సినిమాలు గూడా చూపించారు. గదిలోనే టెలివిజన్. కావాలనుకున్న సినిమాలు వేసి ఆనందపరిచారు.

భూలోకం వెళ్ళడానికి అంతా సన్నాహాలు చేసుకుం టుంటే గోవిందరాయుడు మాత్రం విచారగ్రస్తుడై వున్నాడు. అతను వూహించినట్లుగా ఏమీ జరగకపోవడం అందుకు కారణం. అరుణతార యెక్కడైనా కనిపిస్తుం దేమోనని వళ్ళంతా కళ్ళు చేసుకుని వెతికాడు. కాని నిరాశే ఎదురైంది.

"సర్ మే ఐ కమిన్?"

రూమ్ గరల్ కంఠం వినిపించింది.

"యస్."

తలుపు నెట్టుకుని ఆమె లోపలకి వచ్చింది.

"మీ కోసం ఎవరో వచ్చారు. పంపించమంటారా?" అంది.

"నా కోసమా?" ఆశ్చర్యపోతూ అన్నాడు గోవింద రాయుడు.

ఆమె తల వూపింది.

"పంపించు" అన్నాడు.

ఆమె వెళ్ళిపోయింది.

ఈ లోకంలో తనకోసం వచ్చినవాళ్ళు ఎవరై వుంటారు? ఒకవేళ తన కూతురు కాదుగదా! అతనిలో ఆశారేఖ మెరి సింది.

కాని తలుపు నెట్టుకుని వచ్చిన అతను కృష్ణచైతన్య.

"నమస్తే!" అన్నాడు అతన్ని చూస్తూనే.

ప్రతి నమస్కారం చేసి "చైతన్యా! నువ్వా!" అన్నాడు.

అనుకోని అతని ఆగమనం దిగ్భ్రాంతిని కలుగ జేసింది.

"ప్రయాణీకుల లిస్టులో మీ పేరు చూసి ఆశ్చర్య పోయాను. గోవిందరాయుడు ఫ్రమ్ ఇండియా అని వుంటే మీరు అవునా కాదా అనుకుంటూ చాలాసేపు సందేహించాను. యే సంగతీ తెల్సుకోవాలని వచ్చాను" అన్నాడు నవ్వుతూ.

"చాలా మారిపోయావు చైతన్యా!" అన్నాడు గోవిందరాయుడు అతన్ని నఖశిఖపర్యంతం చూస్తూ.

అతను నవ్వి "ఈ రోజు రాత్రికి బయల్దేరే స్పేస్ బస్‌లో నేనూ వస్తున్నాను" అన్నాడు.

"అలాగా! మీ ఐలాండ్ వరకేనా?"

"ఆఁ....తర్వాత ఇండియా వచ్చేస్తున్నాను" అన్నాడు చైతన్య.

గోవిందరాయుడు నివ్వెరపోయాడు.

"ఇండియానా!"

"ఆఁ....అవును" అన్నాడు.

"అమ్మాయి యేది? యిక్కడే వుందా?" అన్నాడు గోవిందరాయుడు.

"ఇక్కడే వుంది ప్రస్తుతం."

"మనతోపాటు భూగోళం రాదా?"

"ఉహూఁ....ఆమె రేపు రాకెట్‌లో అంగార గ్రహానికి ప్రయాణమైపోతోంది. దాదాపు పది సంవత్సరాల వరకూ

తిరిగిరాదు. పదేళ్ళ పని చేయడానికి కాంట్రాక్టు రాపిచ్చింది గూడా!" చైతన్య దిగులుగా అన్నాడు.

గోవిందరాయుడు అదిరిపడ్డాడు అతని మాటలు విని.

"నో....అలా జరగడానికి వీల్లేదు. అమ్మాయి ఎందుకు అలా ప్రవర్తిస్తోంది? చైతన్యా! ఏం జరిగింది మీ మధ్య!" గట్టిగా కేకలు పెట్టాడు గోవిందరాయుడు.

"సారీ రాయుడుగారూ! ఇందులో ఆమె తప్పు ఏమీ లేదు. నేనే పొరపాటుగా ప్రవర్తించాను. నా తప్పు ఎంతో వుంది. కాని ఆమె నన్ను క్షమించలేకపోతోంది. నేనెంతో ప్రాధేయపడాను. కాని ఆమె రాజీకి రావడంలేదు" చైతన్య జరిగినదంతా చెప్పాడు.

"నా దృష్టిలో ఇదేమంత తప్పు కాదు చైతన్యా! ఇటు వంటి బలహీనమైన చేష్టలు మానవ జీవితంలో ఎంతో సహజం. పరిస్థితుల ప్రభావంవల్ల అటువంటి పొరపాట్లు దొర్లుతూ వుంటాయి. ఆమె మొండి వైఖరి కలది. చెప్పే వాళ్ళు లేక అటువంటి దృఢమైన నిర్ణయం తీసుకుని వుంటుంది. నేనామెకు సర్ది చెప్తాను. నన్ను ఆమె దగ్గరకు తీసికెళ్ళు చైతన్యా!"

"ఈ చివరి సమయంలో ఏమీ లాభం లేకపోవచ్చు రాయుడుగారూ! ఆమె ఒప్పుకోదని నేను అనుకుంటున్నాను."

"ఆమె సంగతి నాకు వదలిపెట్టు. నువ్వు యిప్పటికీ మనస్ఫూర్తిగా ఆమెను ప్రేమిస్తున్నావా?"

"వూఁ...." అన్నాడు చైతన్య.

"నాకు నమ్మకం వుంది. తప్పకుండా నా మాట వింటుంది. మనతోపాటు ఇండియా తీసికెళ్ళిపోదాం. హాయిగా నా చివరి రోజులు మీ దగ్గరే గడుపుతాను" అన్నాడు గోవిందరాయుడు.

"అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి రాయుడుగారూ! మా బాస్ యిప్పుడు అంగార గ్రహాన్ని మానవ నివాస యోగ్యంగా చెయ్యాలచే పెద్ద ప్రాజెక్టు తలపెట్టారు. పదేళ్ళ పాటు ఆ కార్యక్రమం నిర్విరామంగా సాగుతుంది. ఇప్పుడు ఆయన తారను రిలీజ్ చెయ్యడానికి ఒప్పుకుంటారో లేదో?" సందేహిస్తూ అన్నాడు చైతన్య.

"ఆమె ఇష్టపడితే ఆయన్ని ఎలాగో అలా ఒప్పిస్తాను. ముందు నన్ను ఆమె దగ్గరకు తీసికెళ్ళు" అన్నాడు.

చైతన్య తల వూపాడు.

46

"ఎన్నాళ్టికి చూశానమ్మా నిన్ను. నేను బ్రతికివుండగా మళ్ళీ నిన్ను చూస్తాననుకోలేదు" అన్నాడు గోవింద రాయుడు ఆనందంతో వుబ్బిపోతూ.

"నాన్నా?" అంటూ వచ్చి తండ్రి చేతుల్లో వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది అరుణతార.

చైతన్య వాళ్ళిద్దరినీవదిలి దూరంగా వెళ్ళి నిల్చున్నాడు.

"ఇక్కడికి ఎలా వచ్చావు నాన్నా!" అంది ఆమె కొంచెంసేపటి తర్వాత.

గోవిందరాయుడు తను ప్రొఫెసర్ సైరన్ ప్రకటన చూసి ఎటువంటి ఆలోచనలకు గురైందీ చెప్పి మూడు వారాలుగా ఆమె కనిపిస్తుందేమోనని ఎంతగా ఆరాట పడిందీ చెప్పాడు.

"ఎవర్ని అడిగినా మీగురించి చెప్పలేదమ్మా!"అన్నాడు.

"చెప్పరు నాన్నా! యిక్కడ కట్టుబాటు అలాంటిది. ఎందరో గూఢచారులు మాలో చేరి చివరకు ఎప్పుడో ఒకప్పుడు దొరికిపోతూ ప్రాణాలు పోగొట్టుకుంటారు. అది మామూలుగా జరిగింది. ఇప్పటివరకూ గూఢచారు లెవరూ

బ్రతికి బట్టకట్టలేదు."

"గూఢచారి అని ఎలా కనుక్కుంటారు?"

"మాలోనూ గూఢచారులు వున్నారు. ఎవరేం చేస్తున్నదీ అతిథిగా వచ్చిన వాళ్ళతో ఎలా సంభాషించేదీ అంతా తెలుసుకుంటారు. మా గూఢచారులు అదృశ్య రూపాలలో వుండి అంతా కనిపెడుతూ వుంటారు."

"అదృశ్యరూపాలలోనా?"

"అవును. అదేమంత అసాధ్యమయింది కాదు" అంది ఆమె.

"అవున్లే మీ ప్రొఫెసర్‌కి ఏదీ అసాధ్యం కాదు. మనిషి బ్రతకటానికి వీల్లేని చంద్రమండలాన్ని విలాస యాత్రా కేంద్రంగా చేసిపారేశాడు. భవిష్యత్తులో అంగారకుడిని మానవలోకంగా తీర్చిదిద్దబోతున్నాడు. అటువంటివాడు ఏమయినా చేయగలడు" అన్నాడు గోవిందరాయుడు.

తండ్రీ, కూతురు అరగంటసేపు చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

"అమ్మా! చైతన్యతో నువ్వు మాట్లాడ్డం లేదటగా. అతను ఎంతో బాధపడుతున్నాడు. నువ్వు అంగార గ్రహం పైకి వెళ్ళిపోతున్నావనీ, మరి పదేళ్ళవరకూ రావని చెప్తున్నాడు. నిజమేనా?"

"అవును నాన్నా!" అంది తల వంచుకుని.

"నిన్నిక్కడకు తీసుకొచ్చింది అతను. ఒకప్పుడు అతన్ని నువ్వెంతగా ప్రేమించావో, ఏళ్ళ తరబడి అతని కోసం యెలా యెదురుచూశావో అదంతా మర్చిపోయావా?"

"లేదు నాన్నా! అదంతా జ్ఞాపకం వుంది. కాని నాకు అతను ద్రోహం చేశాడు నాన్నా! నేను ఇక అతనితో వుండదల్చుకోలేదు. నాకు జీవితం మీద విరక్తి కలిగింది.

నా బ్రతుకంతా మానవ కళ్యాణం కోసం పాటుపడాలని నిశ్చయించుకున్నాను. అందుకే అంగార గ్రహం వెళ్ళి పోతున్నాను. భవిష్యత్తులో మనిషి అక్కడ జీవించడానికి నేను అన్ని విధాలా సహాయపడాలనీ, నిస్వార్థంగా సేవ చేయాలనీ అనుకున్నాను."

"నువ్వింతగా ఎందుకు బాధపడుతున్నావు? అతను చేసిన ద్రోహం ఏమిటి?"

"అతను చెప్పలేదా?" రోషంగా చూసింది అరుణతార.

"చెప్పాడు కాని అదేమంత సీరియస్‌గా తీసుకోవలసిన విషయం కాదమ్మా! అటువంటి తప్పటడుగులు అందరూ వేస్తుంటారు" గోవిందరాయుడు సర్ది చెప్పబోయాడు.

"నిజమే. నాన్నా! నువ్వు అతన్ని వెనకేసుకొని ఎందు కొస్తున్నావో నాకు తెలుసు. నువ్వూ మగవాడివే గదా! పర స్త్రీలతో కులకడం మీకెవరికీ తప్పుకాదు" కోపంగా అంది అరుణతార.

"అది కాదమ్మా!"

"ఆయన ఎటువంటి కబుర్లు చెప్పేవాడో నీకేం తెలుసు. తన జీవితం మానవ కళ్యాణానికి అంకితమైందనీ, పెళ్ళి ప్రేమ స్త్రీ పురుష సంబంధాలు తుచ్ఛమైనవనీ....ఓహ్! ఎన్ని చెప్పేవాడు. నేను అవన్నీ నిజమనుకున్నాను."

అరుణతార అతనిపై తనకున్న కోపాన్నంతా వెళ్ళ గ్రక్కింది. అతనిమీద కోపం ఎక్కువై పోయి ఏడ్చింది. గోవిందరాయుడు ఆమెను అలా రెచ్చిపోనిచ్చాడు చాలా సేపు.

చివరకు అన్నాడు "పోనీ అమ్మా? అతని సంగతి అలా వుంచు. నా సంగతి కొంచెం ఆలోచించు. నాకు ఇప్పుడు ఎవరున్నారు నువ్వు తప్ప. మీ అమ్మ పోయి

అపరాధ పరిశోధన పోటీ-171

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-10-82 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు డిశంబరు '82 నెల సంచికలో ప్రచురిస్తాము.

1. గత నెలలో యీ నగరంలో పోలీస్ తిరుగుబాటు జరిగింది—? (లక్నో, బొంబాయి)

2. ఎన్నికలలో ఇది ప్రధాన పాత్ర వహిస్తుంది—? (డబ్బు, వాగ్దానాల పరంపర)

3. ఇది కొనుక్కోవాలంటె కూడా 'క్యూ' లో నిలబడాల్సి వస్తున్నది—? (కారు, స్కూటర్)

4. రాజకీయ హత్యలకు యీ జిల్లా పెట్టింది పేరు—? (వరంగల్, నల్లగొండ)

5. ఉరిశిక్షను రద్దుచేసి 'మరణశిక్ష'లను ఈ విధంగా అమలు చేయాలని కొందరి వాదం—? (ఎలక్ట్రిక్ చైర్, ఇంజెక్షన్)

చాలాకాలం అయింది. నా చివరి రోజులు నీ దగ్గర గడిపి ప్రశాంతంగా కళ్ళు మూయాలని కోరికగా వుంది తల్లీ. ఆలోచించు."

"లేదు నాన్నా! నా నిర్ణయాన్ని మార్చుకోలేను. నేను నువ్వు అంతా అశాశ్వతమే నాన్నా! రేపు నువ్వు ఆ తర్వాత నేను చనిపోవలసినవాళ్ళమే" అరుణతార వేదాంత ధోరణిలో మాట్లాడింది.

తండ్రి ఎంత బ్రతిమాలినా అరుణతార తన నిర్ణయం మార్చుకోవడానికి ఒప్పుకోలేను.

చాలా కాలం తర్వాత కూతుర్ని చూసిన తృప్తితోనే గోవిందరాయుడు సంతృప్తిపడవలసి వచ్చింది.

తర్వాత అక్కడికి చైతన్య వచ్చాడు. అతన్ని గమనించనట్లు ఎటో చూస్తూ కూర్చుంది ఆమె. ఆమె ముఖం కోపంతోను, రోషంతోను ఎర్రబడిపోయి వుంది.

"తారా!...." నెమ్మదిగా అన్నాడు చైతన్య.

ఆమె అతని వంక తీవ్రంగా చూసి "నాతో మాట్లాడవలసింది ఏమీలేదు. వెళ్ళండి. ఇక సెలవు తీసుకుంటాను నాన్నా!" అని చరచరా నడిచి వెళ్ళిపోయింది.

కృష్ణచైతన్య ముఖం అవమాన భారంలో కృంగిపోయింది. తలెత్తి గోవిందరాయుడి ముఖంలోకి చూడలేకపోయాడు.

"ఇక పద వెళ్దాం" గోవిందరాయుడే చైతన్య భుజం తట్టి అన్నాడు.

చైతన్య ఆమె వెళ్ళినవైపే చూసి దీర్ఘంగా నిట్టూర్చి "చూశారా! అరుణతార ఎంత మారిపోయిందో. ఆమె గుండె రాయిలా కఠినమై పోయింది" అన్నాడు.

"మార్పు మానవ సహజం చైతన్యా! నేను అల్లారు

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 49: డాక్టర్ శ్రీధర్ ఫారిన్ వెడుతూ, తన నర్సింగ్ హోమ్‌ను డాక్టర్ ప్రమీలకు అమ్మజూపాడు. తన నర్సింగ్ హోమ్‌వల్ల నెలకు అయిదువేల పైనే ఆదాయం వస్తుందని డాక్టర్ శ్రీధర్ తెలియజేశాడు.

ఆ విషయం నిజమేనని ప్రమీల వాకబుచేసి తెలుసుకున్నది. నర్సింగ్ హోమ్ కొనటానికి తన అంగీకారం తెలిపింది. ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరింది.

అంతలో, శ్రీధర్‌కు అనారోగ్యం చేసి, ప్రాక్టీసు పడిపోయి, నర్సింగ్ హోమ్‌కు పేషంట్లు రావడం మానేవారు. అందువల్ల నర్సింగ్ హోం కొనే ఆలోచన విరమించుకున్నది ప్రమీల. శ్రీధర్ ఆమెపై పరువునష్టానికి దావా వేశాడు.

దావా మీ దగ్గరికే వస్తే, జడ్జిగా మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-10-'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు నవంబరు '82 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 47 (తీర్పు)

రామారావు కేసు ఓడిపోతాడు.

రామారావు ఆ వస్తువులను డబ్బిచ్చి కొన్నప్పటికీ, వాటిని అమ్మిన గంగులుకు ఆ వస్తువెపై ఏ విధమైన హక్కులూ లేవు. గంగులుకు వాటిని అమ్మే హక్కు వున్నదా, లేదా నిర్ధారణ చేసుకోకపోవటం రామారావు పొరపాటు. ఆ వస్తులపై అధికారం స్వంతదారుడే. అవి అతనికే చెందుతాయి.

ఈ నెల న్యాయనిర్ణేత: డాక్టర్ ఏ. సత్యవతి, ఎమ్.ఎస్.సి., ఎమ్.ఇడి., పి.హెచ్.డి., ఓల్డు పోలీస్ లైన్, విజయనగరం-531 202.

ముద్దుగా పెంచాను. ఎమ్మెస్సీ వరకూ చదువు చెప్పించాను. ఫారిన్‌లో కూడా చదువుకోమన్నాను. అయినా అది నా మాట విన్నదా? నాతో మాటమాత్రం చెప్పకుండా సీతో వచ్చేసింది. నేనూ అప్పుడు నీలాగే బాధ పడ్డాను ఎంత మారిపోయిందో అని.'' అన్నాడు గోవిందరాయుడు.

17

హేలీ డయానా హోటల్లో సెండాఫ్ పార్టీ ఇవ్వబడింది. ప్రయాణీకులందరికి చంద్రలోకంలో దొరికిన వజ్రాలు పొదిగిన వుంగరాలు ప్రెజెంట్ చేశారు. నున్నగా చెక్కిన చంద్ర శిలలు రకరకాల ఆకారాలలో వున్నవి గుర్తుగా ఇచ్చారు.

హోటల్ నుంచి బస్సులో స్పేస్ పోర్టుకి చేరుకున్నారు.

దూరంగా పిలీని సూపర్ స్పేస్ బస్ ప్రయాణానికి సిద్ధంగా వుంది. బస్‌లో ఎక్కడానికి ఆదేశం కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

స్పేస్ పోర్టు కాంటీన్ దగ్గర నిలబడి టీ కాఫీ త్రాగే వాళ్ళు కొందరు, అటూ ఇటూ పచార్లు చేస్తూ ఆఖరిసారిగా మూన్ సిటీవైపు దిగులుగా చూస్తున్నవాళ్ళు కొందరు, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ సోఫాల్లో కూర్చుని కాలక్షేపం చేస్తూ మరికొందరితో అంతా కోలాహలంగా వుంది.

గోవిందరాయుడు కృష్ణచైతన్య ఒకే సోఫాలో కూర్చుని వున్నారు. ఇద్దరూ సంతోషంగా లేరు. ఏదో పోగొట్టుకున్నట్లు దిగులుగా, మాటలు మర్చిపోయినవాళ్ళలా దిక్కులు చూస్తున్నారు.

"చైతన్యా!'' గోవిందరాయుడు పలకరించాడు.

"ఊఁ....'' అన్నాడు చైతన్య.

"భూమికి చేరుకున్నాక నాతోపాటు ఇండియా వచ్చే

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హెూమ్ డెలివరీ' లో చేరండి!

స్తావా? లేక ఆలశ్యం వుంటుందా?"

"ఆలస్యం ఏమీలేదు. మీతోపాటే వచ్చేస్తాను."

"మంచిది. మా ఇంట్లోనే వుండొచ్చు."

"హైదరాబాద్‌లో నాకు ఇల్లు వుంది."

"ఎక్కడ!"

"బంజారాహిల్స్‌లో. అక్కడే వుంటాను."

"నీ ఫ్యూచర్ ప్రోగ్రామ్ ఏమిటి? అక్కడ ఏం చెయ్య దల్చుకున్నావు?" ప్రశ్నించాడు గోవిందరాయుడు.

"దేశానికి సేవ చేస్తాను" అన్నాడు చైతన్య.

గోవిందరాయుడు పక పక నవ్వాడు. చైతన్య ఆయన వంక అయోమయంగా చూశాడు.

"ఎందుకు నవ్వుతున్నారు? నా నిజాయితీని శంకిస్తు న్నారా?" సీరియస్‌గా అన్నాడు.

"అహఁ.... అదికాదు. దేశసేవ అంటేను నవ్వొచ్చింది."

"ఏం?"

"మరేం లేదు. ఇండియాలో దేశసేవ చేస్తాననేవాడిని ప్రజలు నమ్మరు. ప్రజాసేవ, దేశసేవ అని గొంతులు చించుకుని అరిచి పదవుల్లోకి వెళ్ళినవారంతా కోట్లు గడించి ఇళ్ళు చక్కబెట్టుకుంటున్నారు. అక్కడ నాయకుడనేవాడికి సిగ్గూ సెరం, మానాభిమానాలు, నీతి నిజాయితీ వగైరా లేనట్లే ప్రజలు జమ కడుతున్నారు. ఒకప్పుడు ఖద్దరు టోపీ పెట్టి, ఖద్దరు బట్టలు తొడిగిన వాళ్ళను గాంధీ శిష్యు లని ప్రజలు గౌరవించేవాళ్ళు. ఇప్పుడు వాళ్ళకంటే బంది పోట్లు నయం అనే స్థితికి వచ్చారు. అటువంటి వాళ్ళ మధ్య నువ్వెందుకు....!"

గోవిందరాయుడు మాటలకు అడ్డు వస్తూ "మీరు నన్ను పొరపాటుగా అర్థం చేసుకున్నారు. ప్రజాసేవ, దేశసేవ

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 100-00 లు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—10—'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హో౦.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు నగదు బహుమతితోపాటు, ఐదు నెలలు పత్రికను కూడా పంపుతాము. ఫలితాలు నవంబరు '82 నెల సంచికలో చూడండి.

ఆగస్టు '82 పోటీ ఫలితాలు

(1) ఆగస్టు' 82 నెల "అపరాధపరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

శిరసుల శిఖరం!

పడతుల శపథం!!

పంపినవారు: శ్రీ వింజమూరు కృష్ణమూర్తి, కెనరా బ్యాంక్, పోస్ట్ బాక్స్ నెం. 1045, బషీర్‌బాగ్, హైదరాబాదు-29.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

మార్జాలంపై,

మారణాస్త్రమా !!

పంపినవారు: శ్రీమతి డి. పరిమళ, ఎమ్.ఏ., తెలుగు లెక్చరర్, ఆంధ్రరత్న రోడ్, విజయవాడ-3.

చెయ్యడానికి రాజకీయాల్లోకి దిగనవసరం లేదు. అందుకు పదవే కావాలని అనుకోవడం పొరపాటు" అన్నాడు చైతన్య.

"అది గుర్తించిన వాడిని నిన్నే చూశాను. ఇంత వరకూ" అన్నాడు గోవిందరాయుడు.

"నా జీవితం పూర్తిగా ప్రజలకు సహాయపడడంలోనే గడపాలని నిశ్చయించుకున్నాను."

"ఏం చెయ్యాలని అనుకుంటున్నావు?"

"నేను ప్రొఫెసర్ సైరన్ ప్రాజెక్టులో 15 సంవత్సరాలు సిన్సియర్‌గా పనిచేశాను. అందుకు బహుమానంగా నాకు ఒక ఫార్ములా ఇచ్చాడాయన. నా మాతృదేశానికి సేవ చెయ్యాలనే తపన, నాలో వ్యాపార దృష్టి లేకపోవడం గుర్తించి ఆయన ఈ బహుమానం ఇచ్చారు. నేను ఇండియా వెళ్ళిపోవడానికి అనుమతి గూడా దొరికింది."

"ఏమిటి ఆ ఫార్ములా?"

"ఫార్ములా ఒక్కటేగాని అందులో రెండు ప్రయోజనాలున్నాయి. మనం కావాలనుకున్న ప్రదేశాలలో నీటి మేఘాలు సృష్టించి వర్షం కురిపించడం. రెండోది మండిపోయే ఎండల్ని కంట్రోల్ చేసి ఆ ప్రాంతాల్లో శీతల శీతోష్ణస్థితి కల్పించి మంచుతుంపరలు వర్షించేటట్లు చెయ్యడం. ఒక్క మాటలో చెప్పాలంటే నగరాలకు నగరాలనే ఎయిర్ కండిషన్‌గా మార్చడం అన్నమాట. దీన్ని ఎయిర్ కన్వర్టర్ అంటారు" అన్నాడు చైతన్య.

"వెరీగుడ్ చైతన్యా! నీ పథకం ప్రకారం ఇండియాలో కరువు దూరమైపోతుంది. ప్రజలంతా సుఖపడతారు. ఇండియా కూడా సంపన్న దేశాలలో ఒకటి అవుతుంది" సంతోషం వ్యక్తపరిచాడు గోవిందరాయుడు.

అపరాధ పరిశోధన పోటీ-169

[ఫలితాలు]

ఆగస్టు '82 నెల "అపరాధ పరిశోధన పోటీ — 169"కి సరియైన సమాధానాలు:

1. వెంకటస్వామి
2. మరీచిక
3. ఎన్నికలు
4. ఎడిటర్
5. నాయకులు

పై జవాబుల ప్రకారం ముగ్గురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి నవంబరు '82 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ కె. నాగభూషణ, లైన్‌మాన్,
టెలిఫోన్ ఎక్స్ఛేంజ్,
దేవనహళ్ళి - 562 110,
(బెంగుళూరు జిల్లా).

(2) శ్రీమతి అరుణా రాజేష్, బి.ఎస్.సి.,
జ్యోతి బజార్,
అనకాపల్లి-531 001,
(విశాఖపట్టణం జిల్లా).

(3) శ్రీమతి డి. కళావతి,
w/o డి. దయానంద్,
ఉప్పల-505 101,
(కరీంనగర్ జిల్లా).

"అన్నీ వుండి అల్లుడి నోట్లో శని అన్నట్లు ఇండియాలో అన్ని వనరులూ వుండి కూడా ప్రజలు దుర్భర దరిద్రం అనుభవిస్తున్నారు. స్వార్థపరులైన రాజకీయ వాదుల దుశ్చర్యలవల్ల ఇండియాకి శని పట్టింది. లేక పోతే ఎప్పుడో సంపన్నదేశాల జాబితాలో చేరి వుండేది" అన్నాడు చైతన్య.

"డియర్ జంటిల్‌మెన్. అంతా స్పేస్ బస్‌లో ఆశీనులు కమ్మని రిక్వెస్టు చేస్తున్నాం. స్పేస్ బస్ బయల్దేరడానికి సిద్ధంగా వుంది. పోర్టులోవున్న కార్లలో మీరు ఎయిర్‌బస్ దగ్గరికి చేరడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. ప్లీజ్ క్విక్."

స్పీకర్‌లో నుంచి ఎనౌన్స్‌మెంట్ వచ్చింది. కొన్ని నిముషాల తర్వాత మళ్ళీ అదే రిక్వెస్ట్.

ప్రయాణీకులు స్పేస్ బస్ దగ్గరికి చేరుకున్నారు. గోవిందరాయుడు, చైతన్య బస్‌లోకి వెళ్ళారు. తమకి కేటాయించిన సీట్లలో కూర్చోబోతూ ఆమెను చూసి సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు.

"తారా! ...." నమ్మలేనట్లు చూస్తూ కలవరిస్తున్నట్లు గొణిగాడు చైతన్య.

ఆమె చైతన్యను చూపి లేచి నిల్చుంది. అతను ఆమె దగ్గరగా వెళ్ళాడు.

అరుణతార రెండు చేతులూ చాచింది నీళ్ళు నిండిన కళ్ళతో. ఇద్దరి శరీరాలు ప్రేమతో పెనవేసుకున్నాయి పరిస రాలను మర్చిపోయి.

—: సమాప్తం :—

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page

Regd.no:H/HD-48
PRABHAKAR